# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 17-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 163 | పేజీలు: 8 | వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

మత్తు సాలీడు
యువశక్తి గోదారి
మార్పు రావాలి.

పద్మ కుసుమం
కిన్నెర మెట్ల పైన
ఎంత సుదినం.

ఓట్ల పండుగ
కాసులు కానుకలు
ప్రగతికి తూట్లు.

సొరచేపలు
గాలానికి చిక్కవు
వృధా సమయం.

రొక్కంలెక్కలు
ప్లస్ మైనస్‌ల గొడవ
మిగులు లాభం.



– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

వ్యతిరేక 'ఫ్రంటు' పెట్టి
ముగ్గురు ముఖ్య మంత్రులు!
'భరతదేశవీణ' పట్టి
మీటగలరా తంత్రులు ?

భిన్నత్వంలో ఔనా
ఏకత్వం సాధనా ?
తెరలేపితే ఔతుందా
అది అరణ్య రోదనా?



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ఆగమైతే మళ్లీ తెలంగాణను ఆంధ్రాలో కలిపేస్తారు : మంత్రి కేటీఆర్

నిజామాబాద్, ఫిబ్రవరి 16:కంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. దేశంలోని రైల్వేలు, ఎయిరిండియా, జీవిత బీమా లాంటి అనేక సంస్థలను మోదీ అమ్మేస్తుండు.. మీరు ఓ నాలుగు రోజులు అవకాశం ఇస్తే తెలంగాణను తీసుకుపోయి మళ్లీ ఆంధ్రాలో కలిపేస్తడు. మమ్మల్ని కూడా అమ్మేస్తాడు. బీజేపీ నాయకుల లొల్లికి పొరపాటున యువత ఆగమైతే మళ్లీ తెలంగాణను, ఆంధ్రాను కలుపుతరు ఈ పుణ్యాత్ములు. అంత దారుణమైన మనషులు వీళ్లు. కేంద్రం సహకరించినా, సహకరించకపోయినా తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కేటీఆర్ అన్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి కేటీఆర్.. రూ. 120 కోట్ల వ్యయంతో నిర్మించే సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సిద్ధాపూర్ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు.

టీఆర్ఎస్ పార్టీ రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రజలను ప్రజలుగా చూస్తుందని కేటీఆర్ అన్నారు. మతం ఏదైతేనేమి.. రక్తం ఒక్కటే కదా. బీజేపీ నాయకులు ముస్లింల మీద విషం చిమ్మడం పనిగా పెట్టుకున్నారు. తెల్లారిలేస్తే విషం నింపుడు, ద్వేష ప్రచారం చేస్తున్నారు. మనసు, శరీరం నిండా విషం తప్ప, విషయం లేదు. ఏడున్నరేండ్లలో మోదీ తెలంగాణకు ఏం ఇవ్వలేదు. 157 మెడికల్ కాలేజీలు మంజూరైతే.. తెలంగాణకు గుండు సున్నా. 87నవోదయ పాఠశాలలు మంజూరు చేస్తే.. తెలంగాణకు గుండు సున్నా. కొత్తగా 8 ఐఐఎంలు మంజూరైతే తెలంగాణకు గుండు సున్నా. 16 ఐసెర్‌లో ఇస్తే రాష్ట్రానికి ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఇందుకేనా మా కార్లకు బీజేపీ కార్యకర్తలు అడ్డం వచ్చేది. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెడికల్ కాలేజీలు, గురుకుల పాఠశాలలు మంజూరు చేశాం. ఆగమాగం అవొద్దు.. ఆలోచనతో ఉండండి. తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని బీజేపీ నాయకులకు కేటీఆర్ సవాల్ విసిరారు.

తెలంగాణ కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేటీఆర్ తెలిపారు. అలాంటి తెలంగాణ పుట్టుకను మోదీ ప్రశ్నిస్తున్నారు. అన్యాయంగా తలుపులు బంద్ పెట్టి తెలంగాణను ఇచ్చారని మోదీ అంటున్నారు. కర్ణాటకలోని అప్పర్ భద్రకు జాతీయ హోదా ఇచ్చారు. కానీ తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వరు. మా పట్ల ఇంత కక్ష, వివక్ష ఎందుకు? తెలంగాణ ఈ దేశంలో భాగం కాదా? తెలంగాణ పుట్టుకనే ప్రశ్నించిన పార్టీకి ఈ రాష్ట్రంలో పుట్టగతులు ఉండాల్నా.. తరిమికొట్టాల్నాఅనేది ఆలోచించాలని కోరుతున్నాను. తెలంగాణలో పుట్టిన బీజేపీ నాయకులకు ఏ రోగం వచ్చింది. ఎంతసేపు మోదీ భజన చేయడమేనా? మోదీని నిలదీసే ప్రయత్నం చేయరా? గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలోనే స్పష్టంగా చెప్పారు. ట్రైబల్ యూనివర్సిటీ పెట్టరు కానీ వాట్సాప్ యూనివర్సిటీని దివ్యంగా నడుపుతున్నారు. గిరిజనుల రిజర్వేషన్లను పెంచరు. వీటన్నింటిని ప్రశ్నిస్తే కేంద్రం నుంచి ఉలుకు పలుకు లేదు. యూపీకి, ఉత్తర భారత్‌కే మోదీ ప్రధాని మంత్రి. తెలంగాణకు ఒక్క పని కూడా చేయరు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

## కేసీఆర్‌కు మద్దతు తెలిపిన ఉద్ధవ్ థాక్రే.. 20న మహారాష్ట్రకు సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మహారాష్ట్ర పర్యటన ఖరారు అయింది. ఈ నెల 20వ తేదీన మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ థాక్రేతో సీఎం కేసీఆర్ భేటీ కానున్నారు. మహారాష్ట్ర సీఎం ఆహ్వానం మేరకు 20న కేసీఆర్ ముంబయికి వెళ్లనున్నారు. బుధవారం ఉదయం సీఎం కేసీఆర్‌కు ఉద్ధవ్ థాక్రే ఫోన్ చేసి.. బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ చేస్తున్న పోరాటానికి ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా థాక్రే మాట్లాడుతూ.. 'కేసీఆర్ జీ మీరు చాలా గొప్పగా పోరాడుతున్నారు. మీది న్యాయమైన పోరాటం. ఈ దేశాన్ని విభజన శక్తుల నుండి కాపాడుకోవడానికి సరైన సమయంలో మీరు గళం విప్పారు. రాష్ట్రాల హక్కుల కోసం, దేశ సమగ్రతను కాపాడేందుకు మీరు పోరాటం కొనసాగించండి. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగండి. మా మద్దతు మీకు సంపూర్ణంగా వుంటుంది. ఈ దిశగా దేశ ప్రజలందరినీ కూడగట్టేందుకు మా వంతు సహకారాన్ని అందిస్తాం' అని పేర్కొన్నారు.

'మిమ్మల్ని ముంబయికి ఆహ్వానిస్తున్నాను. మీరు మా ఆతిథ్యాన్ని తీసుకోండి. అదే సందర్భంలో ఈ దిశగా భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకుందాం' అని సీఎం కేసీఆర్‌ను ఉద్ధవ్ థాక్రే ఆహ్వానించారు.

## ఆధ్యాత్మికం, ఆనందం, ఆహ్లాదం.. మేడారం జాతర: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 16: మేడారం సమ్మక్క సారక్క జాతర సందర్భంగా ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. ఆధ్యాత్మికం, ఆనందం, ఆహ్లాదం.. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర అని చెప్పారు.

అడవి తల్లి ఒడిలో కొలువుదీరి, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం జాతర బుధవారం ప్రారంభమవుతుందని చెప్పారు. వన దేవతల దర్శనం కోసం వచ్చే లక్షలాది భక్తజనానికి సకల సౌకర్యాలు కల్పిస్తూ రాష్ట్ర సర్కారు స్వాగతం పలుకుతున్నదని ట్వీట్ చేశారు.

'ఆధ్యాత్మికం,ఆనందం,ఆహ్లాదం.. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర. అడవి తల్లి ఒడిలో కొలువుదీరి, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం జాతర నేటి నుంచి ప్రారంభంకానుంది.

వన దేవతల దర్శనం కోసం వచ్చే లక్షలాది భక్తజనానికి సకల సౌకర్యాలు కల్పిస్తూ రాష్ట్ర సర్కారు స్వాగతం పలుకుతోంది.' అని ఎమ్మెల్సీ కవిత ట్విటర్‌లో పోస్టు చేశారు.

## సంగీత దర్శకుడు, గాయకుడు బప్పి లహిరి కన్నుమూత



ముంబై, ఫిబ్రవరి 16: ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు బప్పి లహిరి కన్నుమూశారు. 69 ఏండ్ల బప్పి లహిరి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నారు. దీంతో ముంబైలోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఒంటినిండా బంగారంతో ప్రత్యేకంగా కనిపించే బప్పి.. 1980, 90వ దశకాల్లో తన డిస్కో మ్యూజిక్‌తో భారతీయ సినీపరిశ్రమను ఒక ఊపుఊపేశారు. ఆయన సంగీత దర్శకత్వం వహించిన చల్తే చల్తే, డిస్కో డ్యాన్సర్, షరాబీ వంటి పలుచిత్రాలు సూపర్‌హిట్‌గా నిలిచాయి.

బప్పి లహిరి 1952, నవంబర్ 27న బెంగాల్‌లోని జల్పాయ్‌గురిలో జన్మించారు. ఆయన హిందీతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, గుజరాతీ భాషల్లో సంగీతం అందించారు. 2014లో భారతీయ జనతా పార్టీలో చేరిన ఆయన అదేఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బెంగాల్ నుంచి ఎంపీగా పోటీచేశారు.

బప్పి లహిరి తెలుగులో కూడా ఎన్నో విజయవంతమైన చిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేశారు. సింహాసనం, స్టేట్ రౌడీ, సామ్రాట్, గ్యాంగ్ లీడర్, రౌడీగారిపెళ్లాం, దొంగ పోలీసు, బ్రహ్మ, నిప్పురవ్వ, బిగ్‌బాస్, ఖైదీ ఇన్‌స్పెక్టర్ వంటి విజయవంతమైన చిత్రాలకు ఆయన మ్యూజిక్ అందించారు. తెలుగులో ఇటీవల డిస్కోరాజా చిత్రంలో కూడా పాటపడారు. కాగా, హిందీలో 2020లో విడుదలైన బాఘీ 3 సినిమాలో తన చివరి పాట పాడారు.

## కరోనా ఆంక్షలపై రాష్ట్రాలకు కేంద్రం లేఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:గత కొన్ని రోజులుగా దేశంలో కరోనా కేసులు తగ్గుతూ వస్తున్నాయి.

కరోనా మహమ్మారి క్రమంగా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకూ లేఖలు రాసింది.

కోవిడ్ సందర్భంగా విధించిన ఆంక్షలన్నింటినీ ఓ క్రమ పద్ధతిలో ఎత్తేయాలని సూచించింది.

ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ అన్ని రాష్ట్రాలకు లేఖలు రాశారు. ఇక.. కరోనా కేసుల విషయంలో ప్రతి రోజూ రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్షలు నిర్వహించాలని కూడా సూచించారు.

టెస్టులు, వ్యాక్సినేషన్, కోవిడ్ నిబంధలు.. వీటిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రస్తుత కోవిడ్ పరిస్థితులపై సమీక్షలు నిర్వహించాలని, ఒకవేళ కోవిడ్ కేసుల సంఖ్య అధికంగా ఉంటే ఆంక్షలను విధించాలని, లేని పక్షంలో ఆంక్షలను సడలించాలని ఆయన లేఖలో సూచించారు.

## 18న మేడారం జాతరకు ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 16: ఈ నెల 18న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మేడారం జాతరకు వెళ్లనున్నారు. వన దేవతలైన సమ్మక్క సారలమ్మకు కేసీఆర్ బంగారం సమర్పించి, మొక్కులు చెల్లించుకోనున్నారు. మేడారం జాతర నేటి నుంచి 19వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. ఈ జాతరకు దాదాపు కోటి మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డితో పాటు మంత్రులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇక సీఎం కేసీఆర్ 20వ తేదీన ముంబయికి వెళ్లనున్నారు. మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ థాక్రేతో కేసీఆర్ భేటీ కానున్నారు. ఈ నెల 21న నారాయణఖేడ్‌లో సంగమేశ్వర బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. 23వ తేదీన మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను కేసీఆర్ ప్రారంభించనున్నారు.




-బండిరాజుల శంకర్
సెల్: 99480 50608

## నినాదంగానే మిగిలిన సామాజిక న్యాయం

చట్టపరంగా ఎలాంటి వివక్షలు తారతమ్యాలు లేకుండా అందరికీ సమన్యాయం జరగాలనేలక్ష్యంతో ప్రపంచ సామాజిక న్యాయం దినోత్సవం ఫిబ్రవరి 20న ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 2009 సం॥నుండి ప్రపంచ వ్యాప్తంగా సభ్య దేశాల ప్రభుత్వాలు పాటిస్తున్నాయి.

**హక్కుల రక్షణ సామాజిక న్యాయం దోపిడీ పీడన పేదరికం నిరుద్యోగం:**

వివక్షత పక్షపాత ధోరణి లేని సమాజం కోసం విలువలు స్వేచ్ఛ వ్యక్తి గౌరవం' భద్రత 'ఆర్థిక సామాజిక పురోభివృద్ధి ప్రాథమిక హక్కుల రక్షణ మహిళా హక్కుల రక్షణ మానవ హక్కులరక్షణ బాలల హక్కుల రక్షణ అమలులో వివక్ష పాటించ కుండ సామాజికన్యాయం అందరికీ అందేలచూడడం.

సామాజిక న్యాయ దినోత్సవం రోజున ఐక్యరాజ్య సమితి మరియు అంతర్జాతీయ కార్మిక సంస్థ వివిధ సామాజిక స్వచ్ఛందసంస్థలు సామాజిక న్యాయం కోసంప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు 'సామాజికీకరణ ప్రాథమిక హక్కుల రక్షణ ప్రభుత్వ అవకాశాలు అందరికీ సమానంగా అందించడం అందరికీ ప్రగతి ఫలాలు అందించే ప్రయత్నం జరుగుతున్న ప్రగతి అభివృద్ధి కొరకు జరిగే కృషిని చర్చిస్తారు.

ప్రపంచదేశాలమధ్య శాంతిభద్రతలునిర్వహణరక్షణ సంఘీభావం సామరస్యంసామాజిక అభివృద్ధి .దేశాల మధ్య సమాన ప్రాతిపదికన సంభందాలు నెలకొల్పడం.మానవ సంబంధాలు సమానవ హక్కుల రక్షణ ప్రాథమిక స్వేచ్ఛలకు రక్షణ గౌరవం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ యొక్క వృద్ధి అభివృది కి ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవనప్రమాణాలపెంపు మరియు సమాచార సాంకేతిక సహాయం 'వాణిజ్యం పెట్టుబడులు మూలధన ప్రవాహం సాంకేతిక పరిజ్ఞాన ఆవశ్యకతను గుర్తించడంసామాజిక న్యాయ దినోత్సవం లక్ష్యం.

**వనరులు అందరివి:**

సమాజంలోనివనరులుఅందరివి వనరులపై కొందరికి ఆధిపత్యంఉండకూడదు .సమాజములో పౌరులందరికీ ఎలాంటి వివక్ష చూపకుండా సామాజిక న్యాయం కలిపించాలి. ప్రపంచవ్యాప్తంగాస్త్రీ పురుష లింగవివక్ష చూపకుండా అన్ని వయస్సులవారికి అందరికీ సమానఅవకాశాలు సామాజిక న్యాయం అందించాలి అనే లక్ష్యంతోసామాజిక న్యాయదినం ప్రపంచ దేశాల మధ్య శాంతి యుత సహజీవనానికి మూలాధారసూత్రంగా పనిచేస్తుంది. లింగ సమానత్వం స్వదేశీ ప్రజలహక్కులు వలస వచ్చిన వారి హక్కుల గురించి లింగ'జాతి 'ప్రాంతీయ 'సాంస్కృతిక పరంగాప్రజలు ఎదుర్కొంటున్న అవరోధాలను తొలగించాలనే లక్ష్యంతో ప్రపంచ సామాజిక న్యాయ దినాన్ని యు ఎన్ ఓ అసెంబ్లీ ప్రకటించింది. సామాజిక న్యాయం దినోత్సవం 2009ఫిబ్రవరి 20 తేదీనాడు సభ్యదేశాలు పాటిస్తూ దేశాల మధ్య పీడన దోపిడి నిరుద్యోగం ఆర్థిక అసమానతల నిర్మూలనపేదరిక నిర్మూలన సంపూర్ణ ఉపాధి అవకాశా లను మెరుగుపచడం. వ్యక్తి గౌరవం భద్రత లింగ సమానత్వం అందరికీ సామాజిక న్యాయం కోసంప్రపంచ స్థాయిలో తీర్మానాలు సూచనలతో సామాజిక న్యాయం చేరువకావటానికి కృషి చేస్తుంది.

ప్రపంచ సుస్థిరాభివృద్ధి నిలకడైన పెరుగుదల అభివృద్ధి వైపు మొగ్గు చూపేలా సామాజిక న్యాయం ఉండాలి. మెరుగైన రీతిలో సామాజిక న్యాయం శాంతి సౌభాగ్యాలతో అభివృద్ధి జరగాలని పేర్కొంది .సామాజిక న్యాయం అనేదిబహుళ ప్రమాణాలతోకూడుకున్న అంశం సామాజిక న్యాయం ఆర్థిక వ్యవస్థ లో చోదక శక్తి గా పనిచెయ్యాలి. ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనేక సమస్యలు సంక్షోభాలు తలెత్తాయి. ప్రపంచీకరణ ప్రభావంతో నిరుద్యోగం పెరిగింది పాక్షిక నిరుద్యోగం ప్రచన్న నిరుద్యోగిత అల్ప నిరుద్యోగి ఆదాయాల్లో కోతలు అసమానతలు అనేక దేశాల్లో చోటు చేసుకుంటున్నాయి. సామాజిక ఆర్థిక అసమానతలు వివిధ రూపాల్లో పెరిగిపోతున్నాయి. సుమారు 20 కోట్ల మంది స్త్రీ పురుషులు నిరుద్యోగులుగా ఉన్నారు అంతేగాక 80 కోట్ల మంది స్త్రీపురుషులు ప్రపంచ జనాభాలో ఇప్పటికీ రోజుకు ఒక వ్యక్తికి రెండు డాలర్ల కంటే ఆదాయం రావడం లేదు దారిద్ర్యరేఖకింద తమ కుటుంబాలను కొనసాగిస్తున్నారు

సుమారు నాలుగు కోట్ల యువతకు స్త్రీలకు ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవు అని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది. ఉత్తర ఆఫ్రికాలో అనేక దేశాల్లో నిరుద్యోగ యువత సంఖ్యపెరుగుతుంది. యువత పనిలేకుండా ఉండడం వల్లతీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతు పెడదారి పడుతున్నారు.

యువతతో పాటు బాలకార్మిక వ్యవస్థ పెరిగిపోతుంది. బలవంతపు శ్రమదోపిడి పెరిగి ఉపాధి హామీ లేక ఉపాధి కరువైపోయింది.

దారిద్ర్యం నుండి స్త్రీపురుషులకు విముక్తి కల్పించి సామాజిక న్యాయం కల్పించాలి. ప్రపంచ జనాభాలో 80 శాతం మందికి సరిపడా సామాజిక భద్రతలేదు. సగానికిపైగా జనాభా అనేక రూపాల్లో వివక్షతకు గురి అవుతున్నారు. ఆర్థిక వ్యవస్థలో జరిగిన అసమానవృద్ధి స్త్రీలు పురుషుల వేతన అసమానతలను కనీస స్థాయికి తగ్గించలేక పోయింది. యాంత్రికికరణ( మెకనైజేషన్) పెరగిటం వల్ల ఉపాధి కోల్పోతున్నారు .శాశ్వత ఉద్యోగాల స్థానములో ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పెరిగిపోతున్నారు .ద్రవ్యోల్బణానికి(ధరలు పెరిగిన స్థాయిలో) ధరలకు తగినట్లు వేతనాలు పెరగడం లేదు. ధరలపెరుగుదల సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపడంవల్ల వారి కొనుగోలు శక్తి క్షీణిస్తుంది.అల్ప పౌష్టికాహారం నిరుద్యోగం తో పాటు కార్మికుల జీవన ప్రమాణాలు తగ్గుతున్నాయి . సామాజిక నాయ్యం కోసం ఐక్యరాజ్యసమితి సూచనలు చేస్తుంది వాటిని అమలు చేసే బాధ్యత అయాదేశాల ప్రభుత్వాలదే .మనదేశంలో,14 సం"రాల పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అమలు చెయ్యాలన్న చట్టం వుంది. ప్రభుత్వాలలో ఈ చట్టాన్ని అమలు చేయాలన్న చిత్త శుద్ధి లోపించింది. నిర్బంధ ఉచిత విద్య అందిస్తే బాలకార్మిక.వ్యవస్థ నిర్మూలింపబడుతుంది. సామాజిక న్యాయం జరుగుతుంది.ఈ దిశగా ఆశించిన మేరకు చర్యలు లేవు.దేశములోని యూనివర్సిటీలు విద్యాసంస్థల్లో అరాచకశక్తులస్వైర విహారం ఘర్షణలు అలజడులు దాడులు నిత్య కృత్యమైనాయి ఇలాంటి స్థితిలో సామాజికన్యాయం అమలుకు తీవ్రప్రతిబంధకాలు ఎదురువుతున్నాయి.

దేశములో2014 లో దళితుల మీద దాదాపు 43 వేల దాడులు జరిగాయి. దళిత బహుజనుల పరిస్థితులు హీనంగా ఉన్నాయి. భారతదేశంలో రాజ్యాంగం మార్చాలని వాదనలు వినబడుతున్నాయి.కానీ ఇది సరికాదు. సవరణలు ఇప్పటికే జరిగాయి.రాజ్యాంగం మార్చాలనడం మూర్ఖత్వం. అసలు ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా సంపూర్ణంగా పాలిస్తే భారతదేశం ఇప్పటికే ప్రపంచంలో అభివృద్ధిలో ప్రథమస్థానంలో ఉండేది.ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదంలో ఉందనిపిస్తుంది.

అసమాన వేతనాల వ్యవస్థ అమలులో వుండడం శ్రమ దోపిడి శ్రమకు తగిన ప్రతిఫలం లేక పోవడం వ్యవసాయ అసంగటితరంగాలలో పనిచేసే కార్మికులకు స్థిర ఆదాయాలు లేని స్థితి నెలకొన్నది.

మహిళలపట్ల గౌరవం మహిళా సాధికారిత మహిళా కార్మికులు హక్కులరక్షణ వారి సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలి.

సామాజిక అంతరాలు తగ్గించడం కొనుగోలు శక్తిని పెంచడం చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపననిర్వహణతో సముచితమైన ఉపాధిని కల్పించడం.సామాజిక సంప్రదింపుల సంస్కృతి నెలకొల్పేందుకు న్యాయమైన సమతుల్యమైన విధానాలను రూపొందించడం .సామాజిక న్యాయం కోసం ప్రపంచవ్యాప్తంగా జరిగే పోరాటాలను ఉధృతం చేయడం ప్రపంచీకరణ వల్ల ఏర్పడుతున్న సవాళ్లను అధిగమిస్తూ సముచిత ఉపాధి అవకాశాలను కల్పించడం. ప్రపంచ సామాజిక న్యాయం దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్య సమితి.ఐ.ఎల్ ఓ తీర్మానాలు సూచనలు అమలుకావలంటే సామాజిక నాయ్యం కోరుకునే అభ్యుదయ ప్రగతి.శీల శక్తులు ఏకం కావాలి .భావ ప్రకటన స్వేచ్ఛ వ్యక్తి స్వేచ్ఛ స్వాతంత్ర్యం పరిరక్షింప బడాలి.మత సామరస్యం సామాజిక సమత సామాజిక సంక్షేమం సాంఘిక ఆర్థిక పంపిణీద్వారా సమాజములో పౌరులందరికీ గౌరవప్రదమైన జీవన ప్రమాణాలతో కూడుకున్న మెరుగైన జీవితాన్ని అందించాలి.వనరుల సామాజికీకరణ జరగాలి. సుస్థిర ఆర్థిక వ్యవస్థ..శీఘ్రతర ఆర్థిక వృద్ధి అభివృద్ధి జరగాలి. పటిష్ఠమైనసామాజిక భద్రత పాలనా పరమైన బరోసా ప్రభుత్వాలుకలిపించాలి. డిజిటల్ అధునాతన సాంకేతికతను యువతకుఅందించాలి పౌరులందరికీ విద్య వైద్యం కనీస అంశాల్లో సమాన అవకాశాలు కల్పించాలి ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో సమాన అవకాశాలు సృష్టించాలి.యువతలో ఉద్యమిత్వ నైపుణ్య అభివృద్ధి కి ప్రభుత్వాలు పెద్ద పీట వెయ్యాలి.

ఆత్మనిర్భరత తో యువత పారిశ్రామిక వాణిజ్య వ్యాపార సేవారంగాలలో పురోగమించాలి .రాజ్యాంగం లో రక్షణలు అందరికీ అందించాలి. అందరికీ సామాజిక న్యాయం అందించే కృషి జరిగినపుడు మాత్రమే వసుదైక ప్రపంచం ఆవిర్భవిస్తుంది .అంతర్జాతీయ సామాజిక న్యాయం దినోత్సవం

లక్ష్యం నెరవేరుతుంది ఆదిశగా ప్రభుత్వాలు కృషి చేస్తాయని ఆశిద్దాం.

(ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయం దినోత్సవం సందర్భంగా )



–నేదునూరి కనకయ్య
9440245771

**చరిత్రలో నేటినిజం**



( ఫిబ్రవరి 17 అంపైర్ కుమారస్వామి పుట్టిన రోజు..)



–రాధశ్రీ
సెల్: 9494481210

## కరోనా సృష్టించిన జీవన విధ్వంసాన్ని కవిత్వం ద్వారా వెలువరించిన అంజయ్య

కరోనా సృష్టించిన జీవన విధ్వంసాన్ని కవిత్వం ద్వారా వెలువరించిన సీనియర్ జర్నలిస్టు కవి కొమరవెల్లి అంజయ్య అభినందనీయులని రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. అంజయ్య రచించిన 'ఆకులు రాలుతున్నయి' కవితా సంపుటిని సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సోమవారం రాత్రి ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కరోనా వ్యాధి సృష్టించిన విధ్వంసం మానవ సమాజాన్ని అతలాకుతలం చేసిందన్నారు. ఎవరు ఊహించని, అంచనా వేయని ఒక మహమ్మారి వ్యాధి వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని చెప్పారు. కరోనా సమయంలో తాను ప్రజల్లో, గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు ఎదురైన అనుభవాలు దుర్గ భరితమైన అని చెప్పారు. మనిషికి మనిషి శత్రువు గా మారిన ఆ సందర్భాలను గుర్తు చేసుకుంటే గుండె తరుక్కుపోతోందన్నారు. కరోనా వ్యాధి సోకిన మరణిస్తే కన్న తల్లిదండ్రులను పిల్లలు, కట్టుకున్న భర్తను భార్య, తోబుట్టువులు సైతం ముట్టుకునే పరిస్థితిలేని మానవీయ సంఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఆకస్మికంగా ,ఆలోచన లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్ డౌన్ వల్ల దేశ వ్యాప్తంగా వలస కూలీలు పడ్డ అవస్థలు వర్ణనాతీతమని చెప్పారు. కరోనా వ్యాధి వల్ల భయకంపితులైన మధ్యప్రదేశ్ ,బీహార్ ప్రాంతాల నుంచి హైదరాబాద్ కు , తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు బతుకు తెరువు కోసం వచ్చిన వలస కూలీలు తమ ఊర్లకు తిరిగి వెళ్ళడానికి వేలాది కిలోమీటర్లు కాలినడకన బయలుదేరి వెళ్లిన సంఘటనలు ఎంతో బాధ కలిగించాయని చెప్పారు. కరోనా వ్యాధి మానవ సమాజానికి పెద్ద గుణపాఠం నేర్పిందని తెలిపారు. తోటి మానవుల పట్ల ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో నేర్పిందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులు చికిత్స చేయలేక చేతులెత్తేస్తే గాంధీ ఆస్పత్రి అందించిన సేవలను కొమురవెల్లి అంజయ్య తన కవిత్వంలో వివరించారని చెప్పారు. కరోనా సమయంలో మనుషులు ఎంత అమానవీయంగా ప్రవర్తించారో , అంత మానవీయంగా స్పందించి ఆదుకున్న ఘటనలను వివరించారు. ప్రపంచమంతా కరోనా వ్యాధి ముందు మోకరిల్లిందని చెప్పారు. అమెరికా లాంటి అగ్ర రాజ్యం సైతం విలవిలలాడిన తీరును వివరించారు. కరోనా వ్యాధి నివారణ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి సరిగా లేదని హరీష్ రావు విమర్శించారు. కంటికి కనిపించని కరోనా పేద ధనిక భేదం లేకుండా అందరినీ గడగడలాడించిందని చెప్పారు. అలాంటి కారణాల అనుభవాలను పుస్తక రూపంలో భవిష్యత్ తరాలకు గుర్తు చేయడానికి అంజయ్య ఎంతో కృషి చేశారని కొనియాడారు. వలస కార్మికులను రాష్ట్రాల నుంచి రైళ్లలో, బస్సులలో తమతమ ప్రాంతాలకు పంపించడం వల్లనే కరోనా దేశవ్యాప్తంగా ప్రబలిందని ప్రధానమంత్రి పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలు బాధ్యతారహితమని అన్నారు. కరోనా సృష్టించిన జీవన విధ్వంసాన్ని కవి కొమురవెల్లి అంజయ్య తన కవిత్వంలో గొప్పగా చిత్రీకరించారని, అనేక సంఘటనలను, అమానవీయ చర్యలను కవిత్వం ద్వారా రికార్డు చేశారని తెలిపారు.



సీనియర్ జర్నలిస్టు కవి కొమరవెల్లి అంజయ్య 'ఆకులు రాలుతు న్నయి' కవితా సంపుటిని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్ రావు. వేదికపై విరహత్ అలి, దేశపతి శ్రీనివాస్, డా॥ నందిని సిధారెడ్డి, దేవి ప్రసాద్ తదితరులు

ప్రఖ్యాత కవి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ కవి కొమరవెల్లి అంజయ్య తాను ఇద్దరం మంచి మిత్రులమని చెప్పారు. ఇద్దరం కలిసి చదివామని కలిసి కవిత్వం రాశామని తెలిపారు. అంజయ్య ఒకవైపు కవిగా, మరోవైపు జర్నలిస్టుగా సమాజం పట్ల తన బాధ్యతను గొప్పగా నిర్వర్తించారని చెప్పారు. కరోనా నేపథ్యంలో తాను అనిమేష కవితా సంపుటి వెలువరించగా , ఆకులు రాలుతున్నయి అనే కవితా సంపుటి వెలువరించడం యాదృచ్ఛికమేనని అన్నారు. సాహిత్యంలో కరోనాపై మంజీరా రచయితల సంఘం తరఫున రెండు కవితా సంపుటిలు వెలువడటం , ఆ రెండు సిద్దిపేటకు చెందిన కవులవే కావడం గొప్ప విషయమని చెప్పారు.

ప్రముఖ గాయకుడు, కవి ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డి దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్దిపేట ప్రాంతంలో జర్నలిస్టుగా, కవిగా కొమరవెల్లి అంజయ్య సమాజంపై ఎంతో ప్రభావం చూపాడని చెప్పారు. అనేకమంది కవులు, జర్నలిస్టులకు అంజయ్య కార్యాలయం కూడలిగా ఉండి ప్రేరణనిచ్చిందని తెలిపారు. కరోనా వ్యాధి నేపథ్యంలో అంజయ్య వెలువరించిన ఆకులు రాలుతున్నాయి కవితా సంపుటిలో అనేక సంఘటనలు రికార్డ్ అయ్యాయని చెప్పారు. మానవుడు చేసిన ప్రకృతి విధ్వంసం వల్లనే కరోనా వచ్చిందని తెలిపారు. మనిషి ప్రకృతి పై చేస్తున్న యుద్ధమే కరోనా వ్యాధిగా పరిణమించిందని తెలిపారు. మానవుడు తనని తాను అందరికంటే గొప్పవాడినని విర్రవీగుతున్న భావనలు కరోనా ముందు ఓడిపోయాయని చెప్పారు. ప్రపంచాన్ని తన ఆధిపత్యం ద్వారా ఓడించాలని చూసిన అమెరికా లాంటి దేశాలు సైతం కరోనా ముందు ఓడిపోక తప్పలేదని చెప్పారు. కవి నిత్య చలనశీలంగా ఉన్నప్పుడు ,సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించి స్పందించినప్పుడు మాత్రమే మంచి కవిత్వం వస్తుందని చెప్పారు.

బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మంజీరా రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యుడు దేవీప్రసాద్ మాట్లాడుతూ మంజీరా రచయితల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంగా గొప్ప సామాజిక సాహిత్య కృషి చేసిందని చెప్పారు. అనేక సామాజిక సమస్యలపై మరసం కవులు తమ కలాన్ని,గళాన్ని వినిపించారని చెప్పారు. అందులో భాగంగానే కొమరవెల్లి అంజయ్య కరోనా వ్యాధి నేపథ్యంలో రాసిన కవితల సంపుటి ఆకులు రాలుతున్నయి వెలువరించారని చెప్పారు.

టి యు డబ్ల్యూ జే ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ మాట్లాడుతూ అంజయ్య గొప్ప సామాజిక స్పృహ కలిగిన జర్నలిస్టు అని చెప్పారు. గడచిన నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్టులు వృత్తిలో ఉన్న ఆయన కవిగా కూడా రాణించారని చెప్పారు. ఇప్పటి వరకూ మూడు కవితా సంపుటాలను వెలువరించారని వివరించారు. కరోనా నేపథ్యంలో ఆయన రాసిన కవితలు మానవ సమాజంలో అనేక కోణాలను ఆవిష్కరించాయని తెలిపారు.

ఈ సభకు మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె రంగాచారి అధ్యక్షత వహించగా సభలో కవి కొమురవెల్లి అంజయ్య ,తెరసం గౌరవాధ్యక్షుడు తోట అశోక్, మరసం ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, నందిని భగవాన్ రెడ్డి, జై హింద్ ,శిల్పి రమణారెడ్డి ,నక్షత్రం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి పరిమళం-3

మామిడి తోరణ మాకు
విడియమ్ము తమలపాకు
వ్రతములు నోముల కోసం
అతికిస్తా రరిటాకు!

మృగ బృందము తుళ్ళింతలు
వన రాణికి పులకింతలు
కలప దొంగలకు మాత్రం
క్రౌర్యం చూడ పదింతలు!

మందారంబు కృష్ణునికి
మారేడుదళం శివునికి
గరికపోచ చాలంటా
శ్రీ గౌరీ ప్రియసుతునికి!

చుడితే తాతకు దమ్మువు
కుడితే విస్తరి కమ్మువు
పొగాకుతో జతచేస్తే
కొందరికి భోజనమ్మువు!

పక్షుల వెచ్చని ఇళ్ళు
జంతువులకు పొదరిళ్ళు
ఆది మానవుని జీవన
మోదము వృక్షపు గుళ్ళు!

రాలే ఆకులు పూవులు
నేలకు చేసెను సోకులు
పడిపోయిన గాని ఎంత
చెడిపోని సుపరిమళములు!

ఎదపై బడి మెరిసి పోయె
సిగలో మైమరచి పోయె
మృదువైన గులాబి సాయి
పదములపై మెరిసి పోయె!

చూడు నంది వర్ధనములు
దినదినము ప్రవర్ధనములు
భక్తికి రక్తికి ముక్తికి
ఆనంద ప్రవర్ధనములు!

ముస్లిములకు మైదాకు
హిందుల గోరింటాకు
విత్తనాలు లేని పంట
చేతుల కాయెను సోకు!

కన్నుల కాకను బాపును
మనసుకు శాంతిని జూపును
హరితభరిత మీ ప్రకృతే
కాచును రేపును మాపును!



ప్రసిద్ధ కవి, కథకుడు రచయిత, విశ్రాంత తెలుగు పండితుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, అభినవ దాశరథిగా పేరుగాంచిన **దోరవేటి** కలం నుండి జాలువారిన మణిపూసల కావ్యమే **"ప్రకృతి పరిమళం".** ఇవన్ని కూడా ముక్తకాలే. ఈ ప్రకృతిలో భాగమైన అనేక రకాల చెట్లు, మొక్కలు, జంతువులు, పక్షులు, కీటకాలు మొదలగు వాటిని పలుకరిస్తూ, **వడిచర్ల సత్యం** సృష్టించిన మణిపూసల కవితా ప్రక్రియలో దోరవేటి కావ్యరచన సాగడం గమనార్హం. తెలుగు సాహిత్యంలో విశేష జనాదరణ పొంది, ఆబాల గోపాలాన్ని అలరించిన మణిపూసల ప్రక్రియలో వచ్చిన "ప్రకృతి పరిమళం" నేటి నిజం పాఠకుల కోసం....! –సంపాదకులు.

ఎక్జాస్టింగ్ ఫ్యానంటు
ఎందుకు ఖర్చు కరంటు
నే నా పని చేస్తాననె
ఇంటింట మనీప్లాంటు!

అన్నిటికంటేను నెట్టు
ఆకాశమున గన్పట్టు
ఆకలి దప్పులు దీర్చె
అదే చూడు తాటిచెట్టు!

చాపలు పందిరి కట్టలు
కోస్తే గుట్టలు గుట్టలు
అలంకరణ వస్తువులవి
అదిగో కొబ్బరి మట్టలు!

పాండవులకు ఖాండవము
రాములకో దండకము
మన ఇతిహాసాలన్నీ
చేసేను వనవాసము!

కోట్ల కొలది రూపాలు
కరుణకు ప్రతిరూపాలు
వృక్షాలే లేకుంటే
అడుగడుగున పాపాలు!

కమ్మల నిచ్చెను రచనకు
కాగితమిచ్చెను కవితకు
సమస్త మర్పించె చెట్టు
మానవాళి సద్భవితకు!

శిశిరము దుశ్శాసనుడు
చీరల నూడ్చుక వినడు
చిగురాకుల వస్త్రాలను
యిచ్చు కృష్ణ వసంతుడు!

తలిరాకుల ఉత్పత్తి
తగిలిన దేహము కత్తి
తగని సిగ్గు ముంచెత్తగ
ముడుచుకునె అత్తిపత్తి!


**26 ఫిబ్రవరి 2022 - అన్నమయ్య కళావేదిక, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం**

## జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు



పురిమళ్ళ సునంద | ఉన్నం జ్యోతివాసు | నల్లి ధర్మారావు | అమూల్య చందు | దేశరాజు | కిలపర్తి దాలినాయుడు

రావి రంగారావు సాహిత్యపీఠం
రి.నెం. 6/2016
గుంటూరు

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 17-2-2022

## ఘంటారావం

నలుగురికి నచ్చినట్లు
నటించాలంటే ఎలా?
నూరేళ్ల జీవితమైనా
నటనకు సరిపోదు కదా.

కనిపించే కన్నీటి చుక్కల్లో
కనిపించని చీకట్లెన్నో
కనిపించే చీకట్లో
కనిపించని చుక్కలున్నో.

బతుకంటే భయపడేవారు
చావును ఆహ్వానిస్తారు
చావుకు చలించని వారు
బతుకును ఆస్వాదిస్తారు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## లత జ్ఞాపకాలు



నాలుగో యేటి నుంచే
సినిమాలు చూసే వాణ్ణి.
మా ఊరి టకీస్
గడ్డి పొలాల మధ్యన వుండేది.
దాని సిగలోంచి వెలువడే
లత పాటలువింటూ
అది మరింత పచ్చగా మొలిచేది.

ప్రత్యక్షంగా
ఆమెను నేను చూడలేదు.
అందుకే భౌతికంగా
మన మధ్య లేదనే బెంగ లేదు.

సర్వాంతర్యామికి
రూపం లేకున్నా పరవా లేదు.

ఏమి కంఠస్వరమామెది!
శ్రావ్యత అనేది చిన్న మాట
మాటల కందని మనోజ్ఞత.
సాహిత్యాన్ని మీరిన మాధుర్యం
కళ్లు మూసుకుంటే
లోకనులు విచ్చుకోవడం అనివార్యం.

పరాయి ప్రాంతాలకు వెళ్లినప్పుడు కూడా
ఎక్కడి నుంచో
ఆమె పాట వినిపిస్తే
భారత్‌లోనే వున్నట్టు అనుభూతి.
నియంత్రణ రేఖను దాటేసిన
నిర్మలమైన నిరాటంక ధృతి.
హృదయ సీమలు గడిచి
ఆత్మ దాకా ప్రవహించిన విఖ్యాతి.

రాసిన వాడు
సరస్వతీ పుత్రుడైతే
పాడుతున్న ఆమె
ఒక భావోద్వేగ గాయత్రి.

సందర్భాలు మరింత
మెరిపిస్తాయి నిజమే గాని
వాటికి అతీతమైన
ఆనంద కళాదీప్తి ఆమె.

గానం వెలువడేది
ఆమె గళమే కావచ్చుకాని
అందులో అలవోకగా
ఒదిగిపోయింది
ఔయావత్ లయాత్మక భూగోళం.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

# ప్రేమ మొగ్గల్లో.. చెదరని జ్ఞాపకాల మువ్వలు..!





ప్రేమ రెండక్షరాల పూలరథమవుతూనే రెండు మనసుల జతను కలిపే సారథమవుతుందనీ.. ప్రేమ ఇలలో వెలసిన దైవాంశ సంభూతమంటూ యువ కవి ఓర్సు రాజ్ తన శ్రీమతి మానసల మధ్య చిగురించిన ప్రేమ.. మొగ్గతొడిగి.. పల్లవించిన చెదరని జ్ఞాపకాలను మనతో పంచుకోవడానికి ఓ పుస్తకం రూపంలో.. 'మొగ్గలు' ప్రక్రియలో ప్రకటించారు. డా॥భీంపల్లి శ్రీకాంత్‌గారు "మొగ్గలు" మూడు పాదాల లఘు కవితా రూపం సాహితీ లోకానికి పరిచయం చేసిన అనతికాలంలోనే పలు గ్రంథాలు వెలువడటం స్వాగతించదగిన పరిణామం! మొగ్గలు ప్రక్రియలో 59వ గ్రంథంగా వచ్చిన ఈ 'ప్రేమ మొగ్గలు'లో కవితలన్నీ అందరిని అలరించే విధంగా కొలువు దీరాయి.

**ఇరుచూపుల సోయగాలతో**
**మనసులు జత కలిసిన వేళ**
**నిండు యవ్వనాన్ని తాకట్టుపెట్టిన మనసు** అంటూ రాసిన మొగ్గలో కవి ఓర్సురాజ్ మానసల తమతొలి చూపుల కోలాటాలను ప్రకటించిన తీరు బాగుంది..

**కలల సౌధంలో విహరించే ఊహలకు**
**మూడు ముళ్ల బంధనాలు ముడివేస్తాయి**
**నీ కవ్వింతలే నాలో ఊపిరి నలిపితే**
**నా మనసు నీకై పరితపిస్తుంది!**

ఎన్ని వసంతాలను ఎదురు చూశానో నీకై నీ చిరునవ్వులను దోసిట్లో ఎప్పుడు గుమ్మరిస్తావోననీ అంటూ ఆయా మొగ్గల్లో కవి ఓర్సురాజ్ ఎదురు చూపుల జ్ఞాపకాల మువ్వల సవ్వడులను అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు.

**ప్రియురాలి పైట తగిలి తగలగానే**
**చెలికాని మనసు మత్తడిల దూకింది**
**ప్రేమ కలల లోగిలిలో ఊగిసలాడే ప్రేమ జంట** అంటూ రాసిన పంక్తులు పాఠకులను గిలిగింతలు పెట్టేలా ఉన్నాయి.

**ప్రియురాలి తనువు తగలగానే**
**చెలికాని ఒళ్ళు తుళ్ళింతలై ఊగిసలాడెను**
**ప్రేమ పక్షుల హృదయనాదాల సవ్వడి ప్రేమ** అంటూ రాసిన మొగ్గలో.. ప్రియురాలి తనువు స్పర్శలో పొందే అనుభూతులను అందంగా తెలియజెప్పారు.

**ప్రియురాలి మాటల మూటలో పడి**
**ప్రియుడి హృదయ భారవే తొలిగేను**

**మాటల ముసుగులోనే తేలియాడే ప్రేమజంట..** అంటూ ప్రేమికులు మాటల మాయలో పడి తేలియాడే సన్నివేశాన్ని చక్కగా దృశ్యమానం చేశారు.

**ప్రేమంటే ఒక గడియలో ముగిసే తంత్రమేకాదు**
**రెండు గులాబీల సొగసుతో సమసిపోయేది కాదు**
**జీవన సాగర గమనంలో సాగే సజీవ ప్రవంతి** అని కవి తేల్చి చెప్పారు. నిజమే కదా!

**నా మనసు పరిమళం పరితపిస్తూనే**
**నీ తనువు తాకిడికి తలపులై మెరిసింది**
**నా ప్రేమ పుడమిలో జనించిన మనసు తెర** అంటూ ప్రేమికుల మనసు సుమ గంధాలను గుబాళింపజేశారు.

**ప్రియురాలు మధురామృతాలు పంచుతేనే**
**ప్రియుడు, స్వర్ణధామంలో తేలియాడుతాడు**
**రెండు హృదయాల సౌఖ్యదా యం ప్రేమ** అంటూ ఒళ్లు తుల్లింతలై ఊగిసలాడే రెండు హృదయాల మనసును చక్కగా ఆవిష్కరించారు.

**నా వలపు పూదోటలో వెన్నెల రవళివి నీవైతే**
**వసంత గీతాలావనలో రాగరం జితం నేనౌతాను**

**నా వలపుల ఇలలో వెన్నెల కాంతివి నువ్వు** అంటూ రమణీయ భావాలతో మరో కవితకు జీవం పోశారు.

ఇలా ప్రేమ తలపుల్లో మునిగి తేలిన జ్ఞాపకాల జావళిని మనకు కవి ఓర్సురాజ్ అందంగా మొగ్గలు రూపంలో అందించడం అభినంద నీయం.

చక్కని కవిత్వాంశతో గాఢమైన భావాలకు చోటు కల్పిస్తూ.. మొగ్గలు కవితా రూపానికి శోభను కూర్చిన కవిని అభినందిద్దాం.. ముందు ముందు పూర్తిస్థాయి వచన కవితా సంపుటితో మన ముందుకు రాగలరని ఆశిద్దాం..

**ప్రతులకు:** ఓర్సు రాజ్‌మానస
6-28, గ్రా॥ జైన,
మం॥ ధర్మపురి. జి॥ జగిత్యాల.
సెల్: 984944 6027



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

# పాఠకుల అభిరుచికి పరితర్పణం

అంతర్జాల ఆవిష్కారము తరువాత, మానవ సంబంధాలలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. పరస్పర భావ ప్రకటనకు ఎక్కువలోఎక్కువ దూరవాణి అవసరం అయ్యేది. సాంకేతికత సర్వతో ముఖాభివృద్ధి అనంతరం అంతర్జాలము మనలో విడ దీయ రాని భాగమైపోయింది. వాడుకలోని సౌలభ్యము వల్ల నేడు సామాన్య మానవుడు సైతం అంతర్జాల ఉపయోగానికి అలవాటు పడిపో యాడు. అన్ని రంగాలతో పాటు సాహితీ రంగము కూడా ఈ సౌల భ్యాన్ని వినియోగించు కుంటూ రచయితలకు వెన్ను దన్నుగా నిలిచి క్రొత్తపుంతలు త్రొక్కుతున్నది. రచయితలు తమ రచనలకు ఒకప్పుడు పత్రికల (Print Media)పై ఆధారపడేవారు. నేడు వివిధ సమూహాలుగా ఏర్పడి తమ రచనా సామర్థ్యాన్ని చూపుకోగలుగుతున్నారు. తమను తాము అభివృద్ధి పరుచుకోగలుగు తున్నారు. భావ సారూప్యత నాధారం చేసికుని "సమూహాలు"గా ఏర్పడి తమ కళలకు మెరుగులు దిద్దుకుంటున్నారు.

"భావుక" అనుముఖ పుస్తక సమూహం తెలుగు జాతి సంస్కృతికి సంబంధించిన సాహితీ, సాంస్కృతిక, సామాజిక, చారి త్రక అభిరుచులు ప్రతిబింబించే విధంగా అనేకాంశాలపై చర్చలు, కథలు, కవితలు, వ్యాసాలను పరిస్పరం పంచుకుంటూ సాహితీ వికాసానికి పాటు పడుతున్నారు. వీరి, ఈ , ప్రశంసనీయ, అభినందనీయ అంశంలో భాగంగా మొగ్గ తొడిగి, రూపుదిద్దుకున్నదే ఈ "భావుకథలు". 85గురు రచయితల/రచయిత్రుల కథా కదంబం, ఇందులో తెలుగు కథా రంగానికి చిరపరిచితులైన, కాకలు తీరిన యోధులున్నారు. ఇప్పుడిప్పుడే కలం పట్టి తమ బలం చూపిన యోధానుయోధులూ ఉన్నారు. వీరందరిలోనూ, సహజంగా కనబడే ఏకస్వామ్యత వీరి ఉత్సాహం. ఒకరికొకరు



(85 రచయిత/త్రుల కథా కదంబం)

అందించుకున్న సహకారం. చేయి, చేయి కలిపితే అసాధ్యం అంటూ ఏదీ లేదని నిరూపించారు ఈ కథకులు. తమ తమ 'టేలంట్'ను ప్రదర్శించుకో వాలన్న ఉత్సుకత, హృదయ పూర్వకమైన ప్రయత్నం. వీరి కథల్లో ప్రతిఫలించాయి. సింహభాగం కథకులు మానవ సంబంధాలకు తమ కథ/కథా వస్తువులు గా ఎన్నుకోవటం సమంజ సంగా ఉంది. సాహిత్యం అంటేనే ప్రజాహితం కద!

సంకలనంలోని రచయితలు దేశ విదేశ వాసులు కావటం ఉద్యోగాలు చేస్తున్నవారు, గృహిణులు, మధ్య వయస్కులు, వయోజ నులు, కావటం గమనార్హం. 60 మందికి పైగా రచయిత్రులున్నారు.

ఇల్లాలికి కష్టంవస్తే, దిగులుని ఎవరితోనో ఒకరితో పంచుకుంటే, తగ్గిపోతుందంటారు. అమెరికా వాసి సంధ్య ఎల్లా ప్రగడ. 'అగ్నయేనమః'లోని ఇల్లాలు పొయ్యిలోని అగ్ని హోత్రుడికి చెప్పుకుం టుంది. అగ్ని ప్రత్యక్షదైవం. ఆయనకు చెబితే కష్టాలు తీరుతాయన్న విశ్వాసం. ఉంటే ఆయన తప్పక సాయపడుతా దంటుందీ రచయిత్రి. విశ్వాసం/నమ్మికను ప్రోత్సహించే ఈ కథలో, కథనంలో రెంటిలోనూ నవ్యత ఉంది. ఒక గొప్ప సందేశమూ ఉంది. దైవోపహతులు ప్రేమోపహతులు అనాథలు గా లెక్కించబడుతారేమోగాని, అస్తమానం వారిని చిన్నచూపు చూస్తే వారు 'మోడ్రన్ సన్యాసం' పుచ్చుకుంటారు. అంటే వాళ్ళు కుటుంబం ఉండి కూడా సన్యసించి నట్లేనంటారు. రాజేశ్వరి కనకగిరిగారు తమ 'అనాథ' కథలో. క్షణికమైన ఆవేశంతోనో, ఆనాలో చితమైన 'On the Spot' నిర్ణయాలతోనో సమిష్టి కుటుంబంలోంచి విడివడిన వారు వ్యష్టిగా బ్రతకలేరు. మందనుండి తప్పిపోయిన గొఱ్ఱెపిల్లలా, వారి మనసెప్పుడూ దూరమైన మంద మీదే ఉంటుందని **'అతను అమ్మా-నాన్న'** కథలో ఓలేటి శశికళ చెబుతారు. ఆరునెలల సా వాసంతో వారు వీరు, వీరు వారవుతారట! ఏదో ఓ శిక్షలో భర్త శంకరం జైలుకు వెళతాడు. భార్య అనసూయ బ్రతుకుదెరువు కోసం లాయరు దంపతుల ఇంట పనిమనిషిగా చేరుతుంది. శిక్షాకాలం పూర్తికాగానే, భర్త దగ్గరకు చేరుతుంది అనసూయ. ఎవరూ ఏమీ చెప్పకున్న, సంస్కారవంతుల సావాసంలో అనసూయ కూడా సంస్కార వంతురాల వుతుందంటారు. ప్రసిద్ధ కథా రచయిత ఎమ్మెస్వీ గంగరాజు తన కథ **'అతడు -ఆమె-, అనసూయ'**లో దీన్నే సావాస లాభం అనవచ్చునేమో. తక్కువ వ్రాసి ఎక్కువ చెప్పారు రచయిత ఈ కథలో. ప్రతిభ ఉండాలి గాని కథా వస్తువు ఏదైనా కావొచ్చునని అంటున్నారు 'ఆగది' కథలో కాంతిశేఖర్ శలాక. గుండెను తడిపే ఈ కథలో చివరన ఊహించని మలుపు త్రిప్పి ముగించారు. ఉద్యోగిగా ఉన్నంత కాలమూ, టేబిల్ క్రింద చేతులు చాచే అలవాటు రీటయిరయ్యాక, లెక్కకు రావల్సిన మొత్తం కూడా టేబిల్ క్రింద నుండి తీసుకోవాలనిపించింది **'అయితే నాకేంటి'** కథలో ప్రధానపాత్ర అప్పారావుకి. అయితే కథచివర అప్పారావు యమదూతల దగ్గర కూడా లంచం అడిగితే వారు భయపడి అప్పారావును భూ లోకం మీదే వదిలి పారిపోయారట! కథనం బాగానే ఉంది గాని యదార్థత లోపించటం వల్ల కథ ప్రయోజనం కొంత కుంటు పడింది.

రచయితలు కలిసికట్టుగా ఇలా సమిష్టి సంకలనాలు తేవటంలో మరో ప్రయోజనం ఉంది. ఒకటీ రెండు కథలు ఆడపాదడపా వ్రాయగలిగేవారు స్వంత సంపుటిలు ప్రచురించుకోను వీలుపడదు. అచ్చులో తమ కథ చూసుకోవాలన్న ఆనందం ఇలా ఈ సమిష్టి ప్రయత్నం వల్ల ఒనగూరుతుంది. ఏదేమైనా చిన్ని రచయితలకు ఇదో శుభపరిణామం. పుస్తకాలు కొని చదివే అలవాటు అంతగాలేని మన తెలుగు పాఠకులు ఇలాంటి సంకలనాలను ఎంతవరకు ఆదిరిస్తారో వేచి చూడవలసిందే!

ప్రతులకు:జ్యోతివలబోజు
సెల్: 8096310140



- కూర చిదంబరం
సెల్: 8639335675

పుస్తక సమీక్షలు

# సమాజహితవు కోరే గ్రంథం.. "దైవంతో నా అనుభవాలు"

సృష్టి దైవానికి దేహం. సృష్టిలో ప్రతి ప్రాణి దేవుని ప్రతి రూపం. చాలా మంది అనుకుంటారు దైవం మానుష రూపేణా అని. కానీ దైవం ఒక్క మనిషే కాదు. ప్రతి రూపంలోనూ ఆ దైవం ఉంటాడని గ్రహించగలిగే తత్వాన్ని అందరూ గ్రహించ గలగాలి. "దైవంతో నా అనుభవాలు" అనే గ్రంథం వెంకట వినోద్ పరిమి గారి అనుభవాలను చదువుతుంటే నిజంగా నా పక్కన కూడా ఆ భగవంతుడు ఉన్నాడేమో కదా అనిపించింది. వినోద్ పరిమిగారు ఎంతో దైవానుగ్రహం కలిగిన వ్యక్తి మూలంగా ప్రతి అంశాన్ని గుర్తించగలిగేరు. గుర్తించి తన స్నేహితుడైన రమేష్ కుమార్ గారికి ప్రతి అనుభవాన్ని తెలియజేయడంతో విని ఊరుకోకుండా తన స్నేహితుని ఆలోచనలకు విలువిచ్చి వాటినన్నింటినీ ఒక చోట చేర్చి అక్షరీకరించడం మూలంగా ఈ రోజు మన చేతికి ఇంత గొప్ప గ్రంథం అందిందనడంలో అతిశయోక్తి లేదు. ఈ పుస్తకంపై వచ్చి ప్రతి రూపాయి గోసంరక్షణా సమితి కోసం ఖర్చుపెడతాను అన్న వినోద్ మాటలు విని తన స్నేహితుడైన రమేష్ కుమార్‌కు ఆనందాన్ని కలిగించడమే కాదు ఆ సమయంలో వినోద్ తనకు ఒక కారణ జన్ముడుగా కనిపించాడని చెబుతారు. ఇంతటి గొప్ప అనుభూతిని ఇచ్చే దైవీకమైన గ్రంథం నన్ను సమీక్ష చేయమని నాకు రావడం నిజంగా నా అదృష్టంగా, ఇది కూడా ఒక దైవీకమైన నిర్ణయంగా భావిస్తున్నాను. దైవత్వాన్ని అనుభవించేవారు సృష్టిలో బహుకొద్దిమందే ఉంటారు. దైవత్వాన్ని వినేవారు అనేకమంది ఉన్నా దాన్ని ఆకళింపు చేసుకునేవారు కొద్దిమందే ఉంటారు. నిజంగా ఆ దైవత్వాన్ని పొందిన వ్యక్తి ఎవరో తెలియదు. వాటిని ఆకళింపు చేసుకుని అక్షరీకరించిన వ్యక్తి ఎవరో తెలియదు. కానీ ఈ అనుభవాలు నాకు అందడం చూస్తుంటే అంతా దైవేచ్ఛ అనడం కంటే ఇంకేం అనగలను?

అసలు ప్రార్థన అంటే ఏమీ కోరకుండా చేసేది. మనసును తదేకంగా ఆ భగవంతునిపై లగ్నం చేసి కొన్ని క్షణాలపాటు మనల్ని మనం గుర్తించేలా చేసుకునేది. కానీ నేడు దేవాలయానికే ప్రతి ఒక్కరం కోరికల చిట్టాను తీసుకుని వెళతాం. అవన్నీ ఏకరువు పెడతాం. తీరిపోతాయనే తృప్తిగా వెనుదిరిగిపోతాం. అసలు మనకేం కావాలో ఆ భగవంతుడికి తెలియదా? మనల్ని సృష్టించి అతనికి మన జీవితంలో ఉన్న కొరత ఏదో తెలియదా? మనకేం ఇస్తే మంచిదో తెలియదా? గుండెను తీసి మరో గుండెను అమర్చడంలోనే ఆరితేరిన మేధావి వర్గానికి పూర్వజన్మ ఫలాలను, పాప కర్మలను అనుసరించి సాగే ఈ జీవితంలో మనకు ఎంత ప్రాప్తం ఉంటే అంతే సంప్రాప్తిస్తుందనే విషయం అర్థం ఎందుకు కాదు? ఈ జన్మలో వల్లమాలిన తప్పులు చేసి మనం పొందే ఆనందంలో ఎన్ని హృదయాలు భగ్గుమంటున్నాయో, ఎన్ని జీవితాలు అయోమయంలో పడిపోతున్నాయో తెలుసుకోలేక మనం ఆనందంగా ఉంటున్నామనే ఒకే ఒక్క తృప్తితో జీవించేసి,



మనం అందరికీ మంచే చేసామని చెప్పుకుంటూ మనల్ని మనం మభ్యపెట్టుకుంటున్నాం. కానీ చేసిన పాపం మనల్ని మనకు తెలిపేదాకా ఎన్ని జన్మలు ఎత్తినా మనల్ని అనుసరించే వస్తాయని మరచిపోతాం. ఇలాంటిప్పుడే ఈ జన్మలో ఎదురైన కష్టాన్ని, నష్టాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటారు. కానీ వారెవరికీ తెలియదు ప్రతి జన్మ కిందటి జన్మ కొనసాగింపే అని. ఈ మాత్రం జీవిత రహస్యం తెలుసుకోకుండా మనకు మంచి జరిగితే ఆ భగవంతుడు గొప్పవాడని, చెడు జరిగితే ఆ భగవంతుడు కూడా తనకు అన్యాయం చేసాడని, భగవంతుడు కూడా డబ్బు ఉన్నవారికే సాయం చేస్తాడని, మూర్ఖంగా అనుకునే సమాజంలో మనం ఆనందంగా జీవించేస్తున్నాం. ఇదీ కాకుండా తనకి ఎవరైనా ఏదైనా అంటే, లేక అన్యాయం చేస్తే ఆ భగవంతుడు వూరికే వదలడని కూడా కొందరు అంటుంటారు. మనకిష్టమైన వారిని కాపాడి, మనకు శత్రువులైనవారిని శిక్షించే తీరులో ప్రవర్తించడానికి ఆ భగవంతుడు మనం నియమించుకున్న నౌకరు కాదని అలాంటి వారు గ్రహించాలి. ఎందుకంటే మిత్రువులు ఎవరో, శత్రువులు ఎవరో నువ్వు చూసే చూపులో ఉంది తప్ప వేరేమీ లేదు, నిన్ను వద్దనుకున్నవారు హీనులూ కారు.. నువ్వే లోకమనుకున్నవారు అందరూ ఉన్నతులూ కారు. అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. అందుకేనేమో స్వామి వివేకానంద అంటారు. "ప్రతి రోజూ నీతో నువ్వు మాట్లాడుకో.. అపుడే నీలోని తప్పులు కనిపిస్తాయి. నీలోని ఒప్పులు ప్రజ్వలిస్తాయి" అని. కానీ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సింది ఒకటే. మన జీవితంలో జరిగే ప్రతీదీ ఆ దైవ నిర్ణయం అని, ఆ భగవంతుని అనుజ్ఞ లేకుంటే మనం ఇసుమంతైనా పొందలేమని.. ఈ విషయం చాలామందికి తెలుసును కానీ ఒప్పుకోవడానికి మనస్సు అంగీకరించదు. ఇదో మాయ అంతే..

సరే.. అసలు విషయానికి వస్తే.. భగవంతుడి లీలల్ని తన జీవితంలో ఎన్నో అనుభవించిన వెంకట వినోద్ పరిమి గారి జీవితమేమీ పూలబాట కాదు. ఎన్నో సమస్యల్ని అధిగమిస్తూ నేడొక అత్యున్నత స్థానంలో కూర్చున్న వ్యక్తి వీరు. ఏ సమస్య వచ్చినా ఏదోరూపంలో వీరికి సహాయం దొరకడం ఆ దైవ లీలగా తెలుసుకున్నారు. నిజంగా కూడా ఈ గ్రంథం చదువుతున్న నాకు ఎంతో ఆశ్చర్యం వేసింది. వీరెంత అదృష్టవంతులో అని కూడా అనిపించింది. కలలు కనడం మనిషికున్న లక్షణం. కలలంటే ఊహలు కాదు. నిద్రలో కలలు కనడం. కానీ ఆ కలలకు తార్కాణం కనిపించిన వీరి జీవితం మనకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఎన్నో అనుభవాలను చదివి తరించిన నేను ఉదాహరణకు వీరి అనుభవాన్ని ఒకటి నేను మీతో పంచుకుంటాను..

ఒరిస్సాలోని బరంపురంలో వెంకట వినోద్ పరిమి గారు డిప్లొమా చదువుతున్న రోజుల్లో ఒకవైపు తండ్రి పక్షవాతం మంచాన పడి ఉండటంతో వీరికి జీవనాధారమైన "నేషనల్ ఆటో జెరాక్స్" అనే ఫోటో కాపీయింగ్ షాప్‌ను తన అన్నయ్యతో పాటు నడిపేవారు. దానిపై వచ్చే ఆదాయం పూటకు గడవని పేదరికంలోని వారికి తండ్రి మందులకు ఖర్చు కావటంతో తిండికి కష్టకాలం వచ్చినట్లయింది. అందుకు తోడు ఫోటో కాపీయింగ్ మిషెన్ రిపేర్‌లోకి వచ్చింది. ఆదాయం ఎలా? రేపటినుండి ఎలా బతకాలి? ఒకవేళ ఈ మిషన్‌ను రిపేర్‌కు ఇవ్వాలంటే 1500 రూపాయల ఖర్చు అప్పట్లో అంటే 1991-92 లో అదీ భువనేశ్వర్ దాకా వెళ్ళాలి అంటే మరో వంద రూపాయలు కావాలి. దాంతో వీళ్ళు చేసేది లేక షట్టర్ క్లోజ్ చేసి కూర్చున్నారట. కాస్సేపటికి ఎవరో షట్టర్ తడుతున్న చప్పుడు.. అది విని లేవబోతున్న వినోద్‌ను తన అన్న వారిస్తూ వద్దు, ఎవరో పని కోసమే వచ్చివుంటారు. మనం మిషన్ పనిచేయడం లేదని చెప్పడం ఎందుకు? వారే కాస్సేపు కొట్టి వెళ్ళిపోతారులే అంటూ.. కానీ ఆ శబ్దం మరీ పెరిగిపోతుంటే ఇక తప్పనిసరై షట్టర్ తీస్తే అక్కడున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయారు. కారణం నుదుటిమీద విష్ణునామాలు, చేతిపై విష్ణునామాలతో ఆజానుబాహుడులా ఉన్నాడు.. ఎవరో బ్రాహ్మణుడు డబ్బుకోసం వచ్చాడేమో అనుకుని "మాకే ఏమీ లేదు. నీకేం ఇవ్వగలం" అని వినోద్ వెనుదిరిగి వెళ్ళిపోతుంటే ఆ వ్యక్తి "నేను మీ దగ్గర తీసుకోవడానికి రాలేదు. మీకు సాయం చేయడానికి వచ్చాను అంటూ అతని మెడలోని తులసిమాలలోంచి రెండు ఆకులు తెంపి ఇచ్చి ఇవి తినండి. మీకు మంచి జరుగుతుంది అని వెళ్ళిపోయాడు. ఆ ఆకులు నోట్లో వేసుకోవడం చూసి వినోద్ అన్నగారు నీకేమయినా పిచ్చా? అలా ఎవరు ఏది ఇస్తే నోట్లో వేసుకోవడమేనా? అని కోప్పడ్డాడట కూడా. కానీ కాస్సేపటికి మరోసారి ఎక్స్‌పోజర్ ల్యాంప్‌ను పెట్టి ప్రయత్నిద్దామా అనిపించిందట. కానీ ఆశ్చర్యం ఆ ల్యాంప్ ట్రై చేయగానే మిషన్ రన్ అయ్యిందట.. ఇంత సేపూ ప్రయత్నించినా ఏ ప్రయోజనం ఇవ్వని ఆ మిషన్ ఎలా స్టార్ట్ అయ్యింది? అలా ఒకటి కాదు రెండు కాద లక్షా యాభై కాపీలు వచ్చేవరకు ఆ మిషన్ పనిచేస్తూనే ఉండటం ఆశ్చర్యం కాక మరేమిటి? అనుకుని ఆరోజుకి పనిని ఆపి వేంకటేశ్వం స్వామి గుడికి బయలుదేరారట. నిజంగా ఇది దైవేచ్ఛ కదూ.. ఇలా ఒక్కటేమిటి అనేక సంఘటనలు ఈ గ్రంథం నిండా.. నాకున్న ఆశ్చర్యంతో అన్నీ సంఘటనలూ వివరించాలనే ఉంది. కానీ మరో వంద పేజీల గ్రంథం అవుతుంది. అదే మీరు చదివితే మీకూ ఈ అనుభూతి కలగవచ్చు కదా అనిపిస్తోంది..

ఈ గ్రంథం నిండా ఇలాంటి ఆశ్చర్యాలు... వినోద్ పరిమి గారు కన్న కలలకు భాష్యం.. ఎదురైన సంఘటనలు ఒకదానిని మించి మరొకటి ఉన్నాయి. 175 పేజీలున్న ఈ గ్రంథంలో ప్రతి పేజీ ఆశ్చర్యజనితమే.. ఆనందభరితమే.. ఇన్ని అనుభూతుల్ని మూటకట్టుకుని నిత్యం ఆ దేవుని సంరక్షణలో ఉన్న వినోద్ పరిమి గారి జీవితం ధన్యం.. వాటిని అక్షరీకరించిన రమేష్ కుమార్ గారు కూడా ధన్యులే.. సంసారం, సంపాదన, అత్యాశ, మోసం, నమ్మకద్రోహంతో నిండిపోతున్న ఈ సమాజానికి ఇలాంటి గ్రంథాలు అందివ్వడం ఆ దైవ సంకల్పవే అనిపిస్తోంది.. నమస్తే.

ప్రతులకు: ఎమ్. రమేష్‌కుమార్
ఫోన్: 94924 54678



-శైలజామిత్ర
9290900879

## లంచములీయగవచ్చును



కం.
ధనదాహముగల వారలు
దినదినము కృశించుచుండు-తేజము తప్పున్
వనమున జలలేమివలన
కనబడు వృక్షములబోలి-కలవరమందున్!
కం.
డబ్బుబ్బజేయుమనుజుని
డబ్బేకడునొప్పిగూర్చు-డాబును పెంచున్
డబ్బున్నది దారుకలది
దెబ్బలు వడ్డించవచ్చు-తెలియుము"దానా"!
కం.
లంచములీయగవచ్చును
పంచను కట్టంగ వచ్చు-పశువువిధమ్మున్!
సంచుల కొలది ధనంబును
పంచిన గెలుపొందవచ్చు-వసుధను"దానా"!



-కిలపర్తి దాలినాయుడు
7780589336




ఆహ్వానము
2021 - 2022
చింతలపల్లి నిర్మలాదేవి - నారాయణ రావు
జీవన సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవము





తేది : 20-02-2022, ఆదివారం
సమయం : ఉదయం 10.00 గం.కు
వేదిక : సి.ఎన్.ఆర్. మెమోరియల్ హైస్కూల్

సభాధ్యక్షులు : శ్రీ చింతలపల్లి భాస్కర్ రావు గారు
ముఖ్య అతిథి : శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు
వ్యవసాయ శాఖామాత్యులు, తెలంగాణ ప్రభుత్వము
విశిష్ఠ అతిథులు : శ్రీ మర్రి జనార్ధన్ రెడ్డి గారు, యం.ఎల్.ఎ.
శ్రీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి గారు, యం.ఎల్.సి.
శ్రీ గోరటి వెంకన్న గారు
ప్రజాకవి, యం.ఎల్.సి., కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత
ప్రత్యేక అతిథులు : శ్రీ జూలూరి గౌరిశంకర్ గారు
చైర్మెన్, తెలంగాణ సాహిత్య అకాడమి
శ్రీమతి కటికనేని విమల గారు
రచయిత్రి, ముక్త తెలంగాణ మహిళా అధ్యయన వేదిక
పురస్కార గ్రహీతలు : శ్రీ దుశర్ల సత్యనారాయణ గారు, నల్లగొండ
(సామాజిక సేవా రంగం) 2021
శ్రీ నాళేశ్వరం శంకరం గారు, నిజామాబాద్
(సాహిత్య రంగం) 2022
ఆహ్వానించువారు :
చింతలపల్లి భాస్కర్ రావు
చింతలపల్లి రాంచందర్ రావు
సుమతీ రంగినేని
మరియు సి.ఎన్.ఆర్. విద్యాసంస్థలు
నాగర్‌కర్నూల్.


## పాడుకాలం-పాడే కాలం

మేలుకొలుపు పాడే మనసులకన్నా
భజనకీర్తనలు పాడే మనుషులే
ముప్పుగా కనిపించే కాలం కదా ఇది.

కరకుచూపుల కాఠిన్యం కన్నా
తేనెపూసిన కత్తులే
కలవరపెడుతున్న పాడుకాలం కదా ఇది.

ఆకలి ఇండియా బాధ కన్నా
ఐపిఎల్ (ఎఖఎ) ఇండియా బిడ్డింగే
జాతీయ వార్తయిన కాలం కదా ఇది.

విద్యార్థుల మనసుల్లో
చెలిమి చెట్లను పెకలించి
విద్వేషాల కంకరరాళ్ళతో నింపుతున్న
పిదపకాలం కదా ఇది.

నల్లని నీడలు తమని కప్పుతున్నాయని
మేఘాలు చింతిస్తాయా
సమయాన్ని ఎదురుచూస్తాయి.

మనుషులం కదా నిరాశని తరిమేసి
పాడుకాలం 'పాడే'కాలమవ్వాలని
ఎదురుచూద్దాం.



-సి.యస్.రాంబాబు
8374818961

## శీతల రాగం !

పొగ మంచు
ఏ బంధం కోసమేమో
మా పల్లెను జల్లెడ పట్టి
ఏ పువ్వులోనో ఒదిగి
జడలో జాబిల్లై మెరుస్తోంది.
ఉదయాన్నే ఊరడిస్తూ
ఉదయ రాగాన్ని ఆలపిస్తూ
చలి తరంగం
చల్లని సోయగాల్ని రుద్దుతోంది.
పాల పిట్టలన్నీ
ఏ పొదుగు గూళ్ళలోనో దూరి
ప్రణయ రహస్యాల్ని కలగంటూ
విరహంలో విహరిస్తున్నాయ్.
రాలిన మంచుతో పూదోట పునర్జన్మ
పుక్కలింతల్ని నెమరువేస్తూ
కమ్మని కాంతుల్ని వెదజల్లి
కూని రాగాల కచేరిని సిద్ధం చేస్తోంది.
ఎన్ని ఉదయాలు కరిగినా
కొన్ని హృదయాల స్పర్శ కోసం
శీతల రాగం
సరిక్రొత్త అనురాగమై
త్రుళ్ళింతల చిత్రమై నిలుస్తోంది....!!



-మహబూబ్ బాషా చిల్లెం
9502000415

## స్వచ్ఛ్ ఇన్సాన్

మార్పు విప్లవానికి అర్థం
పెను మార్పులోనే సమాజ వికాసం
మనిషి మారుతున్నాడంటే
ప్రగతి కాదు
మంచి మమకారాల
స్థానమేమిటో తెలియాలి
సామాజిక విలువల పతనం
ఏ అభివృద్ధికీ ఆదర్శం కాదు
సమస్యలెన్ని ఉన్నా
బుద్ధితో పరిష్కారం
తెలివి వక్రీకరించినపుడు
చెడు దారుల్లో పయనించినపుడు
వివేక అర్థం
విధి లో కాలరాయబడినపుడు
మనిషికి అర్థం ఉండదు.

లోకమంతా నిండుకున్న స్వార్థం
సత్యాన్ని దూరం చేస్తున్నది
వేగపు పయనం లో
నీతికి పాతర వేస్తున్నది.

ఇప్పుడు దులపాల్సింది
బూజులే కాదు
మనిషి మెదడు కిటికీ
బూజులూ శుభ్రం చేయాల్సి ఉంది
రోడ్లపై చెత్తనే కాదు
మనుషులకు పట్టిన స్వార్థ
చెత్తనూ దూరం చేయాల్సి ఉంది
నిర్లక్ష్యపు సైతాన్
మనిషి లోని అవలక్షణాలను
దూరం చేయాల్సిన
మంత్రదండం కావాలిపుడు
అనర్థ కారకాలను చూపించే
మనసు అంతరంగం
అద్దం గా మారాలిపుడు.

నిజాయితీతో బతక లేక
రాజీలను ఇముడ్చుకునే
బలహీనుల మనస్సుల్లో
ఎదిరించే ధైర్యం రావాలిపుడు
జవాబును కోరే
వెలుగుల ఉదయానికి
సూర్యుడిగా
నువ్వే మారాలిపుడు
దుర్మార్గాన్ని ఎదురించేందుకు
సమాజ గర్భంలోంచి
స్వచ్ఛ్ ఇన్సాన్‌గా నువ్వే
పురుడు పోసుకోవాలిపుడు.



-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038






నేను
భూమ్మీద
నిలబడేవాణ్ణి-
కాని
ఆలోచనల్లో
ఆకాశాన్ని దాటేవాణ్ణి!



-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

## మన తక్షణ కర్తవ్యం పర్యావరణ పరిరక్షణే...

నింగిలోకి తొంగిచూసే రైతన్నలనడిగా...
మీ ఈ దుర్భరదుస్థితికి కారణమెవరని?
...కరగని కురవని నింగిలోని మేఘాలేననే...

నింగిలోన దాగిన మేఘాలనడిగా...
మీరెప్పుడు చిరుజల్లులుగా మారేదని?
...తమను తాకని చల్లగాలినడగమనె...

నీలాకాశంలో నల్లని చల్లగాలినడిగా...
మబ్బులతో ఎందుకు మీకు విరోధమని?
...స్వార్థంతో వాతావరణాన్ని కలుషితం
...చేస్తున్న మాయదారి మనుషులనడగమనె...

మాయదారి మనుషులనడిగా...
ఈ విషపూరిత వాతావరణ
కాలుష్యానికి కారణమెవరని?
...చట్టాలను, గట్టిశాసనాలు చేసినా
...కఠినంగా అమలు చేయలేకున్న
...అసమర్థ ప్రభుత్వాన్ని అడగమనె...

అసమర్థప్రభుత్వాన్ని ఘాటుగానే ప్రశ్నించా...
పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఎవరిదని?

...మంచిచెబితే....వినని....మారని....ప్రజలేదేననె
...వారికి మంచిబుద్ధినివ్వని ఆ భగవంతుడిదేననె

ఆపై భగవంతుని పాదపద్మాలను
కన్నీటితో కడిగా... ఆర్తితో అడిగా...
కన్నుమిన్ను గానక భూవాతావరణాన్ని
కలుషితంచేసి పంచభూతాల ఆగ్రహానికి గురైన
...ఈ మనిషి జన్మకు అర్థం పరమార్థమేమిటని?
...పొంచివున్న ఈ పెనుప్రమాదానికి
...ఈ విధ్వంసానికి ఈ వినాశనానికి అంతమెప్పుడని?

విశ్వవాణి ఓ సందేశాన్నందించిందిలా!
మనిషి తన స్వార్థాన్ని విడనాడినప్పుడేనని...
ప్రకృతి ధర్మాలకు నియమాలకు కట్టుబడి
పరులశ్రేయస్సును...
ప్రపంచ సంక్షేమాన్ని కాంక్షించినప్పుడేనని
మానవత్వమే దైవత్వంగా భావించి జీవించినప్పుడేనని,,
అప్పుడర్థమైంది ఈ ఘోరవిపత్తుకు కారణం మనిషేనని
మనందరి...తక్షణ కర్తవ్యం.....పర్యావరణ పరిరక్షణేనని



–పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## విద్య విలువ

చదువన్నది నేర్చుకున్నచో
బతుకులు బాగుపడు తుండును.!
విద్యయే బోధించినచో
సంఘమున విలువ పెరగుతుండును.!!

చదువు సంధ్యలతోడ నేడు
సాగుతుండును జీవితాలు.!
చదువే లేకుంటే జగాన
సాగకుండు పేదల బతుకులు.!!

రాను రాను మారుతుండే
విద్యా విధానాలన్నియు.!
దొరుకకుండా అవుతుండే
బీదలకు ఉచిత విద్యన్నదియు.!!

పైసల విద్యకు విలువనిస్తు
ప్రభుత్వ విద్యను చూడకుండే.!
బీదలకు అన్యాయం చేస్తు
బతుకులాగం చేస్తుండే..!!

ప్రభుత్వ చదువులకు విలువనిస్తు
సౌకర్యములను కల్పించండి.!
బీదపిల్లలకు భరోసనిస్తు
బతుకులు బాగుపడెల చూడండి..!!



–పసుల.శంకర్
9542181301

## ఆకుపచ్చని సిరి

అవనంతా అల్లుకున్న పచ్చదనమే
మానవ మనగడకు ఊపిరై
ఏపుగ విచ్చుకున్న వనదేహమే
ఔషధమూలికల మేలిసంపదై
పురుడుపోసుకున్న ప్రాణవాయువే
జనులకంతా జీవనసారమై
ప్రకృతితో మమేకమైన
ఈ...సృష్టి ఎంతచిత్రమో కదా!

అత్యాశతో ఆకాశహర్మ్యాలను కట్టి
అవివేకంతో పలు కానలను కూలగొట్టి
అభివృద్ధి పేరిట పరిశ్రమలను పెంచి
మట్టిసమాధిలో ఆకుపచ్చసిరిని అంతంచేస్తూ
వికటాట్టహాసం చేస్తున్న
మనిషి..ఎంత విచిత్రమో కదా!!

పచ్చదనపు పరిమళమే తక్షణకర్తవ్యమై
వినాశన మూర్ఖత్వమే విసర్జితమైతే
పచ్చనిబతుకే వెచ్చగా కౌగిలించుకోదా!
ఆకుపచ్చని సిరి రాజ్యమేలదా!!



–అయిత అనిత
8985348424

## జలం

జీవకోటి మనుగడకి ప్రాణాధారం జలం
జలమును పొదుపు చేస్తే కలుగుతుంది ఫలం
జలమును వృధా చేస్తే ఏముంటుంది ప్రతిఫలం
జలమును రక్షిస్తే భావితరాల భవిష్యత్తు ఉజ్జ్వలం
జలమును కాపాడటానికై క్రుషి చేయాలి ప్రతిఒక్కరం
జలమే కదా మన జీవన తొలి సోపానం
ప్రపంచ పటంలో ఆక్రమించింది
జలమే అధిక స్థానం
జలమును కాపాడితే ప్రపంచం సస్యశ్యామలం
జలము శూన్యమైతే బతుకు అంధకారం
జలము సమృద్ధిగా ఉంటేనే పంటలు పచ్చదనం
జలముతోనే కదా జరిగేది సమస్తం
జలము లేకపోతే జగత్తు నిర్వీర్యం
జలము కనికరిస్తే అంతా ఆనందభరితం
జలము ఆగ్రహిస్తే ప్రాణికోటి అతలాకుతలం
అందుకే సమస్త సోదర సోదరీమణులారా!
జలో రక్షతి రక్షిత :

–చల్ల. సునితాసంపత్
కాటారం కేజీబీవి ప్రిన్సిపాల్
జయశంకర్ జిల్లా

## యమపురికి దారులు

నవ్య నాగరికతకే చిహ్నాలుగా..
ఛాలిల్లుతున్న రాచబాటలు..
గ్రామీణ పొక్కిలి రోడ్ల గుంతలు
పొంగు పొర్లుతున్న బహురద్దీలు
వణుకుతున్న స్టీరింగ్ చేతులు
వాహన గిర్రల పడరాని పాట్లు..
యమపురికే మార్గాలైన దారులు..
గాల్లో కలుస్తున్న విగత జీవులు !

అతి వేగ డ్రైవర్ల దురలవాట్లు
మద్యంలో గమ్యతైన మత్తులు
వాహన సాంకేతిక మొరాయింపులు

యువరక్తపు శక్తి తత్రుబాట్లు
చోదకుల నేరపూరిత నిర్లక్ష్యాలు
రహదారులే ప్రమాద విపత్తులు
పదుల క్షతగాత్రుల హాహాకారాలు
కడతేరుతున్న నిండు ప్రాణాలు !

పాలకుల అలవిమాలిన అలక్ష్యాలు
నీటిపై మిగిలిన చట్టపు రాతలు
రోడ్డు భద్రతా ప్రాధికార సంస్థలన్నీ..
కునారిల్లుతున్న ఉత్సవ విగ్రహాలే
శకటాసురుల నరక కోరల్ని..
పదును పెట్టే మద్యం అమ్మకాలు
తెల్లబోతున్న న్యాయపాలికాదేశాలు
తోడేస్తున్న అమాయకుల ఆయువులు
పచ్చని కాళ్ల పెను మంటలు !

రహదారి గుంతలకు స్వస్తి పలికి..
ప్రాణం తీయుట హత్య సమానమని..
శకటాసురుల నిర్లక్ష్యమే తీవ్ర వేరమని..
చోదక మత్తు బాబులకు చెరసాలలు
రోడ్డు నియంత్రణలకు పదును పెట్టి..
ట్రాఫిక్ నిబంధనలను ఏకరువు పెట్టి..
సర్వాంగ సుందర దారుల్ని తీర్చిదిద్ది..
అధికారుల నిర్లక్ష్యాన్ని చురకెత్తించి..
రహదారి ఘోరకలులకు అడ్డుకుందాం !



–మధుపాళీ
9949700037

## కాంతి దివ్వెలు

పుట్టిన పిండి పండు
కాకముందే కోసినట్టు
లేత ప్రాయంలోనే శిశువులను
మొగ్గలోనే తుంచేస్తున్న
జాలి లేని కామాంధుల
వికృత చేష్టల వలన
బాలల పసిప్రాయం
గనుల్లో,ఫ్యాక్టరీ పనుల్లోన
చిక్కిశల్యమవుతున్నది..

సరస్వతీ గుడిన
ఆటలాడాల్సిన వయసున
మాతృదేవత ఒడిన
స్వేద తీరాల్సిన ప్రాయమున
రెక్కాడితే తప్ప డొక్కాడని
దుర్భర పరిస్థితులు వలన
అశక్తతను అధిగమించలేని
తల్లిదండ్రుల పేదరికం
పిల్లలపై భారం మోపుతున్నది..

ఎక్కువ పనిని చేయించి
ఆలస్యమైతే శిక్షించి
లైంగిక వేధింపులు గావించి
శోకాగ్నిలను మిగిలిస్తున్నది..

కడు దారిద్ర్యం వారిని
నేరాల వైపు పురిగొల్పుతుంటే
దురలవాట్లకు బందీలై
కటకటాల్లో బాల్యం మగ్గుతున్నది..

కంటికి రెప్పలా కాపాడాల్సిన
తల్లిదండ్రులు నిస్సహాయత
ప్రభుత్వ ఉదాసీనత
వారి పాలిట శాపంగా మారి
బాల్యమున చిదిమేస్తున్నది..

ప్రభుత్వాలు చిత్తశుద్ధితో
సంక్షేమ చర్యలు చేపట్టి
ప్రజల్లో చైతన్యం నింపి
కార్మిక వ్యవస్థపై
ఉక్కు పాదం మోపి
చితికిన బతుకులలో
కాంతి దివ్వెలను వెలిగించాలి..!



–పిల్లి.హాజరత్తయ్య,
9848606573

## చెకుముకులు

ఏది
ఇదని చెప్పలేని
పరిణితి
మౌనం.

చెప్పినా అర్థం కానిది
చూపినా తెలుసుకోనిది
సహజంగా దగ్గరయ్యేది
మనసు.

తప్పుగా తోచి
ఒప్పుగా గెలిచి
గొప్పగా తెలిసేది
నిజం

దారి తెలియకుండా
వాహనం లేకుండా
పయనించ గల నేర్పు
ఒక్క ఓర్పుది.

దాచుకొన్న పల్లె
ముఖచిత్రాన్ని పెద్దగా చదివాను
బిగ్గరగా ఏడ్చిన చప్పుడుకు
జ్ఞాపకం కన్నీరు పెట్టింది.

ఒక్క మాటను మరువకుండా
మనసు మోయడం
చుక్క జారిపోకుండా సముద్రాన్ని తోడటం
నిజమైన ప్రేమకే సాధ్యం.

నీటి చుక్క దొరక్క
దప్పికతో బావుల గొంతు ఎండి
మినరల్ వాటర్ తో నాజూగ్గా
మనిషి ఆరోగ్యం

కళ్ళను పంపకు.దూరంగా...
ఎక్కడో మునిగి "కల"గా మోసుకొస్తే?
తీరే దారి లేక వెనక్కు నడిస్తే?
ప్రేమకు గ్రహణం పట్టి మనసు సమాధి.

కనిపించని దేవుడు
కనిపించే మనిషిలా
కరుణిస్తే ....
కురిసిన ఆనందం పేరు ప్రేమ.

చేయి అలా
చల్లిందో లేదో
మన్ను బదులు పలికి
మొక్కచే దూసేడు పూలు పంపింది.

మనసు
అలా కలిసిందో లేదో
మాట ఊపిరి మారి
గుప్పెడు గుండె గొంతుక కలిపింది.

తప్పని స్థితిలో కాగితానిపై వాలి
భావం వర్షించింది.
తప్పించుకొనే దారిలేక కాలానికి
చిక్కి శత్రువుగా మారింది.

ప్రేమకు మనసు బానిస
మనసుకు మనిషి లోకువ
మనసు తీపికి మాట గెలుపు
నిజం చేదుకు ప్రేమ గెలుపు

సృష్టిలో తియ్యని ఆనందం
మనిషి.
మనిషిలో తీరని అనుభూతి ప్రేమ.

మనసు భాషలో
వేసిన ప్రశ్నకు
జవాబు తెలిసిన
ప్రకృతి పేరు ప్రేమ.

మనిషి
మరో మనసును మోస్తూ
సాగే యాత్ర
జీవితం.

"ఇష్టం"
కన్నీరు పెడుతుంది
ఆలోచనను తెంపే పదును
ఈ జన్మకు లేదని....

"ఆలోచన"
ఆవేదన పడుతుంది
ఇష్టాన్ని చంపే శక్తి
ఈ మనసుకు రాదని....

లిపిలేని మనసు భాషలో
జీవితం ఓ అవధానం
పురుషులు పృచ్ఛకులు
అవధాని స్త్రీ

ఎవరి కథలోనైనా
మలుపు ఓ అవకాశమే
అలుపు తీర్చుకోవడానికి
గెలుపు నేర్చుకోవడానికి

జీవితంలో
నిజం అబద్ధమైనప్పుడు
అనుభవం నిజమౌతుంది.
జీవితానికి జీవితాన్ని చూపిస్తుంది.

కావాలని రాస్తే
కవిత్వం కావచ్చు
జీవితం కాకపోవచ్చు......

అనుభవించి రాస్తే
కవిత్వం అవకపోవచ్చు
జీవితం కాకుండా పోదు......

ఆవిరైనా సరే
ఆ మాట ఎప్పుడో
మేఘమై
నాపై కురుస్తుంది.

జల
ఎప్పుడైనా కనిపిస్తుందా?
చెదితేనేగా
చెంగుమని పొంగుతుంది.

ఎంత చదివినా
అర్థం కాని గ్రంథమే జీవితం.
అందులో భోధించలేని
అనివార్యమైన అంశం మనసు.

రాతిలో మొలిచిన మొక్కకు
నీరవసరం లేదు–పాదక్కరలేదు.
నీతిలో చీల్చుకుపుట్టిన ప్రేమకు
పలుకవసరం లేదు–చూపక్కరలేదు

చీకటిలో వెన్నెల సంతకం
ప్రేమ.
పగటిలో పచ్చని చూపు
మనసు.

పూలు కురిసి కురిసి అలసిన చెట్టు
ఒట్టిపోయిన పచ్చదనంతో
అస్థిపంజరమై గాలిని వేడుతుంది
నేల ఒడిని ఒరిగెలా చేర్చమని...

మెదడు గుబుర్లలో
ఆలోచనల పక్షులు
గూళ్ళు పెడితేనేగా..
అవి మనసంతా సందడి చేసేది.

ఒక నిజం నమ్మకాన్ని ఎప్పుడూ
మోసం చేయదు..
ఒక నమ్మకం అబద్ధాన్ని ఎప్పుడూ
నిజం చేయదు..

సూరీడు ఈర్షపడే ప్రభాతం నుండి
రాత్రి అసూయపడే నిర్నిద్ర దాకా
మనసును ఎక్కడికో మోసే
మనిషి ప్రవహనిది ఎంత అద్భుతమో?

అప్పుడప్పుడు
ఆలోచనల్ని ఉతికి ఆరేయాలి
మెదడు మురికి వదిలేలా
మనసులో మలినం తొలిగేలా

గదిలో మొబైల్ మగ్గడం కాదు.
పుస్తకాలతో కలసిమెలిగితేనే
జీవితంలో జారుడుమెట్లపై
అక్షరాలు ఊతమై నిలుస్తాయి.

గాలి అంటే ఫ్యాన్.
చల్లన అంటే ఏ.సి.ఈ పిచ్చిపిల్లలకు.
చెట్టు ఒడిలో వదిలిరండి.
ప్రకృతిలో గాలి విలువ తెలుస్తుంది.

లోపలి చెత్త, చిత్తును ఊడ్చి
నిజాల్ని కళ్ళాపి చల్లితే
మనసు శుభ్రపడుతుంది.
మనిషి శాంతపడతాడు.

నానమ్మ చేతి చిరుతిండ్లు
అమ్మమ్మ చేతి పిండివంట
వీధిలో కార్పోరేట్ రుచులకు
కళ తప్పి 'వెల' తప్పాయి

ఇవ్వని కొలత –తెలియని బట్ట.
ఎవడి తలలో పుట్టిన కుట్టుకో
బజారుకెక్కిన ఈ అందాన్ని
అద్దంలో కాదు అర్థంలో చూడాలి.

పొద్దుకు దుప్పటి కప్పి
వెలుగును మత్తులో ముంచి
చలిమరలు ఎన్ని ఉదయాలనో
ఎన్ని హృదయలకు దూరం చేసాయో!

చూస్తుండగానే
కరిగేది కాలం కాదు ఆయువు.
ప్రతి క్షణాన్ని పుంజుకునే
సొంతమే జీవితం.

పేర్చిన పాపాలతో
మండే ఆనందాల్ని నెత్తిన పోసుకుని
స్వీయ నరకాన్ని చితిలో సెల్ఫీ దిగి
భూమి పోస్ట్ చేసే బుద్ధిహీనుడు మనిషి.

దేశానికి దీపమే "రైతు".
చమురు దొంగలు పాలకులు.
చీకటికతో కడుపునింపుకొనే
అమాయకులు ప్రజలు.

జీవితమంతా
ఖచ్చితమైన జావాబు
వ్రాయలేని పరీక్షాపత్రం
మనసు....

ఇష్టమంటే పచ్చని కోరిక.
మనసులో లోపలి నడక.
మౌనంగా పాకే అల్లిక.
బంధానికి పుట్టిన కలయక.

నీ ముఖాన్ని రోజూ
దినపత్రికలా చదువుతాను
ముఖ్యాంశాలలో నేనెక్కడో
చూసుకుంటాను.

అర్థరాత్రిదాకా వేధించి
వేకువలో మెలుకవుతావు...
పగలు ఏ ప్రశ్నకు జవాబునివ్వక
తిరిగి రాత్రికి ప్రశ్నగా మారతావు.
నా పక్కనే గడిపే మాట
గుండెలో వరాల మూట.
దూరమైనప్పుడు ఓ తీపిగుర్తు.
మళ్ళీ దగ్గరనప్పుడు ఓ తేనేపట్టు.

ఆకారంలేని
మనసును ఓ ఆకారంతో
అందంగా అలంకరించే
ఆభరణం ప్రేమ.

నీలో నా ప్రయాణం
సుఖమైతే సరిపోదు.
నీవు నాకు మంచి
గమ్యం కావాలి.

స్పందనలు
అసంకల్పితాలు
వాటికి పునాదులు వ్యక్తిగతాలు
కూల్చలేని స్థిరమైన వాస్తవాలు.

మొలిచిన పూటే ప్రాణం పోసాను...
పూచిన రోజే పండుగ చేసాను.
రాసిన కవితతో పూజను చేసాను
మోసిన మనసులో బానిసనయ్యాను

రాతిన చూపులు చల్లి
మాటల ముగ్గులేసి
నవ్వులరంగులద్ది
మనసిచ్చి పండుగ అయ్యావు.

ప్రకృతి చరిత్రలో
రంగులు మార్చని రూపం
నిజమై ప్రాణం పోసి
జీవం నిలిపింది నీటి చుక్క.

అవని ఆవిరికి
ఆకాశంలో మేఘసృష్టి జరిగి
మట్టికి పంపిన ప్రేమ కానుక
చినుకు ముక్క.

మనిషి ప్రకృతికీ దూరంగా
కృత్రిమ సుఖాలు మరిగి
చెదలా పాకిన విష నాగరికపు
విచ్చవిడితనమే 'భూమి కన్నీరు'

అద్భుతమైన ఆశ్చర్యం
మనసు.
ఆశ్చర్యమైన అద్భుతం
ప్రేమ.



–చందలూరి నారాయణరావు
9704437247

## అంతులేనిది అక్షర దాహం..!!

నా కంఠంలో అక్షరమాల
నన్ను సంస్కరించే రుద్రాక్షమాల
వందన చందన ఆనందాల హరివిల్లై
అజరామరమైన జీవితపు వెలుగు పంచే...

అంతులేనిది నా అక్షర దాహం
నీరాజనాలతో నిత్యమూ పండుగే
మాతృభాషలో మాధుర్యం అందుకు ప్రతీక
చెప్పాలనే ఆత్రుతకు అక్షరమే దీపిక....

అక్షరమే నా సంస్కృతి
నా ఆలోచనే కవితా కుసుమము
నిత్య నైవేద్యముగా తెలుగు తల్లికి
ప్రతి నిత్యము అక్షరాభిషేకం చేస్తాను...

ఇతిహాసపు మర్మములు వింటూ
కావ్యాల కాంతామణులతో గడుపుతూ
ప్రబంధ శృంగార రసంలో ఓలలాడుతూ
ప్రతి గ్రంథము పంచే
పరిమళాలను ఆస్వాదిస్తున్నా..

రాలిపడిన రస కావ్యం
నవరసభరితం పరివేష్టిత గీతిక
సంగీత జ్ఞానం పరిమళం వసంతము

తెలుగు భాషనే
ఒదిగి ఎదిగేందుకు దర్పణం...

సాహిత్యంలో విరబూసిన కావ్య ఫలాలు
హస్తభూషణాలంకారములై నిలిచే
తరతరాలకు అమృత భాండమై
జ్ఞాన వినోద కళారూప
సాధనమై వెలుగొందే...

తరతరాల సంస్కృతికి ఓనమాల భాష
జీవనదిలా ప్రతినిత్యం ప్రవహించెను
ఉవ్వెత్తున ఎగిసిన కృష్ణా తరంగిణిలా
గోదావరి నేలపై
సాహిత్య మాగాణిలో మణులు పండించే..

ముత్యాల భాషతో
ముత్యాల స్వరాలు పలికే
తెలుగు కన్నె వాడిలో రత్నాలు పొదిగే
ముక్తకంఠంలో మురిపెంగా మారుమ్రోగే
ఎలుగెత్తి చాటిన విశ్వమంతా వినిపించే...



–కొప్పుల ప్రసాద్
9885066235

## క్షణం!ఘనం!!

క్షణక్షణం ఘనం ఘనం
దినదినం ఎంతో ఘనం
క్రమశిక్షణ రక్షణ తో
బాలబాలికలు అందరూ
కాలం ఘనత గుర్తిస్తే
గెలిచే లా నిలవగలరు
అక్షర ఉపశమన లక్ష్యం
పెంచి పంచుకోగలరు
అమ్మా నాన్నా గురువు
కొట్టి తిట్టినా యిట్టే మరిచే
బాల్యం భాగ్యం వున్నవరకే
మొగ్గ వికసిస్తే పువ్వుగా

పరిమళించే ఘనం ఘనం
ఎండిన నేలకు తడిమే
నీరులా చల్ల చల్లగా
ఎగిరే పక్షికి మేఘాల పాపల
పలకరింపు లా చల్లచల్లగా
కాలం కలకాలం ఘనం !!
రండి రండి బాలాలందరు
కాలంతో చేతులు కలుపుదాం !!



– యల్. రాజా గణేష్
సెల్: 9247483700

## "కాలం అంచులమీద అలసిన వలస పక్షులు"...!

పుస్తక సమీక్ష





సాహిత్యానికి మకుటం కవిత్వమే, వచనానికి క్రమశిక్షణ నేర్పే గురువు కవిత్వం అంటాడు 'రష్యన్ కవి జోసెఫ్ బ్రాడ్స్కీ'. ఈ విషయాలు దాదాపు దశాబ్దంనర నుండి కవిత్వాన్ని వ్రాస్తున్న 'గవిడి శ్రీనివాస్' విషయంలో నిజం. రచయిత మొదటి కవితా సంకలనం "కన్నీళ్ళు సాక్ష్యం" పాఠకుల మనసు గెలుచుకున్న కవిత్వం, రెండవ కవితా సంకలనం "వలస పాట".

తెలుగు సాహిత్య సంస్కృతీ వికాసంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక ప్రత్యేకస్థానం ఉంది, ఎందరో మహాకవులను, కథకులను అందించిన నేల ఉత్తరాంధ్ర, ఆ ఉత్తరాంధ్ర నుండి "వలస పాట" వినిపిస్తున్న కవి 'గవిడి శ్రీనివాస్'. ఆ "వలస పాట"కు పల్లవి కలుపుదాం రండి.

ఉత్తరాంధ్ర రచయితలు ఎవరు కవిత్వం రాసినా వలస గురించి ప్రస్తావించని కవులు ఉండరు అంటే అతిశయం కాదు, గవిడి శ్రీనివాస్ ఈ అంశము గురించి బలమైన కవితలు రాయడంతో పాటుగా, తన కవితా సంకలనానికి "వలస పాట" అని పేరు పెట్టడం విశేషం.

"ఉత్తరాంధ్ర వలస పాట" అనే మొదటి కవితతో ఈ కవితా సంకలనం ప్రారంభిస్తాడు రచయిత, ఈ కవితలోని వ్యక్తీకరణలో ఉత్తరాంధ్ర పల్లె పల్లె ఒక్కో దిగులు తల్లి అంటూ...

**గాల్లో తేలాడే బుట్టలు**
**బరువెక్కిన బతుకు మీద**
**గాలిపటాల్లా నలుదిశలను వెదుకుతున్నాయి**
**చరిత్ర గుండెల్ని పిండినప్పుడల్లా**
**రాలుతున్న వలస పాటలు.**

**బస్ స్టేషన్ వెంటో, రైల్వే స్టేషన్ వెంటో**
**తగులుతున్న దృశ్యాలై జ్వలిస్తున్నాయి**
**కాలం నడుస్తున్నా పని చిక్కని చేతిలో**
**పొట్ట కూడదీకుని**
**ఆశల మూటల్ని బరువుగా మోస్తూ**
**వలస బండి గడగడా కదిలిపోతుంది.**

ఎప్పటికీ తెరవని ఉపాధి ద్వారాలు, సూర్యోదయాన్ని చీకట్లో బంధించాయి చెదిరే కాలం వెంట వలస విమానం పరిగెడుతుంది ఇప్పుడు అంటాడు రచయిత ఆర్ద్రతతో.

మనిషి సృష్టి రహస్యాలు తెలుసుకొని, ప్రకృతిని సైతం తన గుప్పెట్లో బంధించాలన్న ప్రయత్నంలో ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాడు,

ప్రకృతి ప్రేమికుడిగా కవి చేతి కలం నుంచి జాలువారిన 'పర్యావరణ పరిరక్షణ' దిశగా సాగే కవితలు ఎన్నో ప్రకృతిని ప్రేమింప చేస్తాయి, వర్షంతో తడిపేస్తాయి "నీరై పోనూ"...! కవితను చూస్తే అర్థమవుతుంది.

**జొన్న సేను రేకుల్లో**
**మబ్బుకళ్ళు జార్చిన**
**పన్నీరే ఈ చిట్టి చినుకులు**
**పువ్వైపోదూ చిరునవ్వైపోదూ**
**చెరుకు గడల మధ్య**
**నిద్రను ఆరేసుకుంటే**
**తడిచిన గుండెను హత్తుకుంది**
**ప్రియురాలిలా!**
**గాలి వీస్తే, వాన లేస్తే ప్రాణాలు**
**ముద్దవుతుంటాయి, ఆకాశానికి రెక్కలు చాచి, బొంగరంలా గిరికీలు కొడుతుంటే**
**సౌందర్యం శరీరమైనట్లు, మనసు**
**పల్లకిలో తేలియాడుతుంది** అంటాడు రచయిత.

కవిత్వ నిర్మాణం బాగా తెలిసినవాడు రచయిత కనుకనే తనలోని భావోద్వేగాలకు ప్రతిబింబిస్తూ తనలోని ఊహాశక్తికి సృజనను జోడించి మంచి భావ చిత్ర నిర్మాణంతో కవితాత్మక నైపుణ్యంతో రచించిన కవితలు ఎన్నో తారసపడ తాయి ఈ సంకలనంలో

**"అలా వెళ్ళి పోతావ్"** కవిత వ్యక్తీకరణలో అర్థమవుతుంది.

**ఋతువుల్ని గోరింటాకు పెట్టుకుని**
**ఇంద్రధనస్సుల్ని మెరిపించావ్**
**చిరునవ్వుల సాక్షిగా**
**హృదయాన్ని ఆకాశానికి**
**తారాజువ్వలా ఎగరించేశావ్**
**బతుకు గమనంలో**
**నడకల దిక్కుల్ని శాసించావ్**
**అంతరంగాన్ని ఆప్యాయత**
**దివిటీలతో వెలిగించావ్** అంటూ సాగుతుంది.

కవి కొన్ని ఆనందక్షణాలతో,మరికొన్ని ఉద్రిక్త క్షణాలతో, కొన్ని కన్నీళ్ళతో, రాలుతున్న జ్ఞాపకాలతో కొవ్వొత్తిలా కరుగుతూ జీవన రేఖలు సరిచేసేందుకై కాలం చేసిన గాయానికి ఏడవకురా కన్నా కాలాలు అన్నీ మనవి కావురా కన్నా అంటూ పట్నం బయలు దేరిన వలస పక్షి అనుభవాలలోకి జారి పోతుంటాడు, యాంత్రికాన్ని నెత్తిన ఎత్తుకొని ఉరుకుల పరుగులతో ఉలిక్కి పడుతుంటాడు, "వర్తమాన దృశ్యం"తో సామాజిక వైరుధ్యాలను అభివ్యక్తీకరిస్తారు రచయిత.

**క్షణం తీరికలేని**
**పరుగుల ఒరవడిలో**
**యాంత్రికం ఒక నియంత్రిత చర్య**
**మెరుపు గమనంలా**
**మనిషి ప్రవహించాలి**
**పరిగెత్తే ప్రపంచంలో**
**ఒకరికి ఒకరు ఇక్కడ ఒంటరి**
**పరితపించే హృదయాలేవ్**
**జనం**
**సాంఘికంకాని వేళ**
**మనసుల్లో నెలవొంకలు పూస్తాయా!?**
**మనుషుల కీకారణ్యాన్ని**
**ఒంటరిగా ఈదటం**
**ఎడారిని ఆరబోసినట్లు ఉంది ఉంటుంది.**

ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పొరేట్ దౌర్జన్యాలను చిత్రీకరిస్తూ ఉదయించే ప్రశ్నల రూపంలో ప్రశ్నల అస్త్రాలను సంధిస్తాడు "ప్రపంచీకరణ ఇంద్రజాలం భూములకు రెక్కలిచ్చి ఆశల్ని ఆకాశానికి వేలాడదీస్తున్నాయి నిట్టూర్పులో పరిశ్రమలు మట్టిని ఎంత వినయ ంగా మింగినా, హరిత స్వప్నం ప్రగతిని నిలదీస్తే మరో తరానికి ఆకలి ప్రశ్నలు ఎదురిస్తుంటాయి" అని వ్యక్తీకరిస్తారు రచయిత.

ఉత్తరాంధ్ర వలస పాటతో మొదలైన వలసలు ఒక్క వీడ్కోలు తో ఖండాంతరాల దాటి కరెన్సీ భాషలో కొలవలేని కాలం చూరులో నుంచి జారే రసామృతాన్ని ప్రశ్నార్థకంగా వదిలి హృదయాన్ని ట్రాలీలో మూసుకుపోతూ రెక్కలు కట్టుకు ఎగిరిపోతాయ్ కొన్ని వలస పక్షులు, చాలా పక్షులు మాత్రం "కాలం అంచులమీద అలసిన వలస పక్షులై" ఆశల కువకువలతో ఇంకాకలల మొగ్గలు తొడుగుతూనే ఉన్నాయి.

"వలస పాట" కవితా సంకలనంలోని కవితలు అన్ని సామాజిక స్పృహతో, తనదైన శైలితో, మంచి శిల్పంతో, భావుకతతో, పదబంధాలతో, ప్రతీకలతో కవిత్వ ప్రయాణాన్ని సాగిస్తూ దిన, వార పత్రికలలో ప్రచురించి పాఠకుని మన్ననలు పొందుతూ, యువ కవిగా, సంగీత దర్శకుడిగా, షార్ట్ ఫిలిం డైరెక్టర్ గా సాహిత్య సేవను చేస్తున్న "గవిడి శ్రీనివాస్"కి హృదయపూర్వక అభినందనలు.

ప్రతులకు:
–గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601



–డా. చింతపల్లి
ఉదయ జానకి లక్ష్మి.
9440731068.

## పిల్లల కోసం పిడపర్తి రామాయణం

పుస్తక సమీక్ష

వాల్మీకి రామయణమును అనేక మంది కవులు వివిధ ప్రక్రియల్లో రాసి ప్రజలకు చేరువజేశారు. ప్రక్రియ ఏదైనా అది పాఠకులకు చేరినపుడే దానికి సార్థకత లభిస్తుంది. ఈ మధ్యకాలంలో కొత్తగా వడిచర్ల సత్యం సృష్టించిన మణిపూసలు అనే ప్రక్రియలో కూడా అనేక పురాణ, ఇతిహాసాలు కవితా రూపంలో వస్తున్నాయి.

టి. ఆశీర్వాదం ఇదివరకే రాయామాయణమును మణిపూసల ప్రక్రియలో రాయగా, ప్రస్తుతం సిద్దిపేట జిల్లాకు చెందిన బాల సాహిత్య కవయిత్రి పిడపర్తి అనితాగిరి పిల్లల కోసం సంక్షిప్తంగా "పిడపర్తి బాలరామాయణం" తీసుకువచ్చారు. ఇది మణిపూసల ప్రక్రియలో వచ్చిన 50 వ పుస్తకం. రామాయణమును పిల్లలకు అర్థమయ్యే రీతిలో సరళమైన పదాలతో 250 మణిపూసల్లో అద్భుతంగా తీర్చిదిద్దారు రచయిత్రి అనితాగిరి.

అందరు కవుల్లాగే అనితాగిరి కూడా సంప్రదాయ పద్ధతిలో ముందుగా వినాయకుడిని స్మరించుకుంటూ తన కావ్యాన్ని మొదలు పెట్టారు.

**"ఓ బొజ్జ గణపయ్యా**
**మొదటి పూజ మీకయ్యా**
**మూషిక వాహన దేవా**
**మమ్ముల దీవించయ్యా"!**

అని ఆదిదేవుడైన గణపతిని దీవించమని కోరారు. రామాయణంలో సుందరకాండను అద్భుతంగా చిత్రీకరించారు. పిల్లల కొరకు రాసినది కాబట్టి శ్రీరాముడి బాల్యం మీద ఎక్కువ శ్రద్ధ చూపారు రచయిత్రి.

**"పిల్లల్లార వినరండి**
**పెద్దలంతా కనరండి**
**ఈ రామాయణమును**
**ఆదికావ్య మందురండి" !**

అని పేర్కొన్నారు.

శ్రీ రామ లక్ష్మణుల జననంతో ప్రారంభమైన కావ్యం ఆసాంతం ఆకట్టుకునే







విధంగా ఉంది.

**"శోకం వల్ల రాజును**
**సర్వమూ కోల్పోయెను**
**ఎంతగానో వినిపిస్తూ**
**ప్రాణాలను విడిచేను!"**

శ్రీ రాముడు అడవికి వెళ్లిన తర్వాత ఆ బాధతో దశరథుడు మరణించాడని హృద్యంగా చెప్పారు రచయిత్రి.

**"అన్నా యంటు భరతుడు**
**కాళ్ల మీద పడినాడు**
**ఎంతగానొ ఏడ్చెను**
**రామూడోదార్చినాడు"!**

భరతుడి యొక్క బ్రాత్రు ప్రేమ ఎంత గొప్పదో ఇక్కడ కనపడుతుంది.

**"సముద్రమే దాటినాడు**
**వాయునందనుండు యతడు**
**ఆకాశమార్గమున**
**లంకానగరి చేరాడు"!**

సీతాన్వేషణకై హనుమంతుడు ఆకాశ మార్గంలో లంకానగరాన్ని చేరిన విధమును ఈ మణిపూసలో కూర్చారు.

**"ఉడుత చాలా చిన్నది**
**రామ భక్తి చూపింది**
**తోకతోటి యిసుక చల్లి**
**తగు సాయం చేసింది"!**

సేతువు నిర్మాణంలో చిరు ప్రాణి అయిన ఉడుత చేసిన నిస్వార్థ సహాయంను అలతి పదాలతో అల్లారు.

**"ఒకే మాటని యన్నాడు**
**ఒకే బాణం యన్నాడు**
**ఒకే సతియని అందరికి**
**ఆదర్శమాయె రాముడు"!**

శ్రీరామావతారం యొక్క మొత్తం సారాన్ని ఒకే మణిపూసలో అందంగా కూర్చారు పిడపర్తి. ఒకే మాట, ఒకే బాణం, ఒకే సతితో శ్రీ రాముడు అందరికీ ఆదర్శం.

రాముని చరిత్ర మనిషి యొక్క జీవన విధానమును తెలుపుతుంది. నైతిక విలువలను బోధిస్తుంది. అందుకే పిల్లలకు చేరువ చేయాలనే తపనతో రచయిత్రి అనితాగిరి ఈ రామాయణమును మణిపూసల్లో రూపకల్పన చేశారు. ఈ కథలోని సీత జననం, సీతారాముల కళ్యాణం, శ్రీరాముడి వనవాసం, దశరథుని మరణం, అనసూయ దేవి అనుగ్రహం, రామ సుగ్రీవుల స్నేహం, హనుమంతుడు లంకను చేరుటకు సేతువు నిర్మాణం, సీతారాముల పట్టాభిషేకం మొదలైన ఘట్టాలను వర్ణించిన తీరు కడు ప్రశంసనీయం. ఈ కవయిత్రి కలం నుండి భవిష్యత్తులో మరెన్నో బాలసాహిత్య రచనలు వచ్చి బాలల వికాసానికి తోడ్పడాలని ఆశిద్దాం.

**ప్రతులకు:**
పిడపర్తి అనితాగిరి,
ఇం. నెం. 17–3.
హైదరాబాద్ రోడ్,
లక్ష్మి విలాస్ బ్యాంకు వెనుక, సిద్దిపేట.
చరవాణి. 7416044050
పుస్తకం వెల. 40.



–కందుకూరి
భాస్కర్
9703487088.

# సరళ శతకం



-యలమర్తి అనూరాధ
చరవాణి:9247260206

అమ్మ నాన్నలు
ఇలన అపురూప శక్తులు
బలమె కాని దైన్యం ఇవ్వని దేవతలు
రాధ మదిన మెదిలె తీయని భావన

గురువును గౌరవించాలి
చీకటిలో చిరుదివ్వెగా
జ్ఞానాన్ని ప్రసాదించే దైవమతడు
రాధ మదిన మెదిలె తీయని భావన

అన్నదమ్ముల యెడ
ఆక్రోశం వలదు వలదు
ఎల్లవేళలా ఆప్యాయత కనపరచు
రాధ మదిన మెదిలె తీయని భావన.

తోడ బుట్టిన వారు
దేవుడు కలిపిన బంధం
ఊపిరున్నంతవరకు వీడకు ఆ సంబంధాన్ని
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఇరుగు పొరుగమ్మలతోను
కలహములు వలదు
సఖ్యతతో నిరంతరం మెలుగు
రాధ మదిన మెదిలె తీయని భావన.

కష్ట సుఖములందు
తోటివారికి అండగా ఉండు
అదే మానవత్వపు దండగా మారు
రాధ మదిన మెదిలె తీయని భావన.

మాటల్లో పరిమళ సుగంధాలను
అనునిత్యం విరజిమ్మాలి
ఎదుటి హృదయాలను రంజింపజేయాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

మంచితనం ఎదన నిలపాలి
నీ నా స్వార్ధాన్ని పక్కన పెట్టాలి
మనం అనే బాటనే నడవాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

ప్రక్క వాని సిరిసంపదలను చూసి
అసూయ చెందకు ఏనాడూ
ఉన్నదానితో సంతృప్తిపడుట ఎంతో మిన్న
రాధ మదిన మెదిలె తీయని భావన.

సమాజం ఓ పువ్వుల తోట
కిల కిల నవ్వులతో నడయాడు
కలిసిమెలిసి ఉండటమే కర్తవ్యం
రాధ మదిన మెదిలె తీయని భావన.

కరుణ దయ రెండు కన్నులుగా
సహాయం త్రి నేత్రంగా
మసలిన చాలును ఈ లోకమున
రాధ మదిన మెదిలె తీయని భావన.

మన శ్వాసకు ఆధారం పచ్చదనం
పెరుగుదలకు తప్ప తరుగుదలకు తావివ్వకు
మొక్కను పోషించాల్సిన బాధ్యత మనందరిది
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఆతిథ్యం అన్నింటికన్న శ్రేష్ఠం
ఉన్నా లేకున్నా తెలియనివ్వకు
అనురాగం కురిపిస్తూ సాగనంపు
గుమ్మం వరకూ
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఇష్టం ఎంత చూపిస్తే
అంతకు రెట్టింపు దక్కు
ఒక్కసారి పొందావంటే వదలడముండదు
రాధ మదిన మెదిలె తీయని భావన.

ప్రేమ జగాన బహు గొప్పది
ఇచ్చిపుచ్చుకోవటంలో కొలత వలదు
నింగి నేలలా హద్దులు సరిహద్దులు లేనిది
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఎదుటి మనిషిలోని మంచిని చూడు
చెడుని పట్టించుకున్నావా
ఎవరితోనూ స్నేహం చేయలేవు
రాధ మదిన మెదిలె తీయని భావన.

అద్దమంటి మనసు నీకుండాలి
స్వచ్ఛత రూపమే కనిపించాలి
మంచితనమే ప్రతిరూపమవ్వాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

అనురాగం రాగమవ్వాలి
పల్లవి చరణాలులా బ్రతుకు సాగాలి
పాటలా జీవితం ప్రవహించాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఆరోగ్యానికి ప్రథమ స్థానమివ్వాలి
శుభ్రతకు ప్రాముఖ్యతనివ్వాలి
ఆహార నియమాలుకు విలువ ఇవ్వాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

బంధాలు అనుబంధాలు
రక్త సంబంధాలకు అతీతం
చేతికందిన దాన్ని కడవరకు వదలకు
రాధ మదిన మెదిలె తీయని భావన.

దేశమంటే మనమేనోయ్
సైనికులంటే మన సోదరులోయ్
దేశభక్తి అణువణువునా నింపుకోవాలోయ్
రాధ మదిన మెదిలె తీయని భావన.

పూల దండలో కనిపించని దారంలా
నలుగురినీ ముడి పెట్టుకోవాలి
తలలో నాల్కలా పేరు తెచ్చుకోవాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

వెన్నెల చల్లదనం నీ తోడవ్వాలి
ఎల్లవేళలా మీ ఇంట శాంతిదీపం
వెలుగులు పంచాలి
ప్రశాంతత నీ వరం అవ్వాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఉదయించే కిరణంలా
చైతన్యస్రవంతిగా కదలాలి
ఉత్తేజపు బాటన మార్గదర్శిగ నిలవాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

కలిమిలేములు
వచ్చి పోతుంటాయి
మన చెంత నిత్యం నిలిచేది చెలిమియె
రాధ మదిన మెదిలె తీయని భావన.

దువ్వెనకు చిక్కుకున్న శిరోజాల్లాంటివి కష్టాలు
ఉపాయమనే పరిష్కారం వెతుక్కోవాలి
ఓపికే సమస్యకు మార్గం చూపుతుంది
రాధ మదిన మెదిలె తీయని భావన.

చేతికి గాజులు అందం
మనసుకు మమత చందం
సంస్కారమే వనితకు అలంకారం
రాధ మదిన మెదిలె తీయని భావన.

అనంతమైనది విశ్వం
మదిని అంతకన్నా విశాలం చేసుకో
ప్రతి ఒక్కరికి స్థానమివ్వగలవప్పుడు
రాధ మదిన మెదిలె తీయని భావన.

గడియారంతో సమంగా పరుగెత్తాలి
ఎనిమిది గంటలు నిదురోవాలి
శ్రమను బట్టే ఫలితమని గుర్తెరగాలి
రాధ మదిన మెదిలె తీయని భావన

పొద్దు తిరుగుడు పువ్వల్లె
మంచి వైపే తిరగాలి
ఎవరికీ నిన్ను వేలెత్తి చూపే
ధైర్యముండదప్పుడు
రాధ మదిన మెదిలె తీయని భావన

ఉప్పు కప్పురంబు ఒకటెప్పటికీ కావు
దేని గొప్పతనం దానిదే
పరిశీలించే గుణం మనకుండాలి
రాధ మదిన మెదిలె తీయని భావన

మనసు తెరిచిన పుస్తకం
మరకలకందు తావు లేదు
స్వచ్ఛత సుమాలే విరబూయాలి
రాధ మదిన మెదిలె తీయని భావన

పుస్తక విజ్ఞానాన్ని పెంచేది జ్ఞానం
పఠనమే మూలాధారం
హస్తభూషణంగా పుస్తకం ఉండాలంతే
రాధ మదిన మెదిలె తీయని భావన

దుప్పటి ముసుగు దంపతులకు
మనిషికి తెర నటన
అది ఉండాల్సింది ఇది ఉండకూడనిది
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఒకటి రెండు మూడు
పందానికి దొరికే పతకాలు
గెలుపు కోసం ఆరాటం పోరాటం తప్పదు
రాధ మదిన మెదిలె తీయని భావన.

శాంతం ఎల్లప్పుడు మనసుకు
ఆహ్లాదం ఎల్లవేళలా కనులకు అందిస్తే
ప్రశాంతత అన్నివేళలా మన చెంతే
రాధ మదిన మెదిలె తీయని భావన

మామిడి రుచికి మధురం
అధికం ఎప్పుడూ చెరుపే
మితం అన్నింటా శుభం
రాధ మదిన మెదిలె తీయని భావన.

మాటలు కోటలు దాట కూడదు
వాస్తవానికి దగ్గరగా చేతలు
ఎదుటి వాని నమ్మిక కదే తార్కాణం
రాధ మదిన మెదిలె తీయని భావన.

అమ్మను ఎప్పుడూ మరువం
మాతృభాషా అంతే
ఆ ఇరువురికీ సాటి మరొకరు లేరు ఇలలో
రాధ మదిన మెదిలె తీయని భావన.

కోపం నిప్పులాంటిది
దహించటమే దానికి తెలుసు
ఎంత దూరంగా ఉంటే అంత మంచిది
రాధ మదిన మెదిలె తీయని భావన.

వద్దన్నా చెంతకు వచ్చింది కరోనా
సంస్కారాన్ని మరోసారి గుర్తు చేసింది
కుటుంబాన్ని దగ్గర చేసింది
రాధ మదిన మెదిలె తీయని భావన

ముల్లోకాలకు ప్రతిబింబంగా పంఖా
ఆగితే కృత్రిమత్వం ఎదురుగా
కాంక్రీట్ భవనాలలో స్వచ్ఛమైన గాలి లేదుగా
రాధ మదిన మెదిలె తీయని భావన.

కలం కదిలితే ఊహకు ఊపిరి
అక్షరాలకు శ్వాస తగులుతుంది
ముద్రణకు నోచుకుంటే నైపుణ్య ప్రదర్శనే
రాధ మదిన మెదిలె తీయని భావన.

జ్ఞాపకాలు ఓ అక్షయ పాత్ర
ఎంత తీసినా వస్తూనే
మధురమైనవే అందులో నింపుకో
రాధ మదిన మెదిలె తీయని భావన

పుట్టినప్పుడు ఏమీ తీసుకురాము
వెళ్లేప్పుడు ఏదీ పట్టుకెళ్ళం
నడుమ నలుగురు చెప్పుకునేదే నీ వ్యక్తిత్వం
రాధ మదిన మెదిలె తీయని భావన

చరవాణికున్న విలువ దేనికీ లేదు
సమస్త ప్రపంచం అందులోనే
బాంధవ్యాలే దూరమవుతున్నాయి ఆ నీడలో
రాధ మదిన మెదిలె తీయని భావన

కరుణ లేని హృదయం
చెరుకు పిప్పితో సమానం
దయారసం ఉంటేనే మానవ జన్మకు సార్థకం
రాధ మదిన మెదిలె తీయని భావన.

విద్య భవితవ్యానికి దీపం
తోటి వారికి పంచకలగటమే ధర్మం
అధర్మంగా ఎవరూ దొంగిలించలేని ధనమిదే
రాధ మదిన మెదిలె తీయని భావన.

కనురెప్పల కెమెరాతో చిత్రం తీస్తే
మనసు గదిలో భద్రం
ఎప్పుడు కావాలన్నా అప్పుడు ప్రత్యక్షం
రాధ మదిన మెదిలె తీయని భావన.

చిదంబర రహస్యం
భగవంతుడు మనలోనే ఉన్నాడు అన్న నిజం
ఎక్కడెక్కడికోపరుగెడుతూఉంటావువెతుకులాటలో
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఈ క్షణాన మనమున్నాం
మరు నిముషాన చెప్పలేం
కాలాన్ని సద్వినియోగ పరుచుకో ఎల్లప్పుడూ
రాధ మదిన మెదిలె తీయని భావన.

శరీరానికి గాయమైతే మాన్పగలవు
మనసుకు అయితే పోగొట్టలేవు
హింసను మాటల్లో చొప్పించకందుకే
రాధ మదిన మెదిలె తీయని భావన.

పంచభూతాలు మనకన్నీ ఇస్తాయి
ఏమీ ఆశించకుండానే
నువ్వు వాటిలా మారిపో నేస్తమా!
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య
ఒకే క్షణంలో పదివేల మంది
సరసన గోపాలుడు
దైవశక్తితో పోలికలు వద్దు మానవా!
రాధ మదిన మెదిలె తీయని భావన.

శరీరానికి రోజూ స్నానమే
మరి మనసుకు ఉండదేం?
క్రమం తప్పక రోజూ కడిగెయ్
రాధ మదిన మెదిలె తీయని భావన

ఏకపత్నీ వ్రతానికి ప్రతీక రాముడు
పాటించావా పరమ పవిత్రుడివి
విడనాడావా రోగాలకు ప్రతినిధివి
రాధ మదిన మెదిలె తీయని భావన.

నీది కాని దాన్ని ఆశించకు
నీకు రావలసినది వద్దన్నా నీ చెంతనే
కర్మసిద్ధాంతాన్ని నమ్మక తప్పదు గురువా!
రాధ మదిన మెదిలె తీయని భావన

ఓటమి ఎదురైందని నిరాశ పడకు
గెలుపు ద్వారానికదో మెట్టు
విజయ సంప్రాప్తి కదే ఆశల ఊపిరి
రాధ మదిన మెదిలె తీయని భావన

మరుజన్మ ఉంటుందో ఉండదో
మీమాంసలో అతలాకుతలమవ్వకు
ఈ జన్మను సార్థకం చేసుకో
రాధ మదిన మెదిలె తీయని భావన.

పిల్లల మెదళ్ళు ప్రశ్నా పత్రాలు
తల్లి తండ్రుల ప్రవర్తనే సమాధానాలు
వ్యక్తిత్వ రూపకల్పనకు వారధి వారే
రాధ మదిన మెదిలె తీయని భావన

దురదృష్టం అనుక్షణం తలుపు కొడుతుందనుకోకు
రేపే అదృష్టం నీ దరికీ వస్తుందేమో?
నిరాశతో నిన్ను నీవు మోసం చేసుకోకు
రాధ మదిన మెదిలె తీయని భావన.

పచ్చగడ్డి పరుపుపై నిదురించు
నీలాకాశం అందాలను గమనించు
ప్రకృతిలో మమైక్యమైతే మానసిక ఆనందమే
రాధ మదిన మెదిలె తీయని భావన.

స్నేహమనే విత్తును నాటు
వృక్షమై ఫలాలనందించు
నిస్వార్ధత నీళ్లు పోయటం మరువకు
రాధ మదిన మెదిలె తీయని భావన

బిడ్డ చెడ్డవాడైతే
పెంపకం లోపమని విచారించకు
కర్మ ఫలితమని సరిపెట్టుకో
రాధ మదిన మెదిలె తీయని భావన.

వ్యసనం ఓ అలవాటు
గ్రహపాటుగ సర్ది చెప్పుకోకు
కూకటి వ్రేళ్లతో పెకిలించు
రాధ మదిన మెదిలె తీయని భావన.

మనసు మొక్కను వాడనీకు
శ్రద్ధ అనే నీళ్లను చిలకరించు
నీ మీద నీకు ఆలనా పాలనా ఉండాల్సిందే
రాధ మదిన మెదిలె తీయని భావన.

పొట్ట చెత్త బుట్ట కాదు
ఏది పడితే అది విసరడానికి
వైద్యుడివి నీవే అని తెలుసుకో
రాధ మదిన మెదిలె తీయని భావన

నీడగా

యువత దేశానికి బలం
పెడత్రోవను పడకుండా చూడాలి
స్త్రీలను గౌరవించే విధంగా పెంచాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

కిటికీ లోకానికి ద్వారం
ఓ పూరెమ్మ తోడైతే
సంతోషం మన దరి చేరినట్లే
రాధ మదిన మెదిలె తీయని భావన.

వృద్ధులు బలహీనులు అనుభవజ్ఞులు
అడిగి మరీ తెలుసుకుందాం
అనాథలుగా వదిలేసే కొడుకులను దండిద్దాం
రాధ మదిన మెదిలె తీయని భావన.

భారతీయుల సంస్కృతి సంప్రదాయం గొప్పవి
నిలబెట్టుకోవటమే మన లక్ష్యం
విదేశీ పద్ధతుల వైపు మొగ్గకుంటే చాలు
రాధ మదిన మెదిలె తీయని భావన.

నవ్వు ముఖారవిందానికే అందం
సడలనివ్వకు ఏ క్షణమూ
ఆరోగ్యానికదే గొప్ప మందు
రాధ మదిన మెదిలె తీయని భావన.

ధ్యానం చైతన్యానికి దారి
మనోశక్తిని పెంచే ఆయుధం
నీ వయసంత సమయం తప్పక కేటాయించు
రాధ మదిన మెదిలె తీయని భావన.

ప్రేమ అడగకనే ఇచ్చే వరం
అడిగి లోకువ కావద్దు
మనస్సు గెలుచుకొని దక్కించుకొనే మంత్రమది
రాధ మదిన మెదిలె తీయని భావన.

తక్కువ స్థాయియని నీచంగా చూడకు
రేపు తలపైకెత్తి చూడవలసి వస్తుంది
ఎవరు ఎప్పుడు ఎక్కడో అంతాభగవత్ లిఖితం
రాధ మదిన మెదిలె తీయని భావన.

న్యాయం కోసం పోరాటం
అన్యాయం మీద తిరుగుబాటు
మనిషన్నవాడి సహజ లక్షణమవ్వాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఉన్ననాడు కాస్త దాచుకోవాలి
లేని నాడు వాడుకోవాలి
పొదుపు అన్ని వేళలా ఉపయోగమే
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఆడామగా భేదములు ఉండరాదు
కన్న బిడ్డలందరూ సమానమే
ఆస్తి పంపకాలందు తేడా చూపకయా
రాధ మదిన మెదిలె తీయని భావన.

బద్ధకం ఓ జబ్బు
సోమరితనమె దాని లక్షణం
కష్టపడే తత్వమొకటే సరైన ఔషధం
రాధ మదిన మెదిలె తీయని భావన.

శివుడు సతికి అర్ధభాగమిచ్చె
గోవిందుడు హృదిన స్థానమిచ్చె
భార్యకు విలువివ్వని భర్తగ నువ్వెందుకలా?
రాధ మదిన మెదిలె తీయని భావన.

పెళ్ళి కాక ముందు
అంతా నాదే బాధ్యత అన్న అన్న
కళ్యాణం తదుపరి మాట మార్చుట తప్పుకాదే
రాధ మదిన మెదిలె తీయని భావన.

రక్షణకు మారు పేరు పోలీసు
భక్షణకు నిదర్శనమైతే
కంచే చేను మేసినట్లు కాదే?
రాధ మదిన మెదిలె తీయని భావన.

ధరలు పెరిగినంత వేగముగా
జీతము పెరుగదయా
వాస్తవమునకు విలువనిచ్చి సాగవలె
రాధ మదిన మెదిలె తీయని భావన.

అన్నం పెట్టు రైతన్నకు
ఆపదవేళ సాయమిడవలె
ధర్మమదియె మిత్రమా
రాధ మదిన మెదిలె తీయని భావన.

స్త్రీల మీద చిన్నచూపు తగదయా
బుద్ధులందు మిన్నవారు
తెలివితేటలు దయ యందు వారికి వారే సాటి
రాధ మదిన మెదిలె తీయని భావన.

అందానికి విలువ నిచ్చుట
అన్ని వేళలా మంచిది కాదు
మనఃసౌందర్యమే మిన్నని తెలుసుకొనరె
రాధ మదిన మెదిలె తీయని భావన.

నిండుగా వస్త్రములు ధరించుట
మహిళలకు గౌరవము నిచ్చు
కొరత చూపిన కష్టములకు ఆలవాలమగునె
రాధ మదిన మెదిలె తీయని భావన

చదువు చదువు యనుచు
పిల్లలను ఆటలకు దూరము చేయరాదు
క్రీడల వలనే శారీరక వ్యాయామము వృద్ధిపొందు
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఒకరికొకరు పోలిక ఉండరు
భావములలో రూపములలో
బ్రహ్మ బహు గొప్ప చిత్రకారుడె
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఒక్కరోజు ప్రాణమైన
పూవు గుడికో జడకో చేరాలని తపన పడును
మనిషికెందుకు లేదో ఆ తాపత్రయం?
రాధ మదిన మెదిలె తీయని భావన

చిన్న ఆపదొచ్చిన
కాకులన్ని గుమి కూడు
నేర్చుకో సహాయతను పక్షి నుంచి
రాధ మదిన మెదిలె తీయని భావన.

కోరికలకంతు లేదు
ఒకటి తర్వాత ఒకటి పుట్టును
ఆశలకు కళ్లెం వేయుట తప్పదు
రాధ మదిన మెదిలె తీయని భావన

చిన్న మాత్ర పెద్దరోగాన్ని పోగొట్టు
అలాగే సూక్ష్మఆలోచన
పెద్ద సమస్యకు పరిష్కారమౌను
రాధ మదిన మెదిలె తీయని భావన.

పిరికివాని వలె పారిపోవుట
బ్రతకలేక మృత్యువు నాహ్వానించుట
ఆత్మహత్య చేసుకొనుట అపరాధమేనయా
రాధ మదిన మెదిలె తీయని భావన

గుప్పెడంత గుండె
ఆగినచో ప్రాణమే పోవు
శాంతమె సదా హాయినిచ్చు
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఎన్ని ఆపద లొచ్చినా
మరెన్నో కడగండ్లు ఎదురైనా
ధైర్యమొక్కటి వీడకున్న చాలు
రాధ మదిన మెదిలె తీయని భావన.

అందరితో సఖ్యత
ఎవరితో శత్రుత్వం చూపక
అజాత శత్రువు వలె మెలగాలి
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఉపకారము చేసిన మరువకు
అపకారం చేయ శిక్షించకు
క్షమకు ఎల్లప్పుడూ ప్రతినిధిగా నిలబడు
రాధ మదిన మెదిలె తీయని భావన

ప్రతి తాళంకి
తాళంచెవి ఉండు
అటులనే ఏ కష్టానికైనా మార్గముండు
రాధ మదిన మెదిలె తీయని భావన.

కులము మతమను కుమ్ములాటలేల
రక్తం అందరిదీ ఒకటే
భేదభావములు తొలగించుకోవయా
రాధ మదిన మెదిలె తీయని భావన.

అప్పు ఎప్పుడూ మేలు కాదు
ఉన్నంతలో సరిపెట్టుకొనుటె
తృప్తికి మంత్రమయా
రాధ మదిన మెదిలె తీయని భావన.

ఈటె లాంటి మాటలతో
ఎదుటి వారిని బాధించకు
గాయమును మాన్పుట బహుకష్టమయా
రాధ మదిన మెదిలె తీయని భావన.

విరిగిన గాజును అతకలేము
హృదయపు బీటలను మాన్పలేము
బాధించకుండా ఉండటమే సరైన తీర్పు
రాధ మదిన మెదిలె తీయని భావన

తనకు తాను సుఖపడినా
కన్నవారిని పట్టించుకోక పోవటం
తనయునికి నీతి కాదె
రాధ మదిన మెదిలె తీయని భావన.

వర్షము ఎప్పుడూ హర్షమే
తుఫానుగా మారితేనే నష్టం
ఉపద్రవము ఎల్లప్పుడూ చెరుపే
రాధ మదిన మెదిలె తీయని భావన.

స్త్రీకి స్త్రీయే శత్రువు
నానుడిని చెరిపేసెయ్
తరుణికి తరుణే అండదండని నిరూపించు
రాధ మదిన మెదిలె తీయని భావన.

నీటిని అధికముగా ఖర్చు చేయువాడు
డబ్బును వృధాగా వాడుతాడు
అవసరానికి మించి వాడుక ఎప్పుడూ అనర్ధమే
రాధ మదిన మెదిలె తీయని భావన.

కూరకైనా పప్పుకైనా పచ్చడికైనా
తాళింపు ఇచ్చును సొగసు
జీవితమునకు ఆనందమూ అంతే
రాధ మదిన మెదిలె తీయని భావన

పుస్తకసమీక్ష

# శ్రీ పెంబూదూరు సత్యనారాయణ వేదాంత పరిభాష






కరీంనగర్ జిల్లా కోహెడ మండలం పెద్దసముద్రాల గ్రామ వాస్తవ్యులు, హిందీ ఉపాధ్యాయులుగా పదవీ విరమణ చేసిన అనంతరం హుస్నాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకొని తమ శేషజీవితాన్ని ఆనందంగా గడుపుతున్న, గీతామందిర అనన్యభక్తులు, సేవకులు, సంస్కారవం తులు, ఆధ్యాత్మిక జిజ్ఞాస పరులు, అయిన శ్రీ పెరంబుదూరు సత్యనారాయణగారి ఆధ్యాత్మిక కృతి ఈ వేదాంత పరిభాష, హుస్నాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకొన్న నాటి నుండి శ్రీపార్థసారథి గీతామందిరం తో భక్తిపరమైన అనుబంధం పెరిగి తాత్త్విక తత్త్వం అలవరచుకున్న శ్రీ సత్యనారాయణగారు తన ఆధ్యాత్మిక భావాలకు పదును పెట్టి అక్షరరూపం కల్పించి వెలువరించిన చక్కని పుస్తకం వేదాంత పరిభాష. ఈ కృతిని వీరు వీరి మాతృమూర్తి అయిన కీ॥శే॥శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారికి అంకితమీయడం వీరికి గల మాతృప్రేమను వ్యక్తపరు స్తున్నది. ప్రారంభంలో గురుపరంపర స్తోత్రంతో పుస్తకం మొదలవుతుంది. పవిత్రాత్మ స్వరూపులగు పుజ్యవిష్ణు సేవానందగిరి స్వాములవారి దివ్య ఆశీస్సులు ఈ కృతికి లభించాయి. వీరు చాత్తాద శ్రీ వైష్ణవ వార్తలో ప్రచురితమైన వ్యాసాలన్నింటిని ఒకచోట చేర్చి, ఈ వ్యాస సంపుటిగా మనముందుంచారు. ఇందులో తొలుత సంఖ్యానుక్రమణికను చేర్చి ఈ పుస్తకానికి నిండుదనం తెచ్చారు. అష్టాదశ సంఖ్య వరకు సుమారు 64 పేజీలవరకు వేదాంతాలు, ధర్మనిరతితో కూడిన అధ్యయ నాంశాలు పరిచయం చేస్తూ మనకు అందు బాటులోకి తెచ్చారు. అదేవిధంగా అష్టాదశ ధార్మిక వ్యాసాలను ఈ సంపుటిలోని చేర్చినారు. సృష్టిరహస్యము- జీవన రహస్యము మొదలు మనువు మహర్షి వరకు గల ఈ పదునెనిమిది వ్యాసాలలో పుస్తకం నిండా ఖాళీ దొరికిన చోటల్లా అమృత తరంగిణీ, పతంజలి యోగ, ఆత్మానంద మకరందము, ఆత్మ బోధ, వేదాంత డిండిభమ్, హయగ్రీవోపనిషత్తు, రఘువంశము వంటి గ్రంథాల లోని అమృతతుల్యం వంటి హితోక్తులను, గీతలోని శ్లోకాలను అక్కడక్కడా ఉటంకించి పుస్తకానికి నిండుదనం చేకూర్చారు.

వీరి వ్యాససంపుటి విషయానికి వస్తే సృష్టి రహస్యము అనే వ్యాసంలో ఆత్మజ్ఞానము యొక్క ఆవశ్యకాన్ని వివరిస్తూ వైరాగ్యం లేనట్టిదే ఆత్మజ్ఞాన మంటూ మోక్షమునకు నిష్కామకర్మోపా సనలు ఆత్మజ్ఞానమునకు పరంపరాధారా లనబడుతాయంటూ పేర్కొం టారు. ఇంద్రియాలన్నీ బాహ్యాగ్రామ ములు గా పేర్కొంటూ వాటిని అంతర్ముఖంగా మార్చుకొని యదార్థజ్ఞానాన్నిచ్చేంత యోగ్య తను మనం సంపాదించాలంటూ, వృష్టి, సృష్టి మరియు పరమేష్టి అను వ్యాసంలో వివరిస్తారు. ఉత్కృష్టమైన మానవ సమాజాన్ని ఉత్తమరీతిలో బతికించుకోవలసిన అవసరం ఉందన్న అంశాన్ని ఈ వ్యాసం ద్వారా వ్యక్తపరుస్తారు. త్రిగుణాలైన సత్వ, రజ, తమో గుణాలను పరమాణువులో అంతర్గతంగా ఉండే ఎలక్ట్రాన్ ప్రోటాన్, న్యూట్రాన్‌లతో పోలుస్తూ పదార్థం అంటా ఒక్కటే కలయిక మారే సరికవేరు రూపాలలో కనిపిస్తుందంటూ ఏకత్వంలోని భిన్నత్వం గోచరింపజేస్తారు. విశ్వము- మానవునికి అవినాభావ సం బంధం అనే వ్యాసం ద్వారా, మానవునిలో కూడ విశ్వంలో ఉన్నట్టుగా పదార్థం మరియు చైతన్యం నిండివుంటాయన్న సత్యాన్ని ఈ వ్యాసం ద్వారా విశ్వమంతటినీ ఒక మఱ్ఱి వృక్షమనుకుంటే మానవుడు ఒక మఱ్ఱి విత్తనమంటూ పోలుస్తారు. ఈ విధంగా మానవునిలో విశ్వ పదార్థం మరియు విశ్వశక్తి ఉన్నాయన్న సత్యాన్ని తెలియపరుస్తారు. వర్తమాన కాలంలో మనుష్యుడు తన కర్మకు కర్త అవుతాడంటూ పూర్వ కృతకర్మ ఫలమునకు భోక్త అవుతాడంటూ ప్రారబ్ధము అనే వీరి వ్యాసంలో పేర్కొంటారు. ఇచ్ఛా, పరేచ్ఛా అనే అంశాలను వివరిస్తూ పరిపూర్ణ శరణాగతి అన్వేషించి ప్రారబ్ధము ను గెంటివేయవ లెనంటూ సూచిస్తారు.

మర్యాద అంటే మానవత అనే కోణం లో అందించబడిన వ్యాసం **'మర్యాద'.** కేవలం విద్య ఉన్నంత మాత్రాన అది సంస్కృతి అనిపించుకోజాలదని, ఉన్నత విద్యకంటే ఉన్నత సంస్కారము నయము అనే భావనను వ్యక్తపరుస్తూ సద్గుణములు కలిగిన వారే మర్యాదస్తులని, అట్లాంటి ఆదర్శ పౌరులగుటకు నిరంతరం కృషి సల్పాలన్న ఆకాంక్షను వ్యక్తపరుస్తారు. **'ఇదేనా జీవితం'** అనే వ్యాసంలో నేటి ఉరుకులు పరుగుల జీవన వ్యవస్థ దుస్థితిని చక్కగా వివరిస్తూ ప్రశాంతత అన్నమాటే మానవునికి కరువైందంటూ మానవుడు తనకా శక్తిని తాను తెలుసుకోలేక తనను తాను హీనపరచుకుంటున్నాడంటూ వాపోతారు. తక్షణ సుఖం కోసం మానవుడు వెంపర్లాడకుండా శాశ్వత సుఖాన్ని అందించే శ్రేయోమార్గమువైపు పయనించాలని అందుకు తరుణోపాయంగా ధ్యానంను ఆశ్రయించి సుఖశాంతులతో విరాజిల్లాలని కోరుకుంటారు. **'పురుషప్రయత్నము'** అనే వ్యాసంలో రజోగుణము నుండి సత్వ గుణమునకు క్రమ వికాసం నొందడం ద్వారా సంస్కారం సంప్రాప్తించి సర్వోత్కృష్ట వ్యక్తులుగా బ్రానించవచ్చని తెలియజేస్తారు. మితిమీరిన సంపదలు సంపాదించి మోహ, వ్యామోహ వ్యసనాలు పెంచుకొనేకంటే మంచి ఆలోచనలతో మంచి పనులు చేసి ధర్మమార్గంలో సంపా దించి మోహ, అంటూ **'ఆనందసూత్రం'** అనే వ్యాసంలో తెలియజేస్తారు. లోకంలో ఉన్నతంగా శక్తివంతంగా సర్వహితంగా జీవించడానికి ఈ శరీరమే సాధనమని గుర్తెరిగి వర్తిస్తే శ్రేయోదాయకమంటారు.

హైందవమతములో అనాదిగా వస్తున్న సత్సంప్రదాయం **"అతిథి దేవోభవ"**. ఇదే అంశాన్ని ఈ వ్యాసంలో వివరిస్తూ అతిథికన్న దైవమన్యదా లేదన్న సూర్తిని గుర్తుకు తెస్తూ అభ్యాగతో స్వయం విష్ణు అనే రీతిలో ప్రవర్తించాల్సిన విధానాన్ని తెలియజేస్తారు. అన్నాద్భుతి భూతాని అన్న గీతోక్తిని ఉటంకిస్తూ కృత, త్రేతా, ద్వాపర యుగాలనాటి పరిస్థితులను చెబుతూ అన్ని ప్రాణుల ప్రాణం అన్నమయంతో కూడు కున్నదని స్పష్టం చేస్తారు. **"గీత- గుహ్య శాస్త్రము"**లో మొదట శాస్త్రమునకు అర్థము వివరించి అత్యంత గోప్యమైన గీతాశాస్త్ర మును కృష్ణుడు అర్జునునకు ఉపదేశించిన తీరును వ్యక్తపరుస్తూ దీని తత్వమును తెలుసుకొనినన మానవుడు జ్ఞానియై కృతార్థుడు కాగలడని పేర్కొంటారు.

పరమాత్ముడి ఉపాసనలను ప్రతిపాదిం చెడి గుహ్యతర శాస్త్రము పట్ల చక్కని అవగాహన కలిగించే రీతిలో ఈ వ్యాసాన్ని మనకు అందించారు. మననము చేయ దానికి ఉపయోగపడేదే మంత్రం అని పేర్కొంటూ భగవద్గీతలోని శ్లోకాలన్నీ మహామంత్రాలుగా పేర్కొంటూ అట్టి మహా మంత్రాల్ని నిష్ఠతో అనుష్టించడం ద్వారా జీవితం సార్థకమవుతుందంటూ **"మంత్రం- మంత్రానుస్థానము"** అనే వ్యాసంలో పేర్కొంటారు.

వీరు రచించిన మరొక అద్భుతమైన వ్యాసం **"గేయం గీతానామసహస్రమ్".** అద్వైత ప్రతిస్థాపనాచార్యులు లోక కళ్యాణకాంక్షతో ఎలుగెత్తి చాటిన గేయం నామసహస్రం ప్రాధాన్యతను వివరిస్తున్నది. శ్రీమత్‌భగవద్గీత విష్ణుసహస్రనామ పారా యణాలు రెండున్నూ మహాభారతం ద్వారా ముముక్షుజనావళికి అందివచ్చిన దివ్యజ్యో తులుగా భావించాలన్న ఆకాంక్షను వ్యక్తపరు స్తారు. గీతాశాస్త్రమునకు, విష్ణు సహస్రనామ స్తోత్రమునకు గల అవినాభావ సంబంధాన్ని గోచరింప జేస్తుందీ వ్యాసం. గీతలోని సారాంశ మంతా భీష్మాచార్యులు సహస్రనామ స్తోత్రం ద్వారా మరల గానం చేసినట్లుగా పేర్కొంటారు. గీతాసారం, నామసహస్రం రెండూ భిన్నరూపాలైనా ఒకే లక్ష్యాన్ని ఒకే తత్వాన్ని బోధిస్తున్నాయన్న తీరుతో ఆది శంకరాచార్యులు 'గేయం గీతానామ సహస్రం అన్నాడంటారు.

ఆత్మజ్ఞానం యొక్క గొప్పదనాన్ని తెలియజేసే మరో వ్యాసం "ఆప్తవాణి" ఎదుటి వ్యక్తి యొక్క శ్రేయస్సును కోరి అందించే జ్ఞానంగా వివరిస్తూ తత్త్వజ్ఞానం కేవలం ఋషులకేకాదు మనుష్యులకూ అవసరమని, సమాజానికి ఉపయోగపడేలా మనిషిని తీర్చిదిద్దడానికి ఆత్మసంయమనం, ఆత్మజ్ఞానం అనే సాధనం వలన మాత్రమే సాధ్యపడుతుందంటారు. గాఢనిద్ర- సమాధిస్థితిని తెలియజేస్తూ వీరు అందించిన వ్యాసం **"ధ్యానం-ప్రక్రియలు"** ప్రార్థన, ధ్యాన చింతనముల వల్ల జటిల సమస్యలకు పరిష్కారం గాఢనిద్ర- సమాధి స్థితిలో లభిస్తుందన్న శ్రీ శంకరాచార్యుల ఉల్లేఖనాన్ని పేర్కొంటూ గాఢనిద్ర కోసం అనేక సూచనలు చేస్తారు. ధ్యానం యొక్క అనుభూతి, నిద్రయొక్క అనుభూతి కంటే ఉత్తమమైనదంటూ మనుష్యునికి ధ్యానజన్యమైన అనుభూతి ఇహపరములకు చాల ఉపయుక్తమై ఉంటుందంటారు.

శ్రీ వైష్ణవ మతమునకు విష్ణుభక్తి ప్రచారం చేసెందుకు ఉద్భవించిన మహానుభావుడిగా అవతరించిన విశ్వక్సేనుని చరిత్రను 'నమ్మాళ్వారు' వ్యాసం ద్వారా రచయిత చాలా విషయాలు తెలియపరిచారు. విష్ణువు కౌస్తుభము, విశ్వక్సేనుని అంశంగా జన్మించిన సమ్మాళ్వారు జన్మ విశేషాలు, వారి రచనలను మనకు పరిచయం చేస్తారీ వ్యాసంలో. కామ, క్రోధ, లోభములనెడివి నరకద్వారాలని భగవద్గీతతో చెప్పిన అంశాన్ని వర్గీకరిస్తూ ఉదాహరణలతో "త్యాగేనైకే అమృతత్వ మానశుః" అనే వ్యాసంలో ఈ మూడింటిని త్యజించినవారు పొందే ముక్తిని గురించి వివరించారు. జీవుడు ప్రాపంచిక విషయ వాంఛలను తొలగించుకొని ఆత్మసాక్షాత్కార మునకై అనవరతము ప్రయత్నము సలువవలయును, జీవితము పూర్తికాక మునుపే ఆత్మానుభూతి పొంది తరించవలయుననే ఆకాంక్షను వ్యక్తంచేస్తూ వీరు రచించిన వ్యాసం **"కోరికలకు పరిమితి లేదు".** వీరు రచించిన మరొక చక్కని వ్యాసం **'మహర్షి-మనువు".** మనుస్మృతి యొక్క ఔన్నత్యాన్ని, మనుస్మృతిలోని ముఖ్యాంశాలను, మనుస్మృతిలోని శూద్రుల స్థితిని, స్త్రీల స్థితిని, మనుస్మృతిలోని ప్రక్షిప్త ములను ఈ వ్యాసం ద్వారా రచయిత మనకు అనేక విషయాలను వ్యక్తపరుస్తారు.

అమృత తరంగిణిలో పేర్కొన్నట్లు ధర్మోపార్జితమైన జీవితాన్ని గడుపుతూ, శాస్త్రములందును, జ్ఞానము నందును రమిస్తూ అతిథి సత్కారముగావిస్తూన్న ' సత్యనారాయణగారు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఆ భగవంతుని ధ్యానంలో తన శేషజీవితాన్ని చిరకాలం కొనసాగించాలని ఆశిస్తూ...

**ప్రతులకు:**
శ్రీ పెరంబూరు సత్యనారాయణ
ఇ.నెం.11-39/7/1
అక్కన్నపేట రోడ్డు
హుస్నాబాద్-505 467
జి॥ కరీంనగర్
సెల్: 9491139245



-శ్రీదాస్యం లక్ష్మయ్య
9440155240

అమాయకపు గుట్టన్న కథలు
(పిల్లల హాస్య కథలు)

# అనుకరణ

గుట్టన్న ఇంటి ప్రక్కన ఉన్న ఆవు "అంబా" అని అరిచింది .వెంటనే గుట్టన్న కూడా తాను దానిని అనుకరిద్దామనుకొని " అంబా " అని ఆవు అరిచినట్టే అరిచాడు. ఆ ఆవు అరవడం ఆపింది. గుట్టన్న కూడా అరవడం ఆపి తనకు ఆవు అరపు వచ్చిందని సంతోషపడ్డాడు. ఆ తర్వాత చెట్టు పై ఒక కోకిల' కుహూ,కుహూ' అని కూసింది. గుట్టన్న కూడా దానిని అనుకరిస్తూ ' కుహూ,కుహూ' అని కూయసాగాడు. ఆ కోకిల అది విని మరలా మరలా కూయసాగింది. గుట్టన్న అది విని ఇంకా బిగ్గరగా ఉత్సాహంతో ' కుహూ, కుహూ' అని కూయసాగాడు . చివరకు అది చెట్టు మీద నుండి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత గుట్టన్నకు తన ఇంట్లోనే ఒక పిల్లి కనబడింది. అది 'మ్యావ్, మ్యావ్ 'మని అరిచింది. గుట్టన్న కూడా ' మ్యావ్, మ్యావ్ ' మని అరవసాగాడు. వాడి అరుపులకు ఆ పిల్లి భయపడి పారిపోయింది. గుట్టన్న దానిని చూసి నవ్వ సాగాడు .ఇంతలో ఎక్కడి నుంచో ఒక కోతి వచ్చింది .గుట్టన్న కోతి లాగే 'కిచ, కిచ ' మని అరవసాగాడు .అది కరవడానికి ముందుకు వచ్చింది .'అమ్మో' అని గుట్టన్న ఇంటి లోపలికి భయంతో పరిగెత్తాడు. ఆ తర్వాత ఆ కోతి వెళ్ళి పోయిన పిదప వాడు బయటకు వచ్చాడు.

తన ఇంటి ప్రక్కన ఒక పసిబిడ్డ ఉయ్యాలలో ఉన్నాడని తెలుసుకున్న గుట్టన్న ఆ పసిపిల్ల లాగే ' కేర్ కేర్ ' మని ఏడవ సాగాడు .అప్పుడు ఆ పసి బిడ్డ తల్లి బయటకు వచ్చింది. ఇంతలో వాడి అరపుకు భయపడ్డ ఆ పసిపాప నిద్రలేచి ఏడవసాగింది .ఆ బాలింతరాలు గుట్టన్నను తన పసిబిడ్డ లేచి ఏడుస్తున్నందుకు వాడిని చీవాట్లు, శాపనార్థాలు పెట్టింది. వాడు మరొకసారి తన ఊరిలో దేనిని అనుకరణ చేయవద్దని అనుకున్నాడు.

ఇంకొకసారి గుట్టన్న పొరుగూరికి వెళ్ళాడు. అక్కడ ఒక కుక్క కనిపించింది .వెంటనే గుట్టన్న ఇక్కడతనను ఎవరూ ఏమీ అనరు అని భావించి కుక్క లాగే 'భౌ, భౌ' మని అరవసాగాడు .వెంటనే ఆ కుక్కకూడా 'భౌ భౌ' మంటూ అతనిని కరవడానికి వచ్చింది. దాన్ని చూసిన గుట్టన్న అది కరుస్తుందని ఒకటే పరుగు పెట్టాడు. చివరకు తాను చటుక్కున ఆ కుక్కకు భయపడి ఒక ఇంట్లో దూరాడు. వెంటనే ఆ ఇంటివారు గుట్టన్న భయపడడం చూసి లోపలికి రమ్మని ఆహ్వానించి అతని భయం పోగొట్టారు. తర్వాత వారు ఆ కుక్కను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. తర్వాత వారు గుట్టన్నతో " నీవు మా ఊరికి కొత్త మనిషిలా ఉన్నావు. అలా కుక్క అరుపు అరిచి దాన్ని కవ్వించవచ్చా "అని అన్నారు . అప్పుడు గుట్టన్న మరొకసారి అలా అరవనని, తన గ్రామంలో గతంలో అనుకరించిన వాటి సంగతులన్నీ చెప్పాడు. "నీవు ఎక్కడైనా అనుకరణ చెయ్యి. కానీ కొత్త గ్రామంలో అదీ కుక్క అరపును అసలే అరవవద్దు" అని వారు వాడికి హితోపదేశం చేశారు. సరేనన్నాడు గుట్టన్న .అంతేకాదు. ఏది అరచినా ఫరవాలేదు కానీ కోతి మరియు కుక్క లాగా మాత్రం అరవవద్దని అప్పుడు తెలుసుకున్నాడు గుట్టన్న.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

# తత్వం

రూపంలో దైవత్వం
మాటల్లో మానవత్వం
చేతల్లో మాత్రం రాక్షసత్వం
ఇదీ మనిషి తత్వం.
ఎంత కాలం?

- చింతల దేవేందర్
కె.వి.నెం.1
ఉప్పల్, హైదరాబాద్-39.

గౌ॥ శ్రీ సిహెచ్.విద్యాసాగర్‌రావు గారి
నేతృత్వంలో
అక్షరయాన్
సారధ్యంలో

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు

ముఖ్య అతిథి:
గౌ॥ శ్రీ సి.హెచ్. విద్యాసాగర్ రావు గారు
పూర్వ గవర్నర్, మహారాష్ట్ర

అధ్యక్షులు:
డా. తంగెడ కిషన్ రావు గారు
ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

విశిష్ట అతిథి:
శ్రీ వి.వి లక్ష్మీనారాయణ గారు, ఐ.పి.ఎస్.(రి)

పంపకవి పురస్కార గ్రహీత:
శ్రీ కె. శ్రీనివాస్ గారు
సంపాదకులు, ఆంధ్రజ్యోతి

వేదిక:
టూరిజం ప్లాజా హోటల్,
బేగంపేట్, హైదరాబాద్

తేది:
21 ఫిబ్రవరి 2022
ఉదయం 10.30 ని.

## కొలకలూరి పురస్కారాలు-2022

**మా అమ్మ**
**కొలకలూరి భగీరథీ కథానికా పురస్కారం- 2022 'గణిక'** గ్రంథానికి శ్రీమతి విజయ భండారు గ్రహిస్తారు.
న్యాయమూర్తులు-డా॥రాసాని వెంకట్రామయ్య, డా॥ జి. అరుణకుమారి, డా॥జి. బాలసుబ్రహ్మణ్యం.

**మా నాన్నమ్మ**
**కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం-2022- 'జక్కులు'** గ్రంథానికి శ్రీ మంథని శంకర్ స్వీకరిస్తారు
న్యాయమూర్తులు: ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, ఆచార్య గారపాటి దామోదరనాయుడు, ఆచార్య, రాచగల్లు రాజేశ్వరమ్మ,

**మా తాతయ్య**
**కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారం-2022 -'తెలుగు నవల-ప్రయోగ వైవిధ్యం'** గ్రంథానికి శ్రీ కె.పి. అశోక్‌కుమార్ అందుకొంటారు.
న్యాయమూర్తులు- ఆచార్య కాటూరి శారద, ఆచార్య వెల్దండ నిత్యానందరావు, ఆచార్య మేడిపల్లి రవికుమార్.

మా అమ్మ జయంతి, వర్ధంతి రోజున ఒక్కొక్క పురస్కారానికి నగదు రూ.15,000/- మెమొంటో, శాలువా 26.2.2022 నాడు జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయటం జరుగుతుంది.

-ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
సెల్: 94419 23172

-ఆచార్య కొలకలూరి సుమకిరణ్
సెల్: 99635 64664

## సృష్టి

సృష్టిలో తీయనైనది స్నేహం
కానివారెవరు లేరు దీనికి దాసోహం
స్నేహం దేవుడిచ్చిన వరం
అది తేనె కన్నా మధురం
స్నేహం లేని జీవితం శూన్యం
స్నేహితులున్న వారి జన్మ ధన్యం.

స్నేహం అంటే ఓ నమ్మకం
నెయ్యం ఓ నలపాకం
స్నేహితులుంటే లేదు ఏ శోకం
చెలిమిలేని బతుకు నరకం.

కష్టాలు దరిచేరకుండా
కన్నీళ్ళు రాకుండా
ఆవేదనలు లేకుండా
బాధలు కలుగకుండా
నేనున్నాననే భరోసా
కల్గించే వాడే స్నేహితుడు మనసా.

అన్ని బంధాలకన్నా గొప్పనైనది
ప్రపంచంలో విలువైనది
అమ్మప్రేమలా లాలించేది
నాన్న ప్రేమ లా పాలించేది.

అన్నలా ఆదరించేది
అక్కలా ధైర్యమిచ్చేది
చెల్లెలా చెంతనుండేది
తమ్ముడిలా ప్రేమపంచేది
అప్పుడిలా చూసుకునేది
దైవంలా వరాలిచ్చేది.

మమతలు నిండిన స్నేహం
ఇది ఉండే మనసు ప్రశాంతం
అందుకే స్నేహానికి జీవం పోయండి
సదా మీరు సంతోషంతో
జీవితం గడపండి



-చల్ల. సునితాసంపత్
9866694764

## తెలుగు దేవోభవ

అ తోటె అమ్మ
అ తోటె అయ్య
అ తోటె అమ్మమ్మ
అ తోటె అక్క
అ తోటె అన్న
ఒక్క అక్షరంలోనె ఇంత కుటుంబమా!
ఇక అన్ని వర్ణాలలో
ఇంకెంతెంత దాగిఉందో!
తెలుగోడి వసుధైక బంధ బాంధవ్యం
ఓర్పు, నిట్టూర్పులకు ఊతమైన భాష
దూషణలకు సైతం దూరం లేని భాష
వాగ్గేయకారుల భక్తి భాష

మహాకవులందరికి మహోన్నత భాష
జానపదుల బాసల తీయని యాస భాష
ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్‌గా
విదేశీయులు స్తుతించిన విశేష భాష
బ్రౌన్‌దొర నేర్చి నేర్పించిన విశిష్ట భాష
దేశ భాషలందు తెలుగు లెస్సనే
కృష్ణదేవరాయల మనసు భాష
ఛాందస భాషకాని ఛందోబద్ధ భాష
దేవభాషకు కోటి తులతూగు భాష.



-సోమయాజుల శర్మ
సెల్: 9346671527

## జీవితం

జీవితంలో సుఖం దుఃఖం
మనవెంటే ఉంటాయి
నాణేనికి ఒకవైపు సుఖం
ఇంకోవైపు దుఃఖం ఉంటాయి
సుఖంలో అందరు మనవెంట ఉంటారు
దుఃఖం లో మనిషి ఎపుడు ఒంటరివాడు.

జీవితం చాలా తాత్కాలికం
ప్రాణం ఉంటుంది
తృటిలో ప్రాణం పోతుంది
అంతా అబద్ధపుమాయ
అంతా అబద్ధపు శరీరఛాయ
ఎందుకు జీవితాంతం
పాపంలోనే మునిగితేలడం.

ఏది నీది కాదు
ఏది నాది కాదు
నేను ఒక ప్రయాణికుడిని
నీవు ఒక ప్రయాణికుడివి
ఒకడు రాజు కావచ్చు
ఒకడు సామాన్యుడు కావచ్చు
అంతం ఒకేలాగా ఉంటుంది.

పైనున్న ధూళి దులుపుకుంటారు
మనసులో కి తొంగిచూసుకోరు
పైపై మెరుగులు శరీరానికి అద్దుతారు
మనసులో ఉన్న మురికిని కడగరు



-అరుణ డేనియల్
9000606889

## కవి - కవిత్వం

తరచి చూస్తే కవి ఓ కవ్వించే ప్రేమికుడు
అక్కున చేర్చుకునే ఆత్మీయుడు
అక్షర తూటాలతో యుద్ధం చేసే ఓ సైనికుడు
శాంతి కాముకుడు
తెలుగు తల్లి ముద్దు బిడ్డడు.

కవిత్వం అంటే కాదు కేవలం పదాల కూర్పు
యెదలో భావాన్ని అందంగా పరిచే నేర్పు
మస్తిష్క మథనంలో నుండి పుట్టిన తీర్పు
సమాజంలో కోరుకునే మార్పు
బాధా తప్త హృదయాలను ఊరడించే ఓదార్పు.

అర కొర పర భాషా పదాలు
భాషాసంకరం కావిస్తున్న వింత ప్రయోగాలు
మాతృభాషని నిఘంటువులలో
వెతుకుతున్న విడ్డూరాలు
భాషా పునరుద్ధరణకై పాటుపడే ఆశా కిరణాలు
కవులు పూయించే సాహితీ కుసుమాలు.

కవికి లేదు మరణం
ప్రజా హృదయాల్లో అమరం
సమాజ స్థితి గతులకు దర్పణం
కవిత్వం అంటే అభ్యుదయ మకరందం
ఆస్వాదిద్దాం నిండుగా మనం అందరం.



-డా. సంధ్యారాణి
సెల్: 9542299500

## ఆత్మబంధువు

నీటి వనరు పెరిగింది
చెట్టుచేను కులికింది
పంట సిరులు తెచ్చింది
వలస బతుకు తప్పింది.

రాయిరప్ప తరిలింది
రేణికంప తొలిగింది
నాగేటి పోటుకు
బీడు భూమి పండింది.

నాపరాయి నేలలో
కొత్త తోట వెలసింది
జెర్రిబోతు నీటి కాలువ
తోటంత తిరిగింది
పండ్లసిరులు తెచ్చింది.

గలగల లా కృష్ణమ్మ
పెద్దకాల్వ చెరువు కాల్వ
తల్లి కాల్వ పిల్ల కాల్వ
నీటి తో తరిలింది
పనికి రాని నేలలన్నీ
వరి మళ్లుగ మారాయి
రైతు కూలికాడు నేడు
అన్నదాత వాడు నేడు.

రైతు బంధువు
ఆత్మ బంధువై
చేదోడుగ ఉన్నప్పుడు
రైతు ఇంట వెలుగు లే
పంటసిరుల మూట లే



-రేడియమ్
9291527757

పుస్తక సమీక్ష

# దారి చూపిన వాక్యం పద్మ కవిత్వం

సృష్టిలోని ప్రతి అందాన్ని అతి దగ్గర నుంచి చూసే అద్భుతమైన దృష్టికోణం ఒక కవికి మాత్రమే ఉంటుంది. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని ప్రత్యేకంగా ఒక కూర్పు చేసి పాఠకుడికి అందించాలనే తలంపుతో కవులు, కవయిత్రులు కవితా సంపుటి లు వెలువరించడం జరుగుతుంది. ఈ సంపుటిలు ఇలా భద్రపరచడం భావితరాలకు ఒక అద్భుత కరదీపికలుగా మారుతాయి. ఇటీవలే తన తొలి సంపుటిగా ఉప్పల పద్మ, హైదరాబాద్ రాసిన "రెక్క తొడిగిన వాక్యం" కవితా సంపుటిని పరిశీలిస్తే పఠితలను చైతన్యం చేస్తుందని చెప్పవచ్చు.

నిజాన్ని చెప్పే సహజత్వాన్ని కలిగి ఉన్న నిఖార్సయిన కవయిత్రిగా, రచయిత్రిగా తనకంటూ ఒక ప్రత్యేకత తో సాహిత్య మార్గం ద్వారా ముందుకు నడుస్తున్న ఉప్పల పద్మ. ఈ సంపుటిలో సహజత్వాన్ని సూటిగా చెప్పిన కొన్ని కవితల మెరుపుల గురించి..

ప్రతిదీ ప్రతిబింబవే. కవితలో...

**తల్లి గర్భగుడిలో నేను నేను గానే ఉన్నా...**
**నేను తనువును తగిలించుకొని తలారి తల్లిని వీడిన క్షణం నేను నేను గానే ఉన్నా**
**నవ మాసాలు మోసిన తల్లి గర్భం నుండి శిశువు ప్రపంచాన్ని చూడాలని**

.... గర్భగుడిలో ఊ కొడుతూ.... తల్లిని వీడి బాహ్య ప్రపంచంలోకి అడుగులేసి బంధాలు అనుబంధాలతో రెక్కలు తొడిగి విహరిస్తున్న కవనం ఈ కవిత

--

**బోధించని సత్యం కవిత లో**
**చేన్లు మేసే కంచెలున్నంత కాలం**
**కమనీయం ఈ నాటక రంగం**
**కళ్ళు తెరిచి చూడనన్నాళ్ళు...**
**కనిపించదు కారాగారం...**
**ఆశల పల్లకి మోస్తున్న న్నాళ్ళు**
**బోధ పడదు బందీవన్న సత్యం**
**సందేశం ఈ కవనం... కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తి నట్లు... కటకటాలు తప్పవని**
**ఊహల్లో విహరిస్తున్న అక్రమార్కులకు . అత్యాశ పరులకు చెంపపెట్టు....**

--

కల్మషాలు కరిగిస్తాం.. కవిత లో



( చేతులు జోడించి చెలిమి చేసే చెలియలమై.....)
( చెంగుచెంగునా గంతులేసే లేడిపిల్లలమౌతాం )
( మేము తెలంగాణ తల్లి ఆడ బిడ్డలం ఆనందాలకు ఆయువు పోయ విచ్చిన విరజాజులం )

తెలంగాణ ఆడపడుచులు ఆరాధ్య దైవంగా కొలిచే "బతుకమ్మ" ను పేర్చిన ఆ చేతులతో కోలాటం ఆడుతుంటుంటే

బంధాలు అనుబంధాలతో కూడిన బతుకమ్మ ఈ కవిత తో ఆనందంలో పరవశించి దీవెనలు అందించక మానదు మరి.....

--

**ఆమె ఓ మనిషే...! కవిత లో**
**ఇన్నేళ్ళ తన ప్రపంచాన్ని**
**పుట్టింట్లో నెట్టి... పరాయి దానోలే**
**చుట్టాన్ని చేస్తారెందుకు....?**
**నీ కుటుంబం అదే అని**
**అన్ని సంతోషాలు మూటగట్టి**
**సద్ది గంపతో సాగనంపుతరు**
**అయినా....సర్దుకుంటది కానీ,**
**సాటి మనిషిగా చూడరెందుకు....?**
**ఆడపిల్లయినా సమానంగా పెంచు**
**అందరికీ మనసుంది**
**మమతానురాగాలున్నాయ్...**
**సాక్షాత్ లక్ష్మిదేవి కదా...!**

ఈ కవితలో స్త్రీ యొక్క గమనాన్ని తెలియజేసారు. "ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి ఇల్లాలే ఈ జగతికి జీవనజ్యోతి" ఒక చలన చిత్రంలో స్త్రీకి ఉన్న గౌరవాన్ని అద్భుతంగా తెలియజేసి నట్లుగా సాక్షాత్తు లక్ష్మిదేవి తో పోల్చిన ఈ కవిత తన కవన ప్రత్యేకతను చాటుకున్నది.

--

**ఆమె ఒక మేఘం .... కవితలో...**
**ఆమె అబల కాదు సబలే**
**అతనిలోను సగమే... ఆదినుంచీ సగమే**
**సర్వశక్తులూ ఒడ్డి సాధిస్తూనే ఉంది**
**సర్వోన్నతంగా నిలుస్తూనే ఉంది....**

పెళ్లి అనే అనుబంధంతో భర్తలో సగం అయిన భార్య ప్రతి కార్యసాధనలో కుటుంబానికి, సాంప్రదాయ కట్టుబాట్లకు అన్నిటినీ సమానంగా పాటిస్తూ సాగుతున్న స్త్రీ గురించి "ఆమె ఒక మేఘం " లో తెలియజేశారు.

--

పత్రికాపాశుపతం.... లో
నిజాలు నిర్భయంగా
నిరూపణ తో చూసే
పత్రికలు రావాలి
ప్రజల పక్షమే ఉండాలి
ప్రతిపక్ష మై ప్రశ్నించాలి
ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేసే వార్తాపత్రికలు నిజాన్ని నిస్సంకోచంగా తెలియజేయాలని మరోసారి కలం విలువ తెలియజేసారు.

అన్ని మతాల సారం...ఆనందమే కవితలో....

**కరోనా పుణ్యమాని...**
**మనుషుల మధ్య**
**మానవత్వం మాట్లాడుతుంది.**
**గుళ్ళల్లో శిలలుగా మిగిలిన దేవుళ్ళు**
**గుండెల్లో కొలువైతున్నరు.**

గుళ్లో దేవుడి చుట్టూ ప్రదక్షణలు చేసి దేవుడిని ఆరాధించడం భక్తిని చాటుకోవడం లో భాగమైన ప్రతి భక్తుడు కరోనా సమయంలో ఇల్లు దేవాలయంగా భావించి మనసుతో స్తుతిస్తూ గుండె గుడిని తెలియజెప్పిన కవనం.

--

ప్రతి పాటకు పల్లవి. కవితలో
**శ్రీ శ్రీ....**
**ఓనమాల తో శ్రీకారం చుట్టలేదు.**
**అనువనువు తడిమి ఆకారాన్ని ఇవ్వలేదు.**
**ఆలోచనలు పంచుకోనులేదు.**
**నీతో నాతో కలిసి నడవనులేదు.**

అయినా....ప్రతి గొంతులో ప్రతిధ్వని స్తాడు

ఈ కవిత తెలుగు సాహితీ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మహాకవి శ్రీ శ్రీ కవన ప్రత్యేకతను తెలియజే సింది.

చివరగా....

**నిజం చెప్పాలనుకునే మనసుకు దాపరికం ఉండదు**
**సహజకవి కి నిజాన్ని వెల్లడించడం లో కలం ఆగదు**
**కాదేది కవిత కనర్హం** అన్నాడు శ్రీశ్రీ

కవి కవనంలో చూసే "వస్తువు" మారేదయినా..... మనసు భావాలను ఆపా దించి శిల్పం అనే జీవం పోసి రేపటి భవితకు నాంది పలుకుతాడు.

సాహితీ చరిత్రలో "రెక్క తొడిగిన వాక్యం "చెరగని పుటగా నిలుస్తుందని ఆశిస్తూ... మరిన్ని మంచి పుస్తక సంపుటాలు కవయిత్రి పద్మ నుండి వెలుబడాలని అభినంధనలు తెలియజేస్తున్నాను.

**ప్రతులకు:** ఉప్పల పద్మ
ప్లాట్ నెం. 107, ఇ.నెం. 8-355/1/2
ఎం.ఎన్.రెడ్డి నగర్, ఫేస్-॥
జీడిమెట్ల (పో॥) సుచిత్ర
హైదరాబాద్-500 067
సెల్:9951445867



-డా.చిటికెన కిరణ్ కుమార్,
సెల్. 9490841284

## సైబర్ నేరాలు మహిళల జాగ్రత్తలు

ఆ.వె: యెవరొ తెలియకున్న యొందుకు చాటింగు
ఫేసుబుక్కులోని ఫేకు ముఖము
ఫెయిరు అనుచు ఊరు, పేరునూ చెప్పడం
మేక పులిని పిలిచి మేతయగుటె!

వరసబెట్టి ఫోను వాట్సాపు ట్విట్టర్ల
గంట గంటలెన్నొ మంటగలుప
మనసు పాడు అవును మనిషితో పాటుగా
మెదడుకెపుడు అదియు మేలుకాదు!

ఒంటిమహిళవనుచు వెంటను బడుచున్న
తుంటరోడినపుడె దునుమవలెను
చెప్పులోన రాయి చేటును చేయదా
తీయకుండ మనము తిరుగవద్దు!

మనిషి గుణము మరచి మసలెడు మృగములు
పగలు రేయి గూడ పడును వెంట
తెలివి తోడ మసలి తెగువను జూపియు
వంద నంబరుంది వదలవలదు!

అవనియందు వనిత అందలంబెక్కని
వేదికేది లేదు వినుము జనని
నీవు వలయు శక్తి నీలోనె గలదను
నిజము గనుము ముందు నీరజాక్షి!



-పెసరు లింగారెడ్డి
9010292500

## పరాన్న జీవులు

జీవులు ఎక్కువైయ్యారు
పరాన్న జీవులు ఎక్కువైయ్యారు
సోమరి పోతులు ఎక్కువైయ్యారు-

మంచి ని వంచించో
చెడు ని లాలించో
ఎదుటి వాణ్ణి దోచి సంపాదించే
బాపతు ఎక్కువైయ్యారు-

మోసం వెనుకాడటం లేదు
దోపిడీలకీ దొంగ తనాలకీ
వెనుకాడటం లేదు
ఇప్పుడు దోపిడీ లు దొంగ తాళాలు
కడుపు నిండక చేయటం లేదు-

అన్నీ వుండి అక్రమ సంపాదన ల్లో దోపిడీ
అన్నీ వుండి అవినీతి పరుల చేతల్లో దోపిడీ
అన్నీ వుండి బుసకొట్టే రాజకీయం
నిండా దోపిడీ -

వీళ్ళంతా శ్రమించని పరాన్న జీవులు
వీళ్ళంతా పాపపుణ్యాలు
అంటని ముట్టని పరాన్న జీవులు-

ఇపుడు వీళ్ళే నాదేశం
ఇపుడు వీళ్ళే మా పాలకులు
ఇపుడు వీళ్ళే మా ఓటు హక్కు
తుది మొదలు ముట్టింపు దార్లు .



-వి.సూర్యారావు
92469 11234

## జీవితములో డబ్బుకన్న విలువైనవి

సంతోషం
స్నేహం
సమయం
కలలు
ఆనందం
ఆరోగ్యం
ప్రేమ
విశ్వసనీయత
ఆత్మీయత
అనుబంధాలు
అనురాగం
మమత
మానవీయత
సౌహార్ద త
సంఘీభావం
ఇవ్వి మార్కెట్లో లభించవు
మనిషి మనసే వీటికి చిరునామ
ధనం కన్న విలువైన వి
ప్రతి మనిషి జీవిత చరిత్రలో
చిరస్థాయి
ప్రభావితశక్తి కిరణాలు
మానవునిలో 'దైవత్వం'
మానవ జాతికి
కావాలి 'దర్పణం'



-నేదునూరి కనకయ్య
9440245771

## ఆగమాయే... !!

మార్కెట్లన్నీ ధాన్యరాసులై నిండిపోయే!
పోటీపడిన ప్రభుత్వాలు గింజ కొనకపాయే!
ఆరుగాలం కష్టమంతా వర్షాల కొట్టుకపాయే!
మిగిలిన ధాన్యం నారువోసినట్లు మొలకలాయే!

తీరుతాయనుకున్న అప్పుల ఆశలు ఆవిరాయే!
అదురువోయిన అన్నదాతల గుండె ఆగిపాయే !
పురుగు మందుల ధరలుజూడ గగనమాయే!
పంట పండినా అమ్మడం గాలిలో దీపమాయే!

ప్రతిచోట నాయకుల పాదయాత్రలు పరిపాటాయే!
టీవీ చానలన్నీ తెగని చర్చలతో తగవులాయే !
అన్నదాతలను ఆదుకునే నిర్ణయం లేకపాయే !
అన్నంబెట్టేవాని బతుకు రోజురోజుకు ఆగమాయే!

పడిన కష్టాలకు ఏమాత్రం ఫలితం దక్కపాయే!
వచ్చే యాడాది 'గింజ'నాటుడు భయమాయే!

ఓట్లను కొనగలిగే సత్తా ఉన్న దేశంలో..
'వడ్ల'ను కొనలేకపోవడం విచారమే..!
ప్రాజెక్టులకోసం పైసలు ఎగజల్లిన దేశంలో
రైతన్నలు ప్రాణాలు కోల్పోవడం విచిత్రమే! స

ప్రతి చోటా పలుకుబడి కలగిన రాజ్యంలో
ధాన్యం కొనుటలో ధగా చేయడమెందుకూ..?
బువ్వ'కు బహు గిరాకున్న దేశంలో..
'వడ్ల'ను వద్దనటం బహు విచిత్రమేకదా..!

కష్టాలను ఎవరు కోరుకుంటారు చెప్పూ..
పడిన కష్టాలకు ఫలితం దక్కుకుండా
ఇన్ని రకరకాలుగా ఆగంజేసినంకా..
'వరి'పంట ఈంకెవ్వరేస్తారు చెప్పూ..
అన్నదాతలు కాడి కిందకు దింపితే..
ఎన్ని ఉన్నా మనలను కాటికి ఎత్తాల్సిందే!

- సోమశిల తిరుపాల్,
9989260336.

## ఆట వెలదులు

కన్న తల్లి కంటె ఘనమైనదీ లేదు
నాన్న బోలు సమము నవని లేదు
యెన్న గురుని కన్న మిన్న నేదియు లేదు
పూజ మాట నిజము పుడమి లోన !!

అమ్మ మాట కెవరు అడ్డు చెప్పగ రాదు
అడ్డు చెప్పియున్న ఆపదొచ్చు
అమ్మ మాట విన్న నది రాజ బాటౌను
పూజ మాట నిజము పుడమి లోన !!

కాయ కష్ట మోర్చి కన్న బిడ్డల బెంచి
చదువు సంధ్య లందు చక్క దిద్దె
తల్లిదండ్రులిలను దైవ స్వరూపులే
పూజ మాట నిజము పుడమి లోన !!

కన్న వారి నెపుడు కష్ట పెట్టగ రాదు
కష్ట పెట్ట మనసు కలత పడును
మనసు గాయపడ్డ మానని పుండౌను
పూజ మాట నిజము పుడమి లోన !!

తల్లిదండ్రులెపుడు తగవు లాడగ రాదు
తగవు లాడ సంతు తల్లడిల్లు
నట్టి నిల్లు నిలను నరకము సమమురా
పూజ మాట నిజము పుడమి లోన !!

గురువు గారి వంటి గుణవంతు లుండరూ
గురువు నేర్పు విద్య గుడ్డి గాదు
గురువు మాట విన్న గుర్తింపు వచ్చేను
పూజ మాట నిజము పుడమి లోన !!

గురువు మాట విన్న గుణవంతు లగుదురూ
అడ్డు చెప్పి యున్న అంధులౌరు
ఎదురు చెప్పి యున్న నేమి ఫలిత ముండు
పూజ మాట నిజము పుడమి లోన !!

అడ్డుగాను వచ్చు నవరోధ ములదాటి
సవ్య మార్గమెంచి సాగు నదులు
మనిషి తలుచుకుంటె మహి నసాధ్యంబేది
పూజ మాట నిజము పుడమి లోన !!

నీటిలోన పాలు నిక్షిప్తమైనట్లు
మంచి మైత్రి నుండు మహిన గనగ
మనసులెరుగ కున్న మైత్రి యేలగునురా
పూజ మాట నిజము పుడమి లోన !!

-మొగలి పూజ
9701285688

## స్వామి వివేకానంద

విశ్వనాథునింట జనించె శివుని కృపన
వంగదేశమందు నరేంద్రుడు దత్తులింట
పువ్వు పుట్టగనే పరిమళించునట్టు
వెలికి వచ్చె నాతనిలో సద్గుణాలు

చిన్న నాట వినెను తల్లి నుంచి
భారత గాథలు,రామునిచరితం
విలువలబ్బెను కథలను బట్టే, వాని

యోచనలు మారి వ్యక్తిత్వం నిరూపణాయె
దైవమును కాంచగ వెదకితివి పలుచోట్ల
తుదకు చేరేవు గురురామ కృష్ణ చెంత
అనతి కాలములోన గురుదయ నొంద
పరమహంసకు ప్రియమైన వాడ వీవు

బలమె జీవమ్మని నుడివినావు
నీవునీదు బలహీనతే నీకు మరణమనిరి
ఉక్కు నరముల యువత నుండ వలెను
అనిన మీ పల్కులక్షర సత్యమిలన

దేశ దేశాల వాసిగా భరతమాత
కీర్తి రాయంచగా చేసి ఎగుర వేసి
హిందుధర్మవిశిష్టత తెలిపినావు
స్వామి నీకు సాటి ఎవరు ఇలను లేరె



-బొల్లాప్రగడ
ఉదయ భాను
8978376327

## ఓ మంచి మిత్రుడు

నీవెవరోనీకు తెలుపుతుంది
నీకు నిన్ను చూపుతుంది
కష్టం లో తోడు ఉంటుంది
ఒంటరితనం దరిచేరనివ్వదు
ఆపద కాలంలో ఆప్తుడిగా
స్నేహితునిలా చేయి అందిస్తుంది
ఎలా నడుచుకోవాలో నేర్పుతుంది
ఎలా మసలితే మంచిదో తెలుపుతుంది
దిక్కుతోచక విలవిలలాడే సమయంలో
దిక్సూచిలా మార్గం చూపుతుంది
నిష్ఠూరం అయినా
నిక్కచ్చిగా నిజం చెబుతుంది
చరిత్రను సంస్కృతిని సంప్రదాయాలను
నిగూఢంగా నిక్షిప్తం చేసుకుంది
నీవు నిర్ణయించుకోవడంలో
నికార్సైన సలహాదారు
లక్ష్యానికి చేరువ చేయడంలో అన్వేషి
నీకంటూ ఓ మంచి మార్గాన్ని చూపుతుంది
అక్కున చేర్చుకుంటే నిన్ను
శిఖరాగ్రాన నిలుపుతుంది
నీ కంటూ ఓ గుర్తింపు
లాలింపు నేర్పు ఓర్పు ...
పుస్తకాన్ని హస్తభూషణంగా మలుచుకో
అందరిలో ఒక్కడిగా కాక
అందరికీ ఒక్కడిగా నిలిచిపో



-సి. హేమలతలతా శర్మ
9666779103

## పేరడీ పాట

(మూగమనసులు చిత్రంలోని.. నా పాట నీ నోటా..).
నీ వోటు నాకు వేయాలి బ్రదరూ
ఎన్నికల్లో నేను గెలవాలి బ్రదరూ

పదవి నాకు దక్కాల, పెత్తనమే నేను చేయాల
నీతినే గాలికొదలి, కోట్లనే కూడబెట్టాల
నా సంపాదన చూసి జనమంత ఏడ్వాల
మీ బేలతనమే నా సంపాదనకు నాంది పలకాల
పన్నులెగ్గొట్టాల, మేడలే కట్టాల
నా మేడచూసి మంత్రిపదవినే యివ్వాల
నీ పేరె నా ఆస్తులకు బినామీగా వుండాల
నీ మీదనే కేసులన్నీ కోర్టుల్లో సాగాల
మంత్రిపదవి వున్న నాళ్ళు మాకెన్నొ భోగాలు
కోర్టులో కేసులతో కొనసాగుతాము పదవుల్లో
బతుకంత కుర్చీలో కూసునుంటాము సుఖంగాను!



-యం. బాల గంగాధరయ్య,
9849546762

## నిత్య చైతన్యాన్ని...

నాకు పోరాటం
కొత్తేం కాదు,
పురిటితోనే
పట్టుకొచ్చుకున్న...

అణగదొక్కి
అధఃపాతాళానికి తొక్కినా
అదునుజూసుకొని
ఆయువు పోసుకుంటూనే ఉన్న....

ఫలాల్ని తిని
పనికిరావని పారేసినా
పదను తగిలితే చాలు
పొట్టలు చీల్చుకొని చిగురిస్తున్న...

నా గూడు కాకున్నా
నా గోడు కాకున్నా
నీ గొడవ నాదనుకొని
సరదంట సంగ్రామం చేస్తున్న....

ఒక్క నాల్కె గాదు
ఒక్క కుత్కె రాదు
అవకాశం వస్తే అన్నీ మరుస్తావ్
అడుగడుక్కీ జారుతున్నావ్ ....

ఊసరవెల్లి లెక్క
ఊగిసలాటాడుతున్నావ్!
నన్ను నేను తమాయించుకొని
నీ కోసం నిలువరిస్తూనే ఉన్న......



-వి. పద్మ
9951445867

## నానీలు

మోడైనా
తరువు చిగురిస్తుంది
మూర్ఖుని
మనసు చలించదు

కవి
నిత్య దార్శనికుడు
కలముతో
మేల్కొల్పే సైనికుడు

-చాపలమహేందర్
9949864152

## కాలంతో కలిసి నడుద్దాం

కాలంతో పోటి పడాలి
అవకాశాలను అంది పుచ్చుకోవాలి
కాలం ముంగిట అందరు
సమానులే
కాదు కూడదని ఇష్టారీతిన
పోతే కన్నెర్ర చేస్తుంది
అహంకారంతో విర్రవీగితే
అంతం చూస్తుంది!

కాలం జ్ఞాపకాల పుట్ట
ఆలొచనలతో ఆనంద
దృశ్య శ్రవణాలు
ఆత్మీయ సుందర శిల్పం
కాలంతో సవాల్ చేస్తే
కడలి తరంగమై ఘోషిస్తుంది
కన్నీళ్ళతో దుఃఖ వేదన
మిగిలిస్తుంది
కాలాన్ని కాలరాస్తే కాల
గర్భంలో ముంచేస్తుంది!

కాలం ముంగిట అందరు సమానమే
కాలానికి హాని చేస్తే
ఖడ్గమై ఒంటిని చీలుస్తుంది
ప్రకృతి వైద్యమై ప్రాణాలు
నిలబెడుతుంది
పాపాలు ఎక్కువైతే
తుపానులతో కడిగేస్తుంది
అహంకారం అందమెక్కితే
భూకంపమై భుజిస్తుంది
వేయిగొడ్లను తిన్న రాబందులు ఒక్క గాలి
వానకు నేలన రాసినట్లు
ధనమదం ఎక్కువైతే
దానధర్మాలు చేయాలి
వెర్రి చేష్టలుతొ వెక్కిరిస్తే
సనామియై చుట్టు ముడుతుంది
కాలంతో స్నేహం చెయ్యి
కడుపులో పెట్టుకొని
చూసుకుంటుంది!



-కోణం
పర్శరాములు
9959524585

## శాపం

ఆరుగాలం పండించిన పంట
కళ్లలో వర్షానికి తడిసి
మొలకెత్తిన ధాన్యాన్ని చూసి
చేసిన అప్పు దినదినం ఉచ్చు బిగిస్తుంటే.

ఆగిన రైతు గుండె లెన్నో
రాజకీయ వైరుధ్యాల మధ్య
నలిగిపోతున్న మట్టి ప్రేమికుడు.

మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు
వరి వేస్తే ఉరి నినాదం
రైతు జీవితం
కుడితిలో పడ్డ ఎలక పరిస్థితి ఆయే.

పండిన పంట అమ్మ లేక
సాగుబడి చెయ్యలేక
రైతుల పరిస్థితి
అగమ్యగోచరంగా తయారయింది.

ఆకలి తీర్చే అన్నదాతలు
ఆశువులు పాలు అవుతుంటే
దేశానికే అరిష్టం
పాలకుల వైరుధ్యాలు
రైతుల పాలిట శాపమాయే



-చాపలమహేందర్
9949864152

పుస్తక సమీక్ష

# తను నేను..ఓ సంపూర్ణ వాక్యం

ఓరుగల్లు ముద్దు బిడ్డ,కవిగా తనదైన ప్రత్యేక గొంతుక వినిపిస్తున్న వ్యక్తి బిల్ల మహేందర్ . వీరి కలం నుండి జాలువారిన ఆణి ముత్యం 'తను నేను వాక్యం' తన అర్ధ భాగానికి అంకితమిచ్చిన అద్భుత కవితా ఖండికల సమాహారం ఇది. ఈ సంకలనంలో సుమారు నలుబది నాలుగు అపూర్వ ఖండికలు ఉన్నాయి. ప్రతి ఖండిక కొనసాగింపులా అనిపిస్తూనే తనదైన ప్రత్యేకతను చాటుకొనే అందమైన విరిమాలను తలపింప చేస్తుంది.

కవి తను నేనును వాక్యం చేస్తూ..
**'నేను తన దోసిట నిండ**
**పువ్వుల్ని కురిపించాను**
**తను నా గుండె నిండ**
**పువ్వుల్ని పూయించింది'**..అంటూనే తాను ఇచ్చే పువ్వులు వాడిపోయినా తను ఇచ్చిన నవ్వులేమో గుండెల్లో ఇంకా పరిమళిస్తూనే ఉన్నాయంటూ..ఆలు మగల అనుబంధాలను కొత్త కోణంలో సున్నింతంగా చూపించారు.

స్త్రీ మనసు ఒక మహా కావ్యం అంటూ..'ఆమె' మనసులోకి వెళ్ళి 'ఆమె'ను ఆవిష్కరించడం లాంటి నూతన ఒరవడి కవిలో కనిపిస్తుంది.

**ఆమెను కవితగా**
**మలుద్దామనుకున్నాను**
**మహా కావ్యమై ముంగిట నిలిచింది..**





**నేను ఆమెలోకి**
**పయనిద్దామనుకున్నాను**
**మొదటి అడుగులోనే నా జీవిత కాలం ముగిసింది**

వీరి శైలికి ఇదో మచ్చుతునక.

వేవేల ఏళ్లుగా ఆనాటి చలం గారి నుండి నేడు మహేందర్ దాకా ఆమెను ఆవిష్కరించే ప్రయత్నాలు మాత్రమే సాగుతున్నాయేమో..ఎందుకంటే ఆమె గురించి రాయడంలో అక్షరాలన్ని అక్షయమే కదా..

ఎప్పుడూ ఎరుపును ఆవిష్కరించే కవిని..

తను
నువ్వెందుకు ఎరుపును ఇష్టం పడతావని అడిగితే?

నవ్వుతూ వెళ్లిన అతను ఆమెకు ఇచ్చిన సమాధానం..

**"ఒకానొక ఉదయం**
**ఇంటి ముందు హఠాత్తుగా**
**ఆమె నుదుటి బొట్టునెవరో ఉరి తీసి వెళ్లిపోయారని.."**

ఎరుపును ఎందుకు రాస్తాడో అర్థమయ్యేటట్లు చేస్తుంది. ఇంకెప్పుడూ ఆమె అతడి ముందు ఆ ప్రస్తావన తేదు..ఇలా కవి కవిత్వ తీరు చాలా లోతైన భావాలన్ని అలతి అలతి పదాలతో వ్యక్తం చేస్తారు..

మనకు పరిచయమైన స్త్రీని మళ్లీ కొత్తగా పరిచయం చేసిన చక్కటి ఆవిష్కరణ వారి కవిత్వం

**"నన్నతడు**
**మండే సూర్యుడి బొమ్మ గీయమన్నాడు**
**నేను ఆమె ముఖాన్నొకటి గీసి చేతుల్లో పెట్టాను**
**విచిత్రంగా చూస్తూ**
**మళ్లీ నన్నొక విరబూస్తున్న వెన్నెలను గీయమన్నాడు**
**మళ్ళీ ఆమె ముఖాన్నొకటి అలాగే గీసి అతడి చేతిలో పెట్టి వెళ్ళిపోయాను..**
**ప్రకృతిలోని సూర్యుడి తేజస్సు ఆమె..చంద్రుడి చల్లదనం ఆమె.."**అంటూ తన అక్షరాల పూదోటలో అర్థాల పరిమళాలు వెదజల్లుతాడు.

తనొక కథ రాయమని అడిగింది
"నేను అనగా అనగా ఒక రాజు" అంటూ మొదలు పెట్టబోతున్నపుడు
**"పాత చింత కాయ పచ్చడే కదా?"** అంది
**వాక్యాన్ని మారుస్తూ**
**అనగా అనగా ఒక ఊరు అని**
**మొదలు పెట్టాను**
**మళ్ళీ పాత చింత కాయేనా?**అంది
**ఊరు బదులు అడవి అని మార్చబో తుంటే**
**పాతదే కదా?** అంటూ నిట్టూర్చింది.
**"విసుగు చెందిన నేను కలాన్ని ఆమె చేతికిచ్చాను**
**అప్పుడు తాను అనగనగా ఒక సీత అని మొదలు పెట్టింది**
**అది చూసి ఏదో అనబోయిన అతనికి ఆమె చూపుల్లో ఎన్నో భావాలు కనిపించాయి.**

ఇలా ప్రతి ఖండిక ఒక సుమమై,భావాల పుప్పొడి రాలుతుంది. మనసుకు కొత్త ఆలోచనలకు పురుడు పోస్తూ,

అతనికి ఆమె కథ కొత్త గా రాయడం నేర్పుతుంటే..మేధావిగా గుర్తింపు పొందిన అతడు గురువు ముందు చేరిన శిష్యుడిలా నేర్చుకోవడం ఆ అమాయకత్వం..ఒక దృశ్య మాలికలా మనకు కనిపిస్తుంది.

ఒక చోట..
**"ఆమె కోసం ఒక వాక్యాన్ని మొదలుపెట్టినపుడు**
**ఎన్నో అంతులేని అంతం వాక్యాలు నా కలాన్ని అలానే కదల కుండా చుట్టుముట్టాయి"**
అంటూ
**"తప్పదు కదా అని**
**చుట్టుముట్టిన వాక్యాలన్నింటి ని ఒక్కొక్కటిగా తెగ్గోసినా**
**చివరి వరకు ఒక్క వాక్యాన్నైనా ముగించలేక**
**దూరంగా పారిపోయానంటాడు".** స్త్రీ మనసు లోతును తెలుసుకోవడం ఆమెను నిర్వచించడం అసాధ్యమని చెప్పకనే చెపుతాడు ఈ కవి.

ఆమె గుడికి వెళ్లి అతడిని దీపాలు వెలిగించమని కోరి..అతడిని అనుసరించి అతడు వెలిగించిన దీపాలను చూసిన ఆమెకు ఒక గొప్ప 'దేవాలయమే' కనిపిస్తుంది.. అతని గంభీరతలో ఆకాశాన్ని చూస్తుంది ఆమె.

ఆమె లేని క్షణాలు చీకటిని రాల్చుతుందనీ..ఆమె జ్ఞాపకాల దాహం సప్త సముద్రాలు తీర్చలేవంటూ కాలం గుర్తించని ఒక నిజాన్ని తన అక్షరాలతో వెలికి తీసి చూపాడు.'క్లిష్టమైన సమస్యల చీకట్లకు పరిష్కార దీపం ఆమె' అంటూనే సమస్యల సాధనలో ఆమె మైనం వత్తిలా కరిగిపోతుందనీ.. అమ్మగా,ఆలిగా, తోబుట్టువుగా, నేస్తంగా వారి పాత్రలను కనుల ముందు నిల్పి ఆలోచింప చేస్తారు.

ఒక ఖండికలో..ఆమెతో మమేకమైన మనసు చిరు చినుకులకు తడిసిన మట్టి పరిమళాలు వెదజల్లుననీ.. రేపటి భవితకై ఆశల అంకురాల మొలిపిస్తూ బ్రతుకు వీధుల్లో ఆమె ప్రాముఖ్యత ను తెలిపి..ఆమె లేని నాడు వానలు లేని బీడు భూములను తలపిస్తాయనీ అంటూ ఆమె విశ్వరూపాన్ని ఆవిష్కరించాడు.

**"ఆమెలోకి ప్రవహించాలంటే**
**ముందుగా నన్ను నేను అగ్నితో కడుక్కోవాలనే సత్యం బోధ పడుతుంది"**

అంటూ..ఇలా ఎన్నో భావాలకు భాష్యం చూపే అక్షరాలకు ప్రాణం పోశాడు. జీవితాలను వడ కట్టి చూపే సారమిది.

**"తను పొత్తి కడుపును చేతుల్తో అదిమి పట్టుకొంటూ**
**ఏమండీ..నేనిక భరించలేక పోతున్నానని ఎన్నిసార్లు నాతో అన్నదో**
**లోలోపల తను ఎంత దుఃఖాన్ని దాచి పెట్టుకున్నదో**
**ఎన్ని అగ్ని పర్వతాల్ని మోస్తున్నదో తెలియని నేను**
**ప్రతిసారి నీకు ఇది సహజమే కదా?? అనే నా నిర్లక్ష్యపు చూపులకు**
**తనెంతగా గాయపడిందో ఇవ్వాల తనను చదివాకే అర్థ మయ్యింది"**

అంటాడు. స్త్రీతో మొదలైన బ్రతుకులో స్త్రీతో నేర్చుకొనే జీవిత పాఠశాలలో స్త్రీ అంతరంగంలోకి తొంగి చూసి కాస్తైనా అర్థం చేసుకొని ఆమెలోని ఔనత్యాన్ని కొంతైనా నింపుకొని ఆమెకు కొన్నిసార్లయినా అమ్మ కావాలనే ఆ అక్షరాలకు వందనాలు..ఇలా ఈ కవితా ఖండికల సమాహారంలో సమాజానికి స్త్రీ మనసు కోణాన్ని పరిచయం చేసి ఆమెకు మరింత గౌరవం దక్కాలనే ఆకాంక్ష కనపడుతుంది.

ఈ లోకంలో తను లేక నేను లేను..నేనూ తానూ కలిస్తేనే ఒక సంపూర్ణ వాక్యం అదే కదా జీవిత అర్థం పరమార్థం అని వివరించిన కవికి అబినందనలు.

**ప్రతులకు:**బిల్ల మహేందర్
35-7-674, టిఎన్‌జిఓ'ఓస్ కాలనీ
ఫేస్-॥, వడ్డేపల్లి, హెచ్ఎన్‌కె,
వరంగల్-506370
సెల్: 9177604430



-ఉదయశ్రీ ప్రభాకర్
9866687134

తెలంగాణ ప్రభుత్వం

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక



# దేశంలోనే మరో కుంభమేళ

16-19 ఫిబ్రవరి, 2022 – మేడారం, ములుగు జిల్లా.

**కార్యక్రమాల వివరాలు**

16-02-2022 - బుధవారం - శ్రీ సారలమ్మ గద్దెపైకి వచ్చుట

17-02-2022 - గురువారం - శ్రీ సమ్మక్క గద్దెపైకి వచ్చుట

18-02-2022 - శుక్రవారం - మొక్కులు సమర్పించుట

19-02-2022 - శనివారం - దేవతలు వన ప్రవేశము

**మేడారం జాతరకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు**

- మంచినీటి సరఫరా ఏర్పాటు
- 354 స్నానఘట్టాల షవర్లు ఏర్పాటు
- మహిళలు దుస్తులు మార్చుకునేందుకు 132 గదులు
- 8400 తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం
- రహదారుల నిర్మాణం, అభివృద్ధి, మరమ్మత్తులు
- రవాణా కొరకు 4000 ఆర్టీసి బస్సులు
- టూరిజం ద్వారా 60 టెంట్ల ఏర్పాటు

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక






ప్లాస్టిక్‌ను వాడకండి. పరిసరాలను కలుషితం చేయకండి. పర్యావరణాన్ని రక్షించండి.

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం


## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్వీకరించిన నటుడు అమిత్ తివారి

హైదరాబాద్, ఫిబ్రవరి 16:రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ఇండియా ఛాలెంజ్ లో భాగంగా జూబ్లీహిల్స్ జీహెచ్ఎంసీ పార్క్ లో సినీ నటుడు అమిత్ తివారి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అమిత్ తివారి మాట్లాడుతూ.. ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అద్భుతమైన కార్యక్రమమని కొనియాడారు. ఇంత మంచి కార్యక్రమంలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మొక్కలు నాటడం గర్వంగా ఉందన్నారు. మనకు మంచి ఆక్సిజన్ లభించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తున్న ఎంపీ సంతోష్ కుమార్ కి అమిత్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం తన స్నేహితులు కాలకేయ ప్రభాకర్, కిరీటి దామరాజు, రాఘవ ముగ్గురికి అమిత్ తివారి గ్రీన్ఇండియా ఛాలెంజ్ విసిరారు.

## జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్, ఫిబ్రవరి 16:భార్య మందలించిందని మనస్తాపం చెందిన జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి అంజయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అల్వాల్ లోని జొన్నబండలో జరిగింది. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జొన్నబండలో భార్య, పిల్లలతో నివసించే అంజయ్య(32) జీహెచ్ఎంసీలో చెత్త తరలింపు వాహనం డ్రైవర్ గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం అంజయ్య తన తండ్రి, తమ్ముడి వద్ద కొంత అప్పు తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించకపోవడంతో.. అంజయ్య కుటుంబంలో మెల్లగా గొడవలు మొదలయ్యాయి.

ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం కూడా వదిన లక్ష్మమ్మతో మరిది గొడవడ్డాడు. సాయంత్రం ఇంటికొచ్చిన భర్త అంజయ్యకు.. లక్ష్మమ్మ జరిగిన విషయం చెబుతూ.. ఇదంతా నీవల్లే అని అంజయ్యను గద్దించింది. భార్య గొడవతో మనస్తాపం చెందిన అంజయ్య.. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## తార్నాకలో రోడ్డు ప్రమాదం, వ్యక్తి మృతి..



హైదరాబాద్, ఫిబ్రవరి 16: తార్నాక చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చంగిచర్ల ప్రాంతానికి చెందిన కడప కోటేశ్వర్ (55) వృత్తి రీత్యా టైలర్ పని చేసుకుంటాడు. సికింద్రాబాద్ నుండి ఉప్పల్ వెళ్తుండగా, వెనకాలే వస్తున్న జీ.హెచ్.ఎం.సి చెత్త లారీ లాలపేట్ వైపు వెళ్లే క్రమంలో తార్నాక చౌరస్తాలో స్కూటీని ఢీకొట్టింది. దీంతో కోటేశ్వర్ స్పాట్ లోనే చనిపోయాడు.

దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తలకు హెల్మెట్ దరించలేని కారణంగానే అతను స్పాట్ లో చనిపోయాడని, హెల్మెట్ ధరించి ఉంటే ప్రమాదం తప్పేదని సీఐ రమేష్ నాయక్ పేర్కొన్నారు.

## స్ప్రింగ్, సమ్మర్ కలెక్షన్‌ను ఆవిష్కరించిన లైఫ్‌స్టైల్

హైదరాబాద్, ఫిబ్రవరి 16:తాజా ధోరణులకు అగ్రగామి ఫ్యాషన్ కేంద్రంగా వెలుగొందుతున్న లైఫ్‌స్టైల్ తమ స్ప్రింగ్, సమ్మర్ కలెక్షన్‌ను సోమవారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా లైఫ్‌స్టైల్ సీఈవో దేవరంజన్ అయ్యర్ మాట్లాడుతూ తమ నూతన స్ప్రింగ్/సమ్మర్ కలెక్షన్ పట్ల తాము చాలా సంతోషంగా ఉన్నామన్నారు. ఇది హై స్టైల్ సమ్మర్ ఫ్యాషన్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఎంపిక చేసిన కలెక్షన్ అన్నారు. ఆహ్లాదకరమైన ధరల్లో ఇది లభ్యమవుతుందన్నారు. ఈ స్ప్రింగ్, సమ్మర్ సీజన్‌ను ఆహ్లాదకరమైన రంగులు, ఆనందం, సానుకూలతతో ముడిపడి ఉందన్నారు. తాజా ధోరణుల్లో ఈ వైబ్స్‌ను ప్రతిబింబించేలా తమ కలెక్షన్‌ను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ స్టోర్లు, ఆన్‌లైన్‌లో తమ కలెక్షన్‌ను అన్వేషించాల్సిందిగా తమ వినియోగదారులను ఆహ్వానిస్తున్నా మన్నారు. ఈ నూతన సీజన్‌ను సరికొత్త శైలిలో ఆహ్వానించాల్సిందిగా కోరుతున్నాముని అన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.